పురాణాలు - కుల వ్యవస్థ III

# షట్చక్రవర్తులు

డా॥ విజయ భారతి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

## పురాణాలు - కుల వ్యవస్థ - III

# షట్చక్రవర్తులు

డా॥ బి. విజయ భారతి

LIKHITA PRESS
HIG - II, Block-12, F-1,
Baghlingampally,
HYDERABAD - 500 044.

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

294.5925

C-15907

AC No. 81080

-500 044.

ధర : రూ. 20/-

ప్రథమ ముద్రణ : ఆగస్టు, 2003

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 28, ఫోన్ : 23521849

---

ముద్రణ : నవ్య ప్రింటర్స్, సోమాజిగూడ, హైదరాబాద్. ఫోన్: 23314147

# విషయసూచిక


ఉపోద్ఘాతం . . . . . . . . 5

I. పురోహిత వ్యవస్థ - ఆధిపత్యం . . . . . . . . 11

II. రాజు - వర్ణాశ్రమ ధర్మాలు . . . . . . . . 13

V. రాజు - దండనీతి . . . . . . . . 16

V. షోడశ మహారాజులు . . . . . . . . 18

1. సుహోత్రుడు . . . . . . . . 18
2. అంగుడు . . . . . . . . 18
3. మరుత్తు . . . . . . . . 18
4. శిబి . . . . . . . . 19
5. దశరథరాముడు . . . . . . . . 19
6. భగీరథుడు . . . . . . . . 20
7. దిలీపుడు . . . . . . . . 20
8. మాంధాత . . . . . . . . 21
9. యయాతి . . . . . . . . 22
10. అంబరీషుడు . . . . . . . . 25
11. శశిబిందుడు . . . . . . . . 25
12. గయుడు . . . . . . . . 26

13. రంతిదేవుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 26

14. భరతుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 26

15. పృథుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 26

16. పరశురాముడు . . . . . . . . . . . . . . . . . . . . . . . . 27

VI. షట్చక్రవర్తులు

1. పురూరవుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . . 30

2. పురుకుత్సుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . 31

3. హరిశ్చంద్రుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . 40

4. సగరుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 44

5. నలుడు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 46

6. కార్తవీర్యార్జునుడు . . . . . . . . . . . . . . . . . . . . . 53

అనుబంధం 1 . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 64

అనుబంధం 2 . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 65

అనుబంధం 3 . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 66

పట్టికలు I-IV

# పురాణాలు - కుల వ్యవస్థ

# షట్చక్రవర్తులు

## ఉపోద్ఘాతం

భారత దేశ ప్రాచీన సారస్వతంలో షోడశ మహారాజులూ, షట్చక్రవర్తులూ ప్రసిద్ధులు. సుహోత్రుడు, అంగుడు, మరుత్తు, శిబి, దశరథరాముడు, భగీరథుడు, దిలీపుడు, మాంధాత, యయాతి, అంబరీషుడు, శశిబిందుడు, గయుడు, రంతిదేవుడు, భరతుడు, పృథుడు, పరశురాముడు అనే పదహారుమంది రాజులను షోడశ మహారాజులుగా పరిగణిస్తారు.

అలాగే హరిశ్చంద్రుడు, నలుడు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు, కార్తవీర్యుడు అనే ఆరుగురినీ షట్చక్రవర్తులుగా పరిగణిస్తారు. వీళ్ళు వర్ణాశ్రమ ధర్మాన్ని కాపాడుతూ భారత దేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా పాలించినట్టు కీర్తించబడ్డారు. ఈ పేర్లు మనకు పురాణాలలో తరచుగా కనిపిస్తాయి.వాటిలోని సమాచారానికి కాలానుగుణంగా మరికొంత జోడిస్తూ వర్ణ ధర్మ వ్యవస్థను అనుసరించే సమాజంకోసం వారిని గొప్ప మార్గ దర్శకులుగా తీర్చి దిద్దుతూ ప్రచారం చేశాయి, భారత భాగవతాల వంటి గ్రంథాలు.

వర్ణాశ్రమ ధర్మాలను కాపాడే రాజులనూ చక్రవర్తులనూ సృష్టించవలసిన అవసరం ఎందుకు కలిగిందో ఆలోచిస్తే చరిత్ర నేపధ్యంలోకి వెళ్ళాల్సి వస్తుంది.

భారత దేశంలోని జాతులలో నీగ్రాయిడ్, ఆస్ట్రలాయిడ్ మంగోలాయిడ్ లక్షణాలున్నట్టు మానవ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఈ జాతుల పూర్వీకులందరూ ఆయా కాలాల్లో ఈ దేశానికి వలస వచ్చిన వారే. ఆహారాన్వేషణలో ఇలాంటి వలసలు మామూలే. ఈనాటికీ రకరకాల కారణాల వల్ల వలసలు సాగుతూనే ఉన్నాయి.

ప్రాచీన కాలంలో చాలా జాతులు బాల్టిక్ ప్రాంతం నుండి రష్యాలోని యూరల్ పర్వత ప్రాంతాలకు, తూర్పు యూరోపుకు, ఆసియాలోని కాస్పియన్ సముద్ర ప్రాంతం వైపుకు, ఇరాన్ వైపుకు, సింధునదీ పరీవాహక ప్రాంతాల వైపుకూ వలసలు సాగించాయి. ఆ క్రమంలో బ్రహ్మదేశం నుంచి (భారత దేశపు వాయువ్య ప్రాంతాలు) కొన్ని తెగలు భారత దేశంలో ప్రవేశించాయి. గుంపులు గుంపులుగా కొత్త తెగలు రావటం ఆక్రమణలు సాగించటం, స్థానికులను జయించగలిగితే జయించి తరిమికొట్టటం - అనువు కాకపోతే వారితో సఖ్యంగా ఉండటం - వారితో సహజీవనం సాగిస్తూ తమ కార్యకలాపాలు విస్తరించుకోవటం ఇలా జరుగుతూ వచ్చింది.

ఇలా వలస వచ్చిన జాతులలో కొన్ని తెగలు ఆయా ప్రాంతాలలో తమ అధికారాలు స్థిరం చేసుకొని సంస్కృతి పరంగా ఆచార వ్యవహారాల పరంగా తాము ఇతరుల కంటె అధికులమని నిరూపించుకునే క్రమంలో తమకంటూ తాము కొన్ని నియమాలు, కర్మ కాండ ఏర్పరచుకున్నారు.

భారత దేశానికి వలస వచ్చిన జాతులు ఎక్కువగా భరత వర్షపు జనపదాల నుంచి వచ్చిన వారే. భరత వర్షంలోని ఏడు కుల పర్వతాలూ మందరం, కోలాహలం వంటి చిన్న పర్వతాలూ పక్కకు పెడితే మిగిలిన చిన్న చిన్న గుట్టలు కొండల దగ్గరి జనపదాలలో ఆర్యులు మ్లేచ్ఛులు ఉంటారని వరాహ పురాణం చెబుతున్నది.

"తేషా మార్యా మ్లేచ్ఛా జనపదా వసన్తి.." (అధ్యా. 85. వ. 2)

ఈ విధంగా చూస్తే ఆర్యులూ మ్లేచ్ఛులూ ప్రక్క ప్రక్క ఊళ్ళ వాళ్ళే. ఒకరినొకరు మించటానికి ఆచారాల పేరిట కర్మకాండ ఏర్పాటు చేసుకుని ఉంటారు.

మానవ జాతి అభివృద్ధి చెందుతున్న క్రమంలో సంచార జాతులుగా జీవనం గడపే దశ నుంచి వ్యవసాయం చేసే దశకు ఎదిగే నాటికి - పాతరాతియుగం కొత్త రాతియుగం దశలు దాటి లోహ యుగంలోకి అడుగు పెట్టే నాటికి మానవుల జీవిత విధానాలలో చాలా మార్పులు వచ్చాయి. కీకారణ్యాలు ఛేదించి పంట పొలాలుగా సాగు చేయటం మొదలయింది. వృత్తి పనులు విస్తరించాయి. వాణిజ్యావసరాలకూ వ్యవసాయానికీ ఉత్తరాపథంలోని గంగా యమున నర్మదా నదుల ప్రవాహాలు అనుకూలించాయి. ఆయా తీర ప్రాంతాలలో నగరాలు, రాజ్యాలు ఏర్పడ్డాయి.

వ్యవసాయానికీ వాణిజ్యానికీ పశు సంపదను రక్షించుకోవలసిన అవసరం ఏర్పడి కొన్ని వర్గాలు యజ్ఞాలను, యజ్ఞాలలో జంతు బలులను అధిగించాయి. పాలక వర్గాలకూ పాలితులకూ కొన్ని కొన్ని విషయాలలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఒకరొకరి ఆధిక్యాన్ని ప్రశ్నించుకోవటం మొదలయింది.

జనకుడు, కేకయరాజు వంటి పాలకవర్గాల వ్యక్తులు అధ్యాత్మ విద్యలో ఆసక్తిచూపారు. రాజుల పోషణలో అధ్యాత్మ విద్యా కేంద్రాలు ఏర్పడ్డాయి. వేనుని వంటి రాజులు కర్మకాండను నిరసించారు. అయినా కర్మకాండ యజ్ఞ క్రతువులూ తగ్గలేదు. ఆడంబరం పెచ్చుపెరిగి జంతుబలులతో దానాదికాలతో ఎంతో ఆర్భాటంగా యజ్ఞాలు సాగుతూనే ఉండేవి. వేద మంత్రాలు నేర్చిన ద్విజ వర్గానికే అన్ని దానాలూ గౌరవాలూ లభించేవి. సమస్తమూ బ్రాహ్మణాధీనం అన్న ప్రచారం జరిగింది.

దైవాధీనం జగత్ సర్వం

మంత్రాధీనం తుదైవతా

తన్మంత్రం బ్రాహ్మణాధీనం

బ్రహ్మణో మమ దేవతా.

(జగత్తు సర్వమూ దైవం అధీనంలో ఉంది. ఆ దైవం మంత్రం అధీనంలో ఉంటాడు. ఆ మంత్రం బ్రాహ్మణుని అధీనంలో ఉంటుంది. అంచేత బ్రాహ్మణుడే నా దేవత.)

షోడశ రాజుల చరిత్రల్లో వైదిక కర్మకాండ వైభోగాన్నీ షట్చక్రవర్తుల చరిత్రల్లో రాజులపై పురోహితుల ఆధిపత్యాన్నీ చూడవచ్చు.

పురోహితవ్యవస్థపై అనమ్మతి పెరిగి పోయిన దశలో వైదిక మతంలోని కర్మకాండపై తిరుగుబాటుగా వచ్చాయి. జైన బౌద్ధాలు. జైనమత ప్రవర్తకుడు వర్ధమాన మహావీరుడూ బౌద్ధమత ప్రవర్తకుడు గౌతమబుద్ధుడూ రాజవంశాలవారే కావటం గమనించదగ్గది.

జంతు బలుల పట్ల వైముఖ్యం పెంచుకొన్న వర్గాలవారూ పురోహిత వర్గాల ఆధిపత్యానికి బలి అవుతున్న వర్గాలవారూ జైన బౌద్ధాల వైపు ఆకర్షితులయ్యారు.

పురోహిత వర్గపు అధికార పరిధి తగ్గింది. జైన మతం కన్న బౌద్ధం సామాన్య జనులలో ఎక్కువ ప్రచారమైంది. ఆ దశలో వైదిక ధర్మ పునరుద్ధరణకు శాస్త్రాలను సవరించారు. వర్ణధర్మాలనూ రాజధర్మాలనూ పటిష్ఠం చేశారు. పురాణాలూ అవతార గాథలూ బాగా ప్రచారంలోకి తెచ్చారు. నారాయణుని మూల పురుషునిగా నిలబెట్టారు. చదువులు కొన్ని వర్గాలకే పరిమితం చేస్తూ మత్స్యావతారం తెచ్చారు. యజ్ఞాలను కాదనే వారిపై యజ్ఞ వరాహవతారాన్ని ఎక్కుపెట్టారు. రాజులు వరాహ లాంఛనులయ్యారు. బుద్ధుని నుంచి జనాన్ని మరలించే ఎత్తుగడలో బుద్ధుడిని కూడా అవతారాలలో చేర్చారు. నారాయణుడు ప్రాచీనుడు, బుద్ధునికంటె ముందు ఎనిమిది అవతారాలు ఎత్తి ప్రజలను ఉద్ధరించాడు. బుద్ధుడుగా తొమ్మిదోసారి ఇలా వచ్చాడు - అని జనాన్ని నమ్మించే కథలు అల్లారు.

ఎందుకైనా అవసరం పడుతుందని 'కల్కి'ని పదో అవతారంగా రిజర్వులో పెట్టారు.

ఇంద్రుణ్ని ఎదిరించి నిలిచిన యాదవ వీరుడు వాసుదేవ కృష్ణుణ్ణి తమలో కలిపేసుకుని అతని పేరిట సమ్మోహనంగా కర్మ సిద్ధాంతం ప్రచారం చేసి దాంతో జనాన్ని కట్టి పడేశారు.

పూర్వజన్మలో చేసిన కర్మలు (పాపపుణ్యాలు) తర్వాతి జన్మలోని కష్టనష్టాలకు దారి తీస్తున్నాయనే వాదం వల్ల బలపడుతున్నదీ లాభం పొందుతున్నదీ కొన్ని వర్గాలవారు. వారి ప్రయత్నాలకు పురాణాలు మంచి సాధనాలయ్యాయి.

పూర్వం ఇప్పటి లాగా పుస్తకాలు ఎక్కువ కాపీలు దొరికేవి కావు. ఎవరికైనా ఒక పుస్తకం కావాలంటే అది ఎవరి దగ్గర ఉందో ముందుగా తెలుసుకుని ఆ సొంతదారు అనుమతితో అక్కడే కూచుని కాపీ చేసుకోవలసి వచ్చేది. సాధారణంగా ఇలాంటి కాపీ చేసే పనులు (ప్రతులు తయారు చేయటం) శిష్యులు గురువుగారి కోసం చేస్తుండేవారు. అలా కాపీలు

తీయటంలో ఎన్నో మార్పులు చేర్పులు జరుగుతుండేవి. నాలుగైదు కాపీలు తీసేసరికి మూల గ్రంథం కంటె ఇది భిన్నంగా తయారు కావటమూ జరిగేది.

స్వచ్ఛమైన మనసులో ఏదైనా విషయం బలంగా నాటుకోవాలంటే సిద్ధాంతం చెప్తే చాలదు. దానికి దృష్టాంతాలు చూపాలి. దృశ్యకావ్యం లాగా (నాటకం లాగా) కళ్ళముందు పాత్రలను నిలబెడితే వారి చేత పదే పదే డైలాగులు (సంభాషణలు) చెప్పిస్తే అప్పుడు ఆ దృశ్యాలు - మాటలు వారి మనస్సులో గాఢంగా నాటుకుంటాయి.

అందుకే చిన్న పిల్లలకు పాఠాలు బొమ్మలతో మొదలు పెడతారు. A for Apple, B for Boy అనీ తెలుగులో అయితే అల, తల, వల, అంటూనూ.

అదే ధోరణిలో నీతి పాఠాలు కథలలో ఇముడుస్తారు.

కథ ఆసక్తిగా వినిపించాక అంతరార్థాన్ని 'నీతిగా' బోధిస్తారు. పాఠం చివర 'నీతి' అంటూ స్పష్టంగా ఇస్తారు. ఇదే రీతిలో ప్రజలకు ఆసక్తికరమైన కథలతో అద్భుతమైన పాత్రలతో పురాణ వాఙ్మయం రూపొందింది. సృష్టిలో జరుగుతున్న పరిణామాలనూ వింతలనూ అర్థం చేసుకొనే ప్రయత్నంలో మానవుడు ఏర్పరచుకొన్న ఊహలూ, నమ్మకాలూ కథలుగా ప్రచారమయి ఉండవచ్చు. ప్రకృతి ఘటనల వెనుక ఏదో అతీత శక్తి ఉన్నదనే నమ్మకం మతానికి పునాది. ఆ శక్తి మహిమలు - వైవిధ్యం - మేలుచేసే శక్తులు, హాని చేసే శక్తులు - వాటిని ప్రసన్నం చేసుకొనే ఉపాయాలు, పూజలు, కర్మలు - యజ్ఞాలు - మిత్రగణాలు, శత్రు గణాలు - ఇలా వేదకాలం నాటి వాఙ్మయం రూపొంది ఉండవచ్చు. సమాజాలు పెరుగుతున్న కొద్దీ పోటీ తత్త్వం, మనుగడ కోసం పోరాటం తప్పనిసరి అవుతుంది. ఎవరికి వారు తమకు అనుకూల వాతావరణాన్ని ఏర్పరచుకోవాలనుకుంటారు.

సమాజంలో కొన్ని వర్గాల అనుకూల వ్యవస్థను స్థిరపరచే ప్రయత్నంలో పురాణ కథలు దృశ్య కావ్యాలు చేసే పనులు నిర్వర్తించాయి. ఆయా కాలాల్లోని కొన్ని కొన్ని వాదాలు వాటిలో చేరిపోయాయి. వాటిని అధికారికంగా కొందరిచేత చెప్పించారు.

వర్ణ ధర్మాన్ని పాటించటం ప్రజలకు తప్పనిసరి అని చాటిన పాత్రలలో చక్రవర్తులు, రాజులు, యోగులు, భోగులు, భక్తులు, పతివ్రతలు మొ॥ అన్ని వర్గాల వారూ కనిపిస్తారు. పురాణాలలోనూ భారత భాగవతాలలోనూ ఉన్న రాజుల చరిత్రలూ, దేవగణాల / అసుర గణాల కథలూ పరిశీలిస్తే అధికారం కోసం పోరాటం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజలను మూఢ భక్తిలో ముంచెత్తుతున్న అవతార గాథలలోనూ ఇవే కథలు మతం ముసుగులో కనిపిస్తాయి.

వర్గ వైషమ్యం, వైయక్తిక వైషమ్యం, జాతి వైషమ్యంగా రూపు దిద్దుకున్న సంఘటనలూ చాలా కనిపిస్తాయి.

వ్యక్తికి సుఖాలపై ఉన్న ఆసక్తి, ఇంద్రియ లోలత్వం - జీవితంపై ఆశ - ఇవన్నీ

సమాజాల భవిష్యత్తునే మార్చివేయటం భారత దేశ ప్రాచీన సారస్వతంలో కనిపిస్తుంది. మచ్చుకు ఒకటి రెండు ఉదాహరణలు చూద్దాం.

యయాతి అనే భోగలాలసుడైన రాజు కొడుకులను పిలిచి తన వృద్ధాప్యాన్ని తీసుకుని వారి యౌవనాన్ని ఇమ్మని కోరతాడు. అందుకు అంగీకరించని కొడుకులను రాజ్యానికి అయోగ్యులుగా, వారు మరో కులంగా రూపొందేలా శపిస్తాడు. (ఇతని కథను మునుముందు మరింత వివరంగా చూద్దాం).

విశ్వామిత్రుడు అనే ముని తనమాట విననందుకు తన కొడుకులను కుక్కమాంసం తినే మ్లేచ్ఛులుగా అవుతారని శపించాడు. హరిశ్చంద్రుని తండ్రి అయిన సత్యవ్రతుడు (త్రిశంకుడు) కులగురువు వసిష్ఠునిచేత శాపానికి గురయ్యాడు. ఒక సందర్భంలో సత్యవ్రతుడు తనకోసం ఒక యజ్ఞం నిర్వహించి పెట్టవలసిందిగా వసిష్ఠుని కోరతాడు. వసిష్ఠుడు తనకు వీలు కాదంటాడు. అయితే మరొకరిచేత చేయించుకుంటానంటాడు సత్యవ్రతుడు. అది తనకు అవమానంగా అనిపించిన వశిష్ఠుడు సత్రవ్రతుడిని చండాలుడివి అవుతావని శపిస్తాడు.

పురాణాలు చెప్పే మ్లేచ్ఛులూ, చండాలురూ, కిరాతులూ అంతా ఇలా శాపగ్రస్తులయిన వారి వంశీయులేనన్నమాట -

చరిత్ర పరంగా, పురావస్తు పరిశోధనల పరంగా ఉండే వాస్తవాలు వేరే ఉండవచ్చుగాక - భారతీయులు నమ్మే పురాణాలలోని కథలు ఇవీ.

ఉన్నత వర్గాలు, నిమ్న వర్గాలు - ఆధిపత్య కులాలు , దాస్య కులాలు - ఇలా సమాజం చీలికలుగా అయింది.

శాస్త్రాల పట్లా పురాణాల పట్లా భక్తి శ్రద్ధలు చూపే భారతీయులు ఈ చండాల/ కిరాత జాతులు అతి శ్రేష్ఠులైన ఇక్ష్వాకు వంశ రాజులనుండీ, మహర్షులైన విశ్వామిత్రుల నుండీ ఆవిర్భవించాయన్న సత్యాన్ని (అదీ పురాణాలు చెప్పిందే) ఎందుకు గుర్తు పెట్టుకోవటం లేదు? వారి పట్ల వివక్ష ఎందుకు చూపుతున్నారు?

వర్ణధర్మం ఏ ఆధారంతో ఏ ప్రాతిపదికమీద ప్రవచించారు? ఏ ఆధారాలతో ప్రచారం చేస్తున్నారు?

వర్ణాశ్రమధర్మ వ్యవస్థకు ఏ ఉద్దేశంతో పునాది వేశారు? దాన్ని ఎలా నిలబెట్టు కుంటూ వస్తున్నారు? ఎందుకు నిలబెట్టుకుంటూ వస్తున్నారు? ఇవన్నీ ఈ వ్యవస్థలోని ప్రతివారు ప్రశ్నించుకోవలసిన సమస్యలు, విప్పవలసిన చిక్కుముడులు.

ఈ కుహనా వ్యవస్థకు ఏ విధమైన శాస్త్రీయ పునాదులూ లేవన్న సంగతి పండితులకు తెలును. పురాణాలలోనూ ఇతి హాసాలలోనూ చెప్పే విషయాలలో పరస్పర

వ్యాఘాతాలున్నట్టు కూడా వారికి తెలుసు. అయినా వాటిని సమయానుకూలంగా మలచుకొంటూ సాగిపోతున్నది హిందూ జన జీవన ప్రవంతి.

అయితే ఇక్కడ చిత్రం ఏమిటంటే పుక్కిటి పురాణాలన్నీ నమ్మే జనం, చండాలురు కిరాతులు, మ్లేచ్ఛులు తమలోనించే ఏర్పడ్డారన్న కథలు నమ్మటంలేదు. స్వార్థపూరితమైన మేధావివర్గం వారిని నమ్మనీయలేదు. శాపగ్రస్తులను వంశపారం పర్యంగా సమాజం నుంచి వేరు చేశారు. వారు వేరే జాతిఅనీ వేరే వర్ణంఅనీ చెప్పారు.

శాపగ్రస్త కులాలు ఒకరకంగా Criminal Tribes లాంటివి. తరవాతి కాలంలో వారి చుట్టూ కల్పనలు చేరాయి. వారు తమలాగా కాక (యజ్ఞ) పురుషుని కిందిభాగాల నుంచి పుట్టారని కథలు అల్లారు. శాపగ్రస్తులు కాబట్టి శిక్షగా వారిచేత హీనమైన పనులు చేయించారు. కొన్ని వర్గాలను నిమ్న కులాలుగా చేసి చూడరాని, చెప్పరాని, అంటరాని వర్గాలుగా చేశారు. అగ్రకులాల అభిజాత్యం, అహంకారం ఎక్కువయ్యే కొద్దీ కిందికులాలు మరింత కిందికి దిగిపోతూ వచ్చాయి.

శూద్రకులాల ఆవిర్భావాన్ని గురించి ఎన్నో సిద్ధాంతాలున్నాయి.

డా॥ అంబేద్కర్ కులాల పుట్టుకను గురించి విస్తృతంగా అధ్యయనం చేసి ఎన్నో రచనలు చేశారు. పురాణ కథలను విశ్లేషించి చూపారు. వాటిని యువతరం తప్పక చదవవలసి ఉంది.

కులవృత్తులు స్థిర పరచటం ద్వారా భారత దేశంలో మేధావి వర్గం ప్రవేశపెట్టిన సామాజిక వ్యవస్థ వర్ణ వ్యస్థకు దారితీసింది. వర్ణ వ్యవస్థ సామాజిక అసమానతకూ, ఆర్థిక అసమానతకూ దారి తీసింది.

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణాలలో గౌరవ ప్రదమైన వృత్తులు పై మూడు వర్ణాలకూ ఏర్పాటైనాయి.

విద్యావంతులు కాబట్టి విప్రులను సమాజంలో గౌరవించేవారు.

"విద్యావాన్ విప్రా, వీర్యవాన్ క్షత్రియా"

విద్యతో విప్రులు (బ్రాహ్మణులు), బలంతో క్షత్రియులూ సమాజంలో గౌరవాన్నీ తద్వారా ధనాన్నీ పొందారు. వ్యాపారంతో వైశ్యులు పరిఢవిల్లారు. నిన్న మొన్నటి వరకూ ఉన్న వ్యవస్థ ఇది. శూద్రులు అన్నింటికీ దూరమై శ్రమ జీవులుగా మిగిలారు.

చాలా కాలానికి వారికి విద్య అందుబాటులోకి వచ్చినా చిరకాలంగా స్థిరపడి పోయిన భావజాలంలో మాత్రం మార్పురాలేదు. మార్పు రాకుండా పై వర్ణాలు ఎప్పటి కప్పుడు జాగ్రత్త పడుతూ వచ్చాయి.

వృత్తి పనులు నేర్పే ఉపాధ్యాయులను 'ఓఝు'లుగా పిలిచే వారని శాసనాల ద్వారా తెలుస్తున్నది. వీరే 'వఝులు'. వీరికి జీవన భృతి కింద ఏర్పాటు చేసిన స్వామ్యాలు వోజరికాలు. వోజరికాల ద్వారా వచ్చే ఆదాయంతో, వనరులతో వారు జీవించే వారు. ఇది చాలా గౌరవ ప్రదంగా సాగిపోతున్న వ్యవస్థ. వృత్తి పనుల కంటె వేద పఠనమూ వేదాంత చర్చలూ చాలా గొప్పవని నిరూపించే యత్నంలో పురోహిత వర్గం చేసిన కృషి సమాజంలో హెచ్చు తగ్గులకు దారి తీసింది.

- అధిపత్యాన్ని ఆశించే వర్గం తన ప్రయోజనాలను మొదట సాధారణ ప్రయోజనాలుగా చూపెడుతుంది. అవి అందే సమయానికి తాను చేజిక్కించుకుంటుంది. అందుకోసం ముందే ప్రణాళిక సిద్ధం చేసుకుంటుంది. ఈ సాధారణ ప్రయోజనమే రాజ్యం వంటి స్వతంత్ర రూపం ధరిస్తుంది - అంటారు రాజనీతి వేత్తలు.

దేవాసురులు అమృతం కోసం సాగించిన సముద్ర మథనం సరిగ్గా దీనికి ఉదాహరణ.

పూర్వం సమాజం మీదా ఆర్థిక రాజకీయ వ్యవస్థల మీదా పాలనా సంస్థలు ఆధారపడి ఉండేవి. పాలకులనూ సమాజాన్నీ తమ చెప్పు చేతల్లో ఉంచుకోవటానికి ఆ సంస్థలు (Institution) కృషి చేస్తుండేవి. బ్రాహ్మణ పురోహిత వర్గం అలా రూపొందినదే. నేటి ఉద్యోగి స్వామ్య వ్యవస్థ లాంటిదే అదీనూ. పాలక వర్గాలకు సహకరిస్తున్నట్టుగానే ఉంటూ కావాలనుకున్నప్పుడు వారినే శాసించగల లక్షణం ఆనాటి పురోహిత వర్గానికి ఉంది. నేటి ప్రజస్వామ్యపు ఉద్యోగి స్వామ్యంలోనూ ఇది కనిపిస్తుంది.

ఉద్యోగి స్వామ్యంలో సద్విధులు - దుర్విధుల అంశాల మధ్య ఉన్న సహజ వైరుధ్యాన్ని అంగీకరిస్తున్న మార్క్స్ సిద్ధాంతం సంతులితమైనదే ఈ విషయంలో పాలక వర్గాల ప్రయోజనాలను రక్షించే సాధన వ్యవస్థగా మొదట పురోహిత వ్యవస్థ అవతరించిందని అనుకోవచ్చు.

## పురోహిత వ్యవస్థ - ఆధిపత్యం

ఉత్కృష్టమైన జన్మ కలవాడు కాబట్టి బ్రాహ్మణుడు అన్ని వర్ణాలకూ అధిపతి అట. ఈ భూమి మీది సమస్తమూ అనుభవించటానికీ, ధారబోయటానికీ అతనికి హక్కు ఉన్నదట. ఈ నీతిని పురాణాలూ భారత భాగవతాలూ ప్రచారం చేశాయి. పురూరవ మహారాజు దగ్గర్నించీ ఈ నీతి పాటిస్తున్నారు

పురోహితునికి సర్వ సంపదలూ సమర్పించి రాజు అహంకారం లేనివాడై దండనీతి పాటించాలి, అని చెప్పారు.

దండనీతి అంటే, బలహీనులైన శత్రువులను జయించటం - వర్ణాశ్రమ ధర్మాలు అమలు పరచటం. సాధారణంగా కుల గురువులు రాజులకు ఈ ధర్మాలు ఉపదేశిస్తుంటారు.

మానవాతీతులచేత కూడా ఇవి చెప్పించారు.

ముచుకుందుడనే రాజుకు కుబేరుడూ, పురూరవునికీ కార్త వీర్యునికీ వాయుదేవుడూ ఉపదేశించిన నీతులు ఆధికారికంగా ఉన్నాయి. వాయుదేవుడు లోక సంచారి కాబట్టి అతని వాక్కు ప్రామాణికంగా పరిగణించే వారు. అశరీరవాణి పలకటమూ ఇలాంటిదే - వారు చెప్పినట్టుగా ఈ ధర్మాలు క్రమానుగతంగా చలామణి అవుతూ వచ్చాయి.

ధర్మానికి బ్రాహ్మణ జనం జనన దేశమట. అంచేత రాజు బ్రాహ్మణున్ని గౌరవించాలట. (భార. శాంతి. 2-402) అలా చెప్పించవలసిన అవసరం అప్పుడు ఏర్పడిందన్నమాట.

బ్రాహ్మణుడు తన ధర్మం విడిచి క్షాత్ర ధర్మం అవలంబిస్తే క్షత్ర సముడవుతాడు.

శూద్ర ధర్మం అవలంబిస్తే శూద్ర సముడవుతాడు.

వాణిజ్యం చేస్తే వైశ్య సముడవుతాడు, అని వృత్తి ధర్మాన్ని ప్రముఖంగా చెప్పింది భారతం (శాంతి పర్వం 2-330). అయితే దీన్ని పట్టించుకోకుండా ఏ వృత్తి చేసినా పుట్టుక ప్రధానమనే దాన్ని ప్రచారం చేశారు.

భారతం అరణ్యపర్వంలో నాలుగు యుగాలలోని ఆచారాలను గురించిన ప్రస్తావన ఉంది. (అరణ్య. 3-335-341). ఇది భీమునికి హనుమంతుడు చెప్పిన వివరం.

కృత యుగంలో కృతమేకాని కర్తవ్యం లేదట. ధర్మం నాలుగు పాదాలా ప్రవర్తిల్లు తుండేది. అచ్యుతుడు అక్కడ శుక్ల వర్ణంతో ఉండేవాడు. ఇందులో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు ఏక వేద క్రియా యోగ్యులై ఉండేవారు. ఒకే వేదం, ఒకే ధర్మం, అందరికీ.

అసూయ, అభిచారం (శత్రునాశనానికి చేసే కర్మ), దర్పం, కోపం - మదం, మాత్సర్యం, భయం, సంతాపం, వ్యాధి, ప్రజాక్షయం, ఇంద్రియ క్షయం మొదలైనవేవీలేవు. అంటే వివక్ష అనేది లేదు.

త్రేతాయుగంలో ధర్మం మూడు పాదాలతో ఉండేది. జనులు యజ్ఞ తపోదానాది క్రియలు మొదలు పెట్టారు. విష్ణువు రక్త వర్ణంతో ఉండేవాడు. అంటే ఒక పాదాన్ని పురోహిత వ్యవస్థ ఆవహించేసిందన్నమాట.

ద్వాపరంలో ధర్మం రెండు పాదాలతో ఉండేది. వేదాలు నాల్గు విధాలుగా ప్రచారమవుతాయి. వేదశాస్త్రార్థాదులతో కర్మలు జరుగుతుంటాయి. జనులు సత్య పరిహీణులు, కోరికలతో నిండి ఉంటారు. అందుకోసం యజ్ఞాలు చేస్తుంటారు. విష్ణువు నల్లనివాడు.

కలియుగంలో ధర్మం బలహీనమై ఒకే పాదంతో ఉంటుంది. అంటే అధర్మం మూడు పాళ్ళు ధర్మం ఒక పాలు అని అనుకోవాలి. రక్షకుడు కృష్ణుడు పసుపు రంగుతో ఉంటాడు.

ప్రజలు తమోగుణం కలిగి ఉండి కామక్రోధాదులకు వశులై ప్రవర్తిస్తారు; అని ఆంజనేయుడు చెప్పాడు.

సమధర్మం, సమన్యాయం, ఒకే వేదం, ఒకే వర్ణం, ఉండిన కాలం కృతయుగం. రాజనీతి, దండనీతి అవసర పడని కాలం అది.

త్రేతా, ద్వాపరయుగాల నాటికి కుహనా వ్యవస్థ ఏర్పడింది. స్వార్థం పెరిగింది. దోచుకోబడేవారూ, దోచుకునేవారూ అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి.

### రాజు - వర్ణాశ్రమ ధర్మాలు

రాజ్యాన్ని పాలించేవాడు రాజు. రాజుల పాలన ఎలా ఉండాలో పురాణాలు, స్మృతులు ధర్మ శాస్త్రాలు వివరంగా చెప్పాయి.

మత్స్య మహాపురాణంలో 28 అధ్యాయాలు (214-242) రాజ ధర్మాల గురించి విస్తరించి చెప్తున్నాయి.

సర్వ ప్రాణులనూ దండనీతితో రక్షించడం కోసం సకల దేవతాంశలనూ ముడి సరుకుగా తీసుకుని రాజును సృష్టించారట.

అన్ని వ్యసవ్థలూ 'రాజు' కేంద్రంగా నడుస్తాయి.

'రాజ రక్షితులై కాదె మహామునులతిఘోర తపంబు సేయుచు వేద విహిత ధర్మంబులు నడపుచు మహాశక్తి మంతులై యున్నవారు... ' అంటున్నారు మహాభారతంలో (ఆది. 2-175).

రాజ ధర్మాలలో వర్ణాశ్రమ ధర్మ సంరక్షణం ప్రధానమైనది.

'వర్ణానా మాశ్రమాంశ్చ న్యాయతోభిరక్షేత్' అంటున్నది గౌతమ ధర్మ శాస్త్రం (11-9).

స్మృతులూ, న్యాయ సూత్రాలూ, ధర్మ శాస్త్రాలూ రాసిన వారి దృష్టిలో వర్ణాశ్రమ ధర్మాలే సమస్తమూను. దేశం బాగా ఉండాలంటే వర్ణాశ్రమ ధర్మాలు కచ్చితంగా పాటించాలన్నారు.

పురాణాలలోనూ కావ్యాలలోనూ, ఒక రాజు పాలన బాగా ఉన్నది అని చెప్పటానికి నిదర్శనంగా ఆ రాజు రాజ్యంలో వర్ణాశ్రమ ధర్మాలు సక్రమంగా పాటింపబడుతున్నాయని వర్ణిస్తూ ఉంటారు. అవన్నీ వేదం చెప్పిన ధర్మాలు అని ప్రచారం జరిగింది.

రాజు యజ్ఞాలు చేస్తూ బ్రాహ్మణులను పోషిస్తూ ఉండాలని రాజ ధర్మాలలో ఉంది. మహాభారతం దండనీతినీ వర్ణ ధర్మాలనూ పదే పదే చెప్పింది.

యజ్ఞాల కంటె తపస్సు గొప్పదనీ - తపస్సు అంటే శరీరాన్ని శుష్కింప చేయటం కాదు - అహింస, సత్య వాక్యం, శమము (ఇంద్రియ నిగ్రహం), దయ అనేవి పాటించటం అనీ కూడా మహాభారతం చెప్పింది (శాంతి 2-348). బహుశ ఇది బౌద్ధ జైనాల ప్రభావంతో చేర్చినది కావచ్చు.

అయినప్పటికీ స్వార్థపరులూ - సోమరులూ అయిన కొన్ని వర్గాల మూలంగా యజ్ఞాలు ప్రముఖమై రాజుల కర్తవ్యంగా ప్రచారమయ్యాయి. బ్రాహ్మణ పోషణతో పాటుగా వర్ణ ధర్మ పరిరక్షణ ప్రచారంలోకి వచ్చి ప్రజానీకాన్ని విడగొట్టి మానవతా విలువలను వెనక్కు నెట్టి వేసింది. దండనీతితో వర్ణధర్మ పరిరక్షణ చేసిన రాజులనూ యజ్ఞాలు చేసిన రాజులనూ ఆదర్శ మూర్తులుగా ప్రచారం చేశారు. ఆ క్రమంలో పురాణాలు షోడశరాజులనూ షట్చక్రవర్తులనూ ప్రముఖంగా చెబుతున్నాయి. వారు యజ్ఞాలు చేయటమూ, బ్రాహ్మణులకు అపారంగా దానాలు చేయటమూ, దండనీతిని అందరకూ అమలు పరచి 'బ్రాహ్మణులు అదండ్యులు' అని వారిని మినహాయించటమూ అందుకు కారణాలు.

రామాయణంలో వాల్మీకి శ్రీరాముని పాలన గురించి చెబుతూ బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు లోభంలేని వారై తమ తమ కర్మల చేతనే సంతుష్టులై తమ తమ కర్మలలోనే ప్రవర్తిస్తున్నారు - అని చెప్పాడు (యుద్ధకాండ 131-199).

మహా భారతంలో రాజనీతి గురించీ రాజధర్మాల గురించీ చాలా ఉంది. ప్రధాన కథలోని పాత్రలూ ఉపాఖ్యానాలలోని పాత్రలూ ఒకరితో ఒకరు రాజనీతి గురించి మాట్లాడుకోవటం, రాజులు, పురోహితుల నుంచి రాజధర్మాలు వినటం - నారదుడు, వ్యాసుడు వంటివారు వచ్చినప్పుడు రాజధర్మాల గురించి ముచ్చటించుకోవటం వంటి సందర్భాలలో ప్రతిసారీ పునరుక్తంగా రాజధర్మాలు చెప్పారు. అన్ని ధర్మాలలోనూ వర్ణాశ్రమ ధర్మాల నిర్వహణకే పెద్దపీట వేశారు.

ప్రతి వంద పద్యాలకూ ఒక పది సార్లయినా వర్ణాల ప్రసక్తీ గోబ్రాహ్మణుల గొప్పదనమూ వినిపిస్తాయి.

ధర్మ రక్షణ చాలా కష్టమనీ తాను అడవులకు వెళ్ళి తపస్సు చేసుకుంటాననీ ధర్మరాజు అంటే, భీష్ముడు అతనికి సర్ది చెబుతూ - పూర్వపు రాజులు అందరూ ఈగ కాలి అంత అయినా వీసర పోకుండా ధర్మంలోనే నడిచారా ఏమిటి?

కోపమూ కామమూ లేకుండా పాలన చేస్తే చాలు. దానం, అధ్యయనం, యజ్ఞం, లాంటి వానిలో ప్రజలను కాపాడటం రాజుకు బ్రహ్మ దేవుడు విధించిన కర్తవ్యం. దీనిని విడనాడటం నరకానికి దారి చూసుకోవటమే. కాబట్టి వర్ణాశ్రమాలను ఏ విధంగానైనా నడపుకో..." అని చెప్పాడు.

"కావున వర్ణాశ్రమముల,
నేవిధముననైన నడపు లెడలకయుండం,
గావంగ నోపున్నృపతికి,
లేవలజళ్ళుభయలోక లీలలయందున్" (శాంతి. 2-337)

వర్ణాలు నాలుగు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. ఇవి పుట్టుకను బట్టి నిర్ణయిస్తారు. ఆశ్రమాలు నాలుగు. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం. ఇవి మనిషి జీవితంలోని దశలను సూచిస్తాయి.

నాలుగు వర్ణాల వారికీ వారి వారి వృత్తులు ధర్మ శాస్త్రాలు చెప్పాయి. వాటిని గురించి చాలా విపులంగా ముందు ముందు చెప్పుకోవచ్చు. ఆశ్రమాల గురించి చెప్పాలంటే మనిషి జీవితంలో మొదటిది బ్రహ్మచర్యాశ్రమం. బాల్యం - విద్యాభ్యాస కాలం -' ఇందులో గడుస్తాయి.

బ్రహ్మ చర్యాశ్రమంలో వేదాధ్యయనం కోసం గురుకులంలో 36 సంవత్సరాలు గడపాలట. లేదా అందులో సగం అంటే 18 సంవత్సరాలు. లేదా అందులో సగం అంటే తొమ్మిది సంవత్సరాలు. లేదా బాగా నేర్చుకునే వరకూ బ్రహచర్యవ్రతంలో గడపాలట. (మను. 3-1)

తర్వాతిది గృహస్థాశ్రమం - వివాహం, పిల్లలు కలగటం - వారిని పెంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దటం వారికి పెళ్ళిళ్ళు చెయ్యటం వంటివి అన్నీ ఇందులో గడుస్తాయి. కొడుకుకు కొడుకు పుట్టాక గాని తలవెంట్రుకలు నెరసిన తర్వాత గాని వానప్రస్థం స్వీకరించాలి. అంటే సంసార బంధాలు వదిలిపెట్టి, ఇల్లు వదిలిపెట్టి, వనభూములలో మునులలాగా గడపాలి. ఒక పూట వండుకొని తినవచ్చును. ఎక్కువగా పండ్లు - తింటూ గడపాలి.

చివరిది సన్యాసం - ఆయుస్సులో చివరి నాల్గవ భాగం కాలం ఇది. వంట పూర్తిగా వదిలేసి భిక్షాన్నంతోనే కడుపు నింపుకుంటూ మోక్షసిద్ధి కోసం ప్రయత్నిస్తూండటం దీనిలో ప్రధానం.

ఆశ్రమ వ్యవస్థ అగ్రవర్ణాలను - ముఖ్యంగా బ్రాహ్మణ క్షత్రియ వైశ్య కులాలను ఉద్దేశించే చెప్పినట్లు అర్థం చేసుకోవాలి. శూద్రులకు విద్య నిషేధం గనుక గురుకుల వాసం తపస్సు - అనే వాటి ప్రసక్తి రాదు.

వర్ణధర్మాల అమలుకు తీసుకున్న శ్రద్ధ ఆశ్రమ ధర్మాల విషయంలో తీసుకోలేదు; ఎందుకంటే,

వర్ణధర్మాల అమలులో పాలకవర్గాల సుఖమూ, భోగమూ ఉన్నాయి. అవి పటిష్ఠంగా అమలు జరిపితేనే గాని వారు సుఖపడటం సాధ్యం కాదు. అందుకే దండ నీతితో వాటిని అమలు జరిపారు. ఆశ్రమ ధర్మాల అమలుకు రాజులు దండనీతిని ప్రయోగించిన దాఖలాలు లేవు.

అయితే వానప్రస్థ సన్యాసాశ్రమ ధర్మాలు సరిగా పాటించక అక్కడ కూడా వంటా వార్పు మొదలు పెట్టటం వల్ల కింది వర్గాలకు ముఖ్యంగా గిరిజనులకు హాని జరిగింది.

మునులు తమ ఆశ్రమాలు విస్తరించుకుంటూ అటవీ భూములను ఆక్రమించటం వల్ల గిరిజనులను మరింత కీకారణ్యాలలోనికి తరిమి కొట్టినట్లు అయింది. వారి భూములూ రాజ్యాలూ హరించుకు పోయాయి.

**రాజు - దండనీతి**

మహాభారతం శాంతిపర్వం రెండో ఆశ్వాసంలో భీష్ముడు ధర్మరాజుకు దండనీతి జన్మ ప్రకారం తెలిపిన వివరాలు ఉన్నాయి.

కృతయుగంలో దండనీతిని ప్రయోగించటం అనేదే లేదట.

ప్రజలు ఒకరికొకరు రక్షకులై ఉండేవారు. రాజు అవసరమే లేకపోయింది. దండనీతిని అమలు చేయవలసిన అవసరమూ లేకపోయింది. ఆ తర్వాత కామం, రాగం వంటివి మనసులకు ఎక్కి ప్రజలు ధర్మదూరులై వేద విధ్వంసకులయ్యారు. వేదమూ, కర్మకాండ వంటివి లేకపోవటం చూసి ఇంద్రాదులు (దేవగణాలు) బ్రహ్మను ఆశ్రయించారు. ఆయన నూరువేల అధ్యాయాలతో నీతి శాస్త్రం రాసి ఇచ్చాడు. ఇది చదవటానికి మానవులకు ఆయుస్సు - బుద్ధీ కూడా చాలవని హరుడు, 'విశాలాక్షుడు' అనే పేరుతో పుట్టి దానిని పదివేల అధ్యాయాలకు సంక్షేపం చేశాడు. దానిని ఇంద్రుడు అయిదు వేలకు కుదించాడు. బృహస్పతి దానిని మూడు వేల అధ్యాయాలలో సంగ్రహించాడు. శుక్రుడు దానిని వెయ్యి అధ్యాయాల పరిమితికి తెచ్చాడు.

ఆ దండనీతి అమలు పరచటానికి సమర్థుడైనవాడు ఒకడు అవసరమయ్యాడు.

విష్ణువు 'విరజుడు' అనే వాడిని నిర్మించాడు. ఇతడు మానసపుత్రుడు. అంటే సంకల్పం వల్ల కలిగినవాడు. అయితే విరజుడు భూమికి ప్రభువుగా రానన్నాడు. అతనికొడుకు కర్దముడు కూడా రాజ్యం వద్దని తపస్సుకు వెళ్ళిపోయాడు. కర్దముని కొడుకు 'అనంగుడు', అతని కొడుకు 'నీతి', రాజులై దండనీతిని అమలుకు తెచ్చారు.

'నీతి' మృత్యు పుత్రి 'సునీథ'ను వివాహం చేసుకున్నాడు. వారి కుమారుడు. 'వేనుడు'. వేనునికి తల్లితండ్రి గుణాలు వచ్చాయట. అంచేత లోక కంటకుడుగా తయారయ్యాడట - అంటే పురోహిత వర్గాలను నెత్తిన పెట్టుకోలేదు. వేదాలు - యజ్ఞ కర్మలు పాటించలేదు.

అంచేత బ్రాహ్మణ వర్గం అతన్ని చంపేసింది.*

---

*వేనుని దుర్మార్గునిగా చిత్రిస్తూ విశ్వనాథ సత్యనారాయణగారు 'వేనరాజు' నాటకం రాశారు. దానికి జవాబుగా వేనుడు ధర్మమూర్తి అనీ అహింసావాది అనీ చెబుతూ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు 'ఖూనీ' నాటకం (1935) రాశారు. వేనుని తల్లి సునీథ బౌద్ధ ధర్మాలను అవగాహన చేసుకొన్న వనిత అనీ ఆమె ఆశయాలను వేనుడు ఆచరణలో పెట్టాడనీ బ్రాహ్మణవర్గం అతనిని ఖూనీ చేసిందనీ అందులో చెప్పారు

వేనుణ్ని చంపాక అతని రాజ్యానికి అతని శరీరం నుంచే వారసులను పుట్టించారు. వేనుని భావజాలం పనికి రాలేదు గాని అతని శరీరం పనికి వచ్చింది. వేనుని కుడి తొడను మథించారు. అందులోంచి ఒక నల్లని కురూపి వచ్చాడు. అతడు పురోహితులకు అనుకూలుడుగా లేడు. 'నిసేద' (తొలగిపో) అని అతన్ని రాజ్యం నుండి పంపేశారు. వారికి అతడు ఆమోదం కాలేదు. రాజ్యానికి వారసుడు కావలసిన అతని హక్కును లాక్కుని రాజ్యం నుంచి వెళ్ళగొట్టారు. అలా వెళ్ళగొట్టబడిన వాని సంతానం వారే నిషాదులు. వింధ్యాది పర్వత ప్రాంతాలలో క్రూర వర్తనంతో ఉన్నారట వారు. ఇది నిషాదుల పూర్వరంగం.

ఆ తర్వాత పురోహితులు వేనుని కుడి చేతిని మథించారు. అందులోంచి ఉజ్వల రూపంతో ఒక పురుషుడు వచ్చాడు.

'మునులారా మీరు ఏ పని చెప్పినా నేను చేయటానికి సిద్ధంగా ఉన్నాను' అంటూ వారికి విధేయుడై వారికి ఆమోదయోగ్యుడు అయ్యాడు. రాజ్యానికి వారసుడయ్యాడు.

అతడే పృధువు. పురోహిత వర్గానికి విధేయుడు. సర్వజంతువులకూ సమధర్మం నడుపుతానన్నాడు.

"దండనీత్యా శ్రమ ధర్మంబు (దండనీతిని ఆశ్రయించిన ధర్మం) నా పని. దీనిని శ్రద్ధగా చేస్తాను.... శ్రుతులను (వేదాలను) రక్షిస్తాను. వర్ణాలలో సంకరాలు జరగనివ్వను" అన్నాడు.

ముఖ్యంగా 'బ్రాహ్మణులు అదండ్యులు' (బ్రాహ్మణులను దండించకూడదు) అనే విషయం గుర్తుంచుకుంటాను' అని వారికి ప్రమాణం చేశాడు.

అప్పుడు వారు అతనికి రాజుగా పట్టాభిషేకం చేశారు.

ఈ విధమైన వాగ్దానాలు చెయ్యకపోవటం వల్లనే అంతకు ముందు పుట్టిన వాడిని నిషాదుడుగా ముద్రవేసి అడవులకు పంపేశారు.

తమకు విధేయుడుగా ఉన్న పృధుచక్రవర్తిని కూడా అనంతర కాలంలో దేవగణాలు విసిగించాయి. అతనితో గొడవ పెట్టుకున్నాయి. ఆ వివరాలు పృధు చక్రవర్తి దగ్గర చూడవచ్చు.

దేవగణాలకూ బ్రాహ్మణులకూ అనుకూలంగా నడచుకొన్నరాజులే నిలకడగా రాజ్యం పాలించగలిగారు. మంచి రాజులుగా పురాణాలు వారిని శ్లాఘించాయి. వారిని తరతరాలకూ ఆదర్శంగా చెప్పుకున్నారు. ధర్మరాజుకు కృష్ణుడు చెప్పినట్లుగా షోడశ రాజుల చరిత్రలు మహాభారతం శాంతి పర్వంలో (1-229-244) ఉన్నాయి. తమకు అనుకూల వ్యవస్థను స్థిరపరచుకోవటానికే కొన్ని వర్గాలు షోడశ రాజుల కథలు వ్యాప్తిలోకి తెచ్చాయి.

# షోడశ రాజులు

షోడశ రాజులు అంటే పదహారుమంది రాజులు అని అర్థం. వారి వివరాలు ఇవి.

## 1. సుహోత్రుడు

బ్రహ్మ క్షత్రుని (భుమన్యుని) కొడుకు. కురు జాంగల భూములు పాలించాడు. అనేక అశ్వమేధ రాజసూయ యాగాలు చేశాడు. ఇతని రాజ్యకాలంలో బంగారు చేపలు, మొసళ్ళు, తాబేళ్ళు వర్షంగా కురిసేవట. ఆయన వాటిని దానం చేస్తుండే వాడు. దేవతలకు ప్రీతికరంగా యజ్ఞాలు చేశాడు.

## 2. అంగుడు

ఊరుని (ఉల్ముకుని) కుమారుడు. యజ్ఞాలు దానాలు బాగా చేసేవాడు.

బంగారు నగలతో అలంకరించిన కన్యలనూ బంగారు ఆభరణాలతో కూడిన ఏనుగులు, గుర్రాలు, ఆవులు మొదలైన వాటినీ బ్రాహ్మణులకు దక్షిణలుగా ఇచ్చాడు. 'నీతి'ఇతడే అనీ ఇతని మితిమీరిన బ్రాహ్మణభక్తి వల్ల కర్మకాండ పట్ల ఏవగింపు కలిగి ఈ రాజు భార్య సునీథ, కుమారుడు వేనుడూ బుద్ధుని అనుయాయులుగా మారారని ఒక అభిప్రాయం.

## 3. మరుత్తు

అవీక్షిత్తు కొడుకు. తల్లి విశాల. ఇతడు మహా బలవంతుడు, ఐశ్వర్యంలో ఇంద్రుని మించిన వాడు. ఇతడు యాగం తలపెట్టి బృహస్పతిని ఉపద్రష్టగా యాగం చేయించేందుకు పిలిచాడు. ఇంద్రుడు బృహస్పతిని వెళ్ళనీయలేదు.

'దేవతల యాగాలు చేయించేవాడివి - నరులు పిలిస్తే వెళ్తావా' అని హాస్యంచేసి ఆపేశాడు. అంగిరసుని చిన్న కొడుకైన సంవర్తుని ఉపద్రష్టగా పిలిచి మరుత్తు యాగం చాలా గొప్పగా చేశాడు. బృహస్పతి, ఇంద్రుడు ఆ యజ్ఞం భంగం చేయటానికి చాలా ప్రయత్నాలు చేశారట. కుదరలేదు. బలవంతంగానే వారు వెళ్ళి యజ్ఞ భాగాలు తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. తీరా వెళ్ళాక సురాపానంతో ఇంద్రుడు చాలా తృప్తి పొందాడట. మర్యాదలు చాలా బాగా జరిగాయన్నది స్పష్టం.

మరుత్తుకు ఏ కారణం వల్లనో నాగులతో వైరం వచ్చింది.

మరుత్తు సంవర్తాస్త్రం వేసి నాగలోకాన్ని తపింపచేశాడట. తల్లీతండ్రీ చెప్పినా వినలేదు. తండ్రికీ ఇతనికీ ఈ విషయంలో యుద్ధం కూడా జరిగిందట. చివరకు ఎలాగో రాజీ కుదిరింది.

మరుత్తు యజ్ఞం చేసినప్పుడు బ్రాహ్మణులు పట్టుకు పోగా మిగిలిన బంగారమూ

ధనమూ భూమిలో పాతిపెట్టారట. ధర్మరాజు యాగం చేసేటప్పుడు భీమార్జునులు ఆ ధనాన్ని తవ్వి తెచ్చారు. (భాగవతం, మార్కండేయ పురాణం, భారతం.)

దేవగణాలకు మానవ గణాలకు ఉండే స్పర్థ, మళ్ళీ వారితో మైత్రి, బ్రాహ్మణుల పోషణ, యజ్ఞాల ప్రాముఖ్యం, వైదిక ధర్మాన్ని అనుసరించని నాగులతో వైరం, మళ్ళీ వారితో రాజీ పడటం వంటి విశేషాలు ఈతని చరిత్రతో ముడిపడి ఉన్నాయి.

### 4. శిబి

ఉశీనరుని కుమారుడు. ఏడు దీవులలో ఎదురులేని చక్రవర్తి. గంగాతీరంలో అనేక అశ్వమేధ యాగాలు చేసి బ్రాహ్మణులకు దానాలు చేశాడు. ఇంద్రుడూ అగ్నీ ఇతని దాన గుణాన్ని పరిశీలించటానికి డేగ, పావురాల రూపాలతో ఇతని దగ్గరకు వచ్చారు. పావురానికి శిబి (ప్రాణరక్షణకు) అభయమిచ్చాడు. 'నా ఆహారాన్ని నాకు కాకుండా చేయటం నీకు ధర్మమా' అని డేగ శిబిని ప్రశ్నించింది. ఆహారంగా పావురం అంత బరువుగల అతని మాంసాన్ని కోరింది. శిబి తన తొడ నుండి మాంసం కోసి తక్కెడలో వేస్తూ పావురంతో తూస్తూ వచ్చాడు. ఎంత కోసినా పావురం బరువుకు సరితూగటం లేదు. చివరకు ఇంద్రుడు, అగ్ని తమ నిజ రూపాలు చూపి అతనిని దీవించారు. దేవగణాలకూ బ్రాహ్మణులకూ దానాలు చేయటంతో పాటు జీవకారుణ్యం కూడా చూపిన ఈ కథ బౌద్ధం ప్రభావం కావచ్చు.

### 5. దశరథ రాముడు

దశరథుని పుత్రుడు. బాల్యం నుంచీ యజ్ఞ యాగాలు రక్షిస్తూ మునులకు విధేయుడుగా ఉన్నాడు. యౌవనంలో తండ్రి పంపున అరణ్యాలకు వెళ్ళి, భార్యను రావణుడు ఎత్తుకు పోతే సముద్రానికి వారధి కట్టి రావణుని సంహరించాడు. కలి ప్రభావంతో అకాల మరణాలు సంభవించకుండా చేశాడు. శూద్రులు తపస్సు చేయకుండా అడ్డుకుని శూద్ర మునులను చంపి వర్ణధర్మం అమలు పరచాడు. అశ్వమేధాదియాగాలతో బ్రాహ్మణులను తృప్తి పరచాడు.

తండ్రి మాట జవదాటని కొడుకుగా రాముడు దేశంలో ఇంటింటా పూజలందు కుంటున్నాడు. తండ్రి వృద్ధాప్యం స్వీకరించని (యయాతి కొడుకులు) కొడుకులనూ, తండ్రి మాట వినని (విశ్వామిత్రుని కొడుకులు) కొడుకులనూ చూశాక వారిని దృష్టిలో పెట్టుకుని దశరథ రామునికి రూప కల్పన చేశారు.

విధేయుడైన పుత్రుడుగా ఆదర్శ మూర్తిగా ఈ పాత్ర అందరినీ ఆకర్షించింది. దానితో ఇతర ప్రయోజనాలు కలిగించే అంశాలు - శూద్రుని తల తీసేయటం, అసురులను చంపటం - మునులకు ప్రాముఖ్యం ఇవ్వటం - శూద్రులనూ స్త్రీలనూ అణచి పెట్టి ఉంచటం, రాక్షస స్త్రీల ముక్కూ చెవులూ కోయటం వంటివి కూడా ఈయనకే జోడించారు.

అనంతరకాలంలో ఈయనను ఒక అవతార పురుషునిగా ప్రచారం చేశారు.

రామాయణ పాత్రల జీవితాలలోని సాధారణ సంఘటనలకు సార్వజనీనమైన సార్వకాలికమైన ప్రశస్తిని ఇచ్చే విధంగా వారి కథలు పాటలుగా ప్రచారం చేశారు. రాముని లాలి, సీత సమర్త, సీత వేవిళ్ళు, లవకుశ జననం, సీతా రాముల ఆటలు - సీత వామన గుంటలు, లక్ష్మణ దేవర నవ్వు, ఊర్మిళ నిద్ర వంటి జానపద గేయాలతో ఈ పాత్రలు ఇంటింటా ప్రజల జీవితాలలో పెనవేసుకుపోయే విధంగా ప్రచారం సాగింది.

## 6. భగీరథుడు

ఇక్ష్వాకు వంశపురాజు. సగరునికి ఐదుతరాల తర్వాతివాడు. దిలీపుని కొడుకు. తన పూర్వీకులైన సగర పుత్రులు భస్మరాశులుగా పడి ఉండటం చూసి వారికి ముక్తి కలిగించటం కోసం ఆకాశ గంగను భాగీరథిగా భూమికీ, పాతాళానికీ తెచ్చి ఆ భస్మరాశులపై ప్రవహింప చేసి వారిని పుణ్యలోకాలకు పంపాడు. కర్మకాండ ప్రచారం - మరణానంతర పుణ్యలోకాల ప్రచారం ఈ కథ ప్రయోజనాలుగా చెప్పుకోవచ్చు.

ఏదైనా ఒక పని చేయటానికి చాలా ప్రయత్నం చేయవలసి వస్తే లేదా పట్టుదలతో దేనినైనా సాధిస్తే 'భగీరథ ప్రయత్నం' చేసి సాధించాడంటారు. 'భగీరథ ప్రయత్నం' అనేది నానుడిగా నిలిచిపోయింది.

భగీరథుడు బ్రాహ్మణులకు చేసిన దాన ధర్మాలు అపారమైనవి. తన పూర్వీకులకు పుణ్య గతులు కల్పించటం కోసం ఇతడు చేసిన కర్మకాండ, పురుష ప్రయత్నమూ అందరికీ ఆదర్శంగా ఉండేలాగ చెప్పాయి పురాణాలు.

భగీరథుడు ఇంద్రుడు మెచ్చుకునేటట్టుగా అశ్వమేధ యాగాలు చాలా చేశాడు. అశ్వమేధ యాగాలు చేసేటప్పుడు వేలకొద్దీ రథాలలో కన్యలను అలంకరించి ఉంచి ఒక్కొక్క రథానికి నూరేసి ఏనుగుల చొప్పున, వాటిలో మళ్ళీ ఒక్కో ఏనుగుకు వేయి గుర్రాల చొప్పున - వాటిలో మళ్ళీ ఒక్కో గుర్రానికి అన్నేసి ఆవుల చొప్పున ఆ ఆవులను వాటికి తగిన కానుకలతో బ్రాహ్మణులకు ఇచ్చేవాడట.

బ్రాహ్మణుని ఆగ్రహానికి గురైన తన పూర్వుల పాపానికి పరిహారంగా భగీరథుడు ఇంత పెద్ద ఎత్తున దానాలు చేయవలసి వచ్చింది. గంగను భూమికి తెచ్చే ప్రయత్నంలో బ్రహ్మనూ, గంగనూ, ఈశ్వరుణ్ణీ, జహ్నునీ తన తపస్సుతో ప్రసన్నులను చేసుకున్నాడు.

## 7. దిలీపుడు

ఇక్ష్వాకు కులానికి చెందిన రాజు. చాలా కాలం సంతానం కలగకపోతే కులగురువైన వసిష్ఠుని సేవించాడట. దిలీపునికి కామధేనువు శాపమున్న విషయం వసిష్ఠుడు దివ్య దృష్టితో తెలుసుకున్నాడు. కామధేనువు అప్పుడు పాతాళలోకంలో ఉండటం వల్ల శాపాంతం కోసం

కామధేనువు బిడ్డ అయిన నందినీ ధేనువును సేవించవలసిందిగా దిలీపునికి సలహా యిచ్చారు. ఆ సలహా పాటించి దిలీపుడు నందినిని సేవించాడు. నందినిని కాపాడటం కోసం దిలీపుడు ఒకానొక సమయంలో తన శరీరాన్నే అర్పించటానికి సిద్ధపడ్డాడు. అదంతా తానే కల్పించానని చెప్పి నందిని రాజును అనుగ్రహించింది. దిలీపుని కొడుకు రఘువు.

దిలీపుడు 99 యాగాలు చేశాడు. నూరవయాగంలో యాగాశ్వాన్ని ఇంద్రుడే అపహరించాడు. అశ్వం కోసం రఘువు ఇంద్రుని మీదికి యుద్ధానికి వెళ్ళాడు. ఇంద్రుని వజ్రాయుధపు దెబ్బను కూడా ఓర్చుకుని ఇంద్రుని మెప్పు పొందాడు. ఇంద్రుడు ఆ యాగాశ్వాన్ని తానే ఉంచుకుని వీరికి వరాలిచ్చాడు.

వందకు పైగా అశ్వమేధాలు చేశాడనీ ఇంద్రుడు ఆశపడిన గుర్రాన్ని అతనికి ఇచ్చాడనీ దిలీపుని గురించి చెప్పుకునేవారు.

దేవగణాలవారికి దొరకని గుర్రాలు ఆర్యావర్తంలో దొరికేవి. అందుకే దేవ జాతులు గుర్రాలకు - గుర్రం మాంసానికీ ఆశపడే వారు అని అనుకోవచ్చు.

**8. మాంధాత**

ఇక్ష్వాకు వంశంలో కకుత్స్థునికి పదహారోతరం వాడు.

యువనాశ్వుని కొడుకు. పుత్రకామేష్టి ఫలితంగా జన్మించాడు. తల్లి తాగవలసిన మంత్రజలం తండ్రి తాగటం వల్ల తండ్రి గర్భంలో పెరిగి కడుపు చీల్చుకుని బయటకు వచ్చాడట. యువనాశ్వుడు నూరేళ్ళు గర్భం ధరించినట్లూ అప్పుడు అతని ఎడమ భాగం నుంచి కొడుకు (మాంధాత) ఆవిర్భవించినట్లూ కూడా చెబుతారు.

ఇంద్రుడు ఆ శిశువు నోట్లో వేలుంచి అమృతం తాగించాడట. పుట్టింది మొదలు 12 రోజులు ఇంద్రుని చేతి పాలు, నేయి తాగాడట. ధ్యాన మాత్రం చేతనే అన్ని విద్యలూ అతనికి వచ్చేశాయి. ఇంద్రుడే అతనిని పట్టాభిషిక్తుని చేశాడట. బహుశః కడుపు చీల్చుకుని వచ్చినప్పుడు తండ్రి మరణించాడేమో. మాంధాత 12 వ యేటనే రాజ్యానికి వచ్చినట్టు చెప్పటం కూడా ఈ ఊహకు ఆస్కారం ఇస్తోంది.

ఇతన్ని ఇంద్రుడు తన సింహాసనం పైన తన పక్కన కూచోబెట్టుకున్నాడట. ఇతనికి అజగవము అనే ధనుస్సూ, అభేద్యమైన కవచమూ ఉండేవి.

యమునా నదీ తీరాన బోలెడన్ని యజ్ఞాలు చేశాడు. అన్న పర్వతాలు, నేతి నదులతో బ్రాహ్మణులకు భోజనాలు పెట్టి దానాలు ఇచ్చేవాడు. రాజ సూయ అశ్వమేధ యాగాలు వేయి వరకు చేశాడు. రావణుని కూడా జయించాడట.

మాంధాత కాలానికి వర్ణాశ్రమ వ్యవస్థలో బ్రాహ్మణులకు చాలా ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఉతథ్యుడు మాంధాతకు చెప్పిన నీతులు ఇలా ఉన్నాయి.

సుందరయ్య గ్రంథాలయ
A C. No. 81080

. రాజు అనేవాడు ధర్మ రక్షకై జన్మించాడు, కాబట్టి అతడు రోషం, కామం, అనేవి వదలిపెట్టి ధర్మనిరతుడు కావాలి...

ధర్మమునకు బ్రాహ్మణ జనం జననదేశం కాబట్టి రాజు అసూయ లేకుండా విప్రకోటిని సంభావించాలి. అలా చేయకపోతే సంపదలు పోతాయి. రాజు పరనారీ గమనాది దోషాలు చేస్తే ఆ రాజ్యంలో వర్షాలు పడవు. ప్రజలకు దైన్యం కలుగుతుంది. వ్యాధులు ప్రబలుతాయి. శత్రువులు బాధిస్తారు. బంధువులకు చేటు కలుగుతుంది. కాని పనులు రాజు చేయకూడదు..." (భారతం. శాంతి. 2-402)

వసుహోముడనే రాజు నుంచి కూడా మాంధాత దండనీతి ప్రకారం తెలుసుకొని ఆచరించాడట.

ఒకప్పుడు రాజ్యంలో వర్షాలు పడకపోతే కోపించి ఇంద్రుని మీదనే దండెత్తి వర్షాలు కురిపించుకున్నాడని ఒక కథ. ఇంద్రునిమీదికి దండెత్తి వెళ్తే, 'భూలోకాన్నంతా జయించావా? ముందు లవణుని ఓడించిరా' అని ఇంద్రుడు అన్నాడనీ ఇతడు లవణుని చేతిలో ఓడిపోయాడనీ చెబుతారు.

మాంధాత చాలా ప్రఖ్యాతుడు. గర్వంగా చెప్పుకోదగిన రాజు.. ఏదైనా ప్రాచీనతను చెప్పుకోవాలంటే మాంధాతల కాలం నాటిది అని చెప్పటం వాడుకలో ఉంది. మాంధాతను గురించి జానపద గాధలు చాలా ప్రచారంలో ఉన్నాయి. (మాంధాత పురుషుని నుంచే పుట్టాడు కాబట్టి స్త్రీ దేవతలను (గ్రామ దేవత) లెక్క చేసేవాడు కాదు. ఈ దెమ్మ ఉత్సవాలు మాన్పించేశాడట). ఇతనికి 50 మంది కూతుళ్ళు. వారంతా సౌభరి ముని భార్యలు. కొడుకులు అంబరీషుడు పురుకుత్సుడు, ముచుకుందుడు. అంబరీషుడు తాతకు పెంపువెళ్ళాడు. అతనికి 18 తరాల వాడు నలుడు.

## 9. యయాతి:

చంద్రవంశపు రాజు. నహుషుని కొడుకు. వర్ణ ధర్మ రక్షణకు పేరు పొందాడు.

'వర్ణధర్మముల్ గాచుచు వసుధ యెల్ల ననఘ చరితుడై

యేలిన నయ్యయాతి...' అని నన్నయ భారతంలో వర్ణించాడు. ఇతడు సరస్వతి నది వరకు జయించాడట. అప్పటి నుంచీ సరస్వతీ నదికి ఆర్య వాఙ్మయంలో స్థానం లభించిందని చెబుతారు. ఇది క్రీ.పూ. 2000 సంవత్సరాల నాటి సంఘటన కావచ్చునని చరిత్రకారులు కొందరు భావిస్తున్నారు.

అగ్నిష్టోమ, హయమేధ, వాజపేయ, అతిరాత్ర, పౌండరీకాది యజ్ఞాలు చాలా చేశాడు. ఇతని యజ్ఞాలకు దేవతలు స్వయంగా వచ్చి కానుకలు స్వీకరించి సురాపానం చేసి

మర్యాదలు పొంది వెళ్ళేవారు. తన కంటూ ఏమీ ఉంచుకోకుండా బ్రహ్మణులకు దానాలు చేశాడు. వర్ణధర్మాలు శ్రద్ధగా అమలు పరచిన యయాతి బ్రాహ్మణ బాలికను ఎందుకు వివాహ మాడాడూ అని అప్పట్లో చాలా మందికి గొప్ప సందేహం ఉండేది. ఇదే ప్రశ్న జనమేజయుడు వైశంపాయనుని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు చెప్పిన కథ భారతంలో ఉంది.

వృష పర్వుడనే దానవరాజుకు శుక్రాచార్యుడు గురువు. శుక్రునికి మృత సంజీవని విద్య తెలుసు. దేవాసుర యుద్ధాల్లో అసురులను చనిపోయిన వారినీ గాయపడ్డవారినీ ఆయన బతికిస్తూ ఉండేవాడు. అతని దగ్గర ఆ విద్య నేర్చుకోవటానికి దేవగణాలు బృహస్పతి కుమారుడైన కచుని పంపాయి. 'కచుడు' శుక్రుని కూతురైన దేవయానిని మంచి చేసుకున్నాడు. మోసం శంకించిన ఇతర శిష్యులు కచుణ్ణి చంపారు. దేవయాని కోరికపై శుక్రుడు ఒకసారి అతనిని బతికించాడు. ఈసారి ఇలా కాదని కచుణ్ణి చంపి దహనం చేసి ఆ బూడిద కల్లులో కలిపి శుక్రునిచేత తాగించారు (శుక్రునికి సురాపానం అలవాటు). ఈ సారి కచుణ్ణి బతికించటం సాధ్యం కాదనుకున్నారు. అయితే దేవయాని మొండిపట్టు పట్టింది. శుక్రునికి కూతురంటే ప్రేమ. మృత సంజీవని విద్య తన కడుపులోని కచునికి నేర్పాడు. అతడు బతికి శుక్రుని పొట్ట చీల్చుకుని బయటకు వచ్చి శుక్రుని బతికించాడు. ఈ విధంగా కచునికి మృత సంజీవని పట్టువడింది. అయినపని కాగానే తన రాజ్యానికి బయలు దేరాడు. తనను వివాహం చేసుకుని తీసుకెళ్ళమంది, దేవయాని. అప్పుడు, 'నీవు గురుపుత్రివి - చెల్లె వరస' అంటూ నీతులు వల్లించాడు కచుడు.

తనను ఇంత నిర్దయగా మోసం చేసి నేర్చుకున్న విద్య ఫలించదని శపించింది దేవయాని. 'పోనీలే నా దగ్గర నేర్చుకున్న వాళ్ళకు ఫలిస్తుంది' అని అంటూ, 'నీవు ధర్మ విరుద్ధం తలపెట్టావు కాబట్టి నిన్ను బ్రాహ్మణుడు పెళ్ళి చేసుకోడు' అని కచుడు శపించాడు.

అది పురుషాధిక్యపు అహంకారం. శుక్రుని శిష్యులవల్ల ప్రాణాలు పోగొట్టుకుని దేవయాని దయవల్ల బతికిన కచుడు ఆమె పట్టువల్లనే తనకు మృత సంజీవని విద్య లభించిందని తెలిసి కూడా అహంకారం చూపటం పురుషాధిక్యమూ, జాతి గర్వమూ కూడా.

ఈ విధంగా కులపరమైన అహంకారం దేవయాని కూడా చూపించింది. ఒకప్పుడు అసుర రాజైన వృషపర్వుని కూతురు శర్మిష్ఠ, చెలికత్తెలతోనూ దేవయానితోనూ వనవిహారానికి వెళ్ళింది. తోటలో తిరిగాక అక్కడే నదిలో దిగి స్నానం చేశారు. ఒడ్డుకు చేరి ఎవరి బట్టలు వారు తీసుకుని కట్టుకునే తొందరలో దేవయాని బట్టలు శర్మిష్ఠ కట్టేసుకుంది. పొరపాటు గమనించాక తన బట్టలు దేవయానిని కట్టుకోమంది. దేవయాని ఒప్పుకోలేదు. 'నీకంటె ఉన్నతురాలిని. నీ తండ్రికి నా తండ్రి గురువు. నేను గురుపుత్రిని. నీకు ఆరాధ్యను. నీవు

విడిచిన బట్టలు నేను కట్టను' అని మొండి కేసింది. 'నీ తండ్రి నా తండ్రి దగ్గర పురోహితుడు - మేమే అధికులం' అన్నట్టు శర్మిష్ఠ మాట్లాడింది. బ్రాహ్మణ క్షత్రియ కులాల ఆత్మగౌరవ అంతర్యుద్ధం అప్పటికే సాగుతోంది.

శర్మిష్ఠ చెలికత్తెలు దేవయానిని లాక్కువెళ్ళి నీళ్ళు లేని బావిలో పడవేసి వెళ్ళిపోయారు.

యయాతి మహారాజు వేటాడుతూ ఆ వేపుగా వచ్చారు. దాహంవేస్తే నీళ్ళ కోసం ఆ బావిలోకి చూసి దేవయానిని గమనించి ఆమెకు తన ఉత్తరీయం కప్పుకోవటానికి ఇచ్చి పైకి తీశాడు. ఆమె చేయి పట్టుకుని పైకి తీశాడు గనక ఆమె అతనిని భర్తగా భావించింది.

బావిలోంచి పైకి వచ్చినా ఆమె ఇంటికి పోలేదు. తనకు ఇంత అవమానం జరిగిన ఆ రాజ్యంలో అడుగు పెట్టనంది. విషయం తెలుసుకుని వృషపర్వుడూ, శుక్రుడూ వచ్చారు. తన కూతురు లేకుండా తాను ఆ రాజ్యంలో ఉండనన్నాడు శుక్రుడు. శుక్రుడు లేకపోతే అసుర రాజ్యమే లేదు. వృషపర్వుడు దేవయానికి క్షమాపణ చెప్పి తన కూతురు శర్మిష్ఠను ఆమెకు దాసీగా ఇచ్చాడు.

ఈ వ్యవహారం అంతా తేలిందిగాని యయాతి దేవయానిని వివాహమాడే విషయం సందిగ్ధంలో పడింది. బ్రాహ్మణ బాలికను వివాహమాడే విషయంలో శాస్త్రం ఒప్పుకోదన్నాడు యయాతి. సకల శాస్త్ర కోవిదుడైన శుక్రుడు 'అది సమ్మతమే' అని చెప్పాక ఒప్పుకున్నాడు. కచుని శాపం ఉండటం వల్ల ఆమెకు బ్రాహ్మణుడు భర్త కాలేడు గనక, యయాతి ఆమెను వివాహం చేసుకున్నాడు.

పూర్వం కులాంతర వివాహాలు చాలా జరిగాయి. కొన్నింటిని ఇలాంటి కథలలో శుక్రుని వంటి ఆచార్యులు సమర్థించారు. సమర్థించే పెద్దవాళ్ళు లేని వాళ్ళు శాపాలకూ వెలికి గురయ్యారు.

యయాతితో దేవయాని వెళ్ళేటప్పుడు శర్మిష్ఠను కూడా పంపారు. ఆమెను అన్నింటిలోనూ దేవయానితో సమంగా చూసుకోవాలని చెప్తూ పడక మాత్రం పంచుకోవద్దన్నారు.

కాలక్రమంలో దేవయానికి తెలియకుండా శర్మిష్ఠ కూడా యయాతికి భార్య అయింది. వారికి పుత్రులూ కలిగారు. దేవయానికీ విషయం తెలిశాక రాజు మాట తప్పాడని తండ్రికి ఫిర్యాదు చేసింది. 'ముసలివాడవై పోతావని' శుక్రుడు అల్లుణ్ణి శపించాడు. కూతురి జీవితం దృష్టిలో పెట్టుకుని మార్గాంతరం సూచించాడు. కొన్నాళ్ళు ఆ ముసలితనాన్ని ఎవరికైనా ఇచ్చి వారి పడుచుతనం తీసుకోవచ్చు, అని చెప్పాడు.

యయాతి తన ముసలితనం తీసుకోవలసిందిగా తన కొడుకులను ఒక్కొక్కరినీ అడిగి ఒప్పుకోని వాళ్ళను శపించాడు. రాజ్యార్హత ఉండదని కొందరినీ, సంకీర్ణ వర్ణకిరాతులకు రాజులవుతారని కొందర్నీ శపించాడు. కిరాతులు సంకీర్ణ వర్ణజాతులలో ఒకరు అనీ వారి

పాలకులు శాపగ్రస్తులైన రాజులనీ దీనివల్ల తెలుస్తోంది. సంకీర్ణ వర్ణాలు కూడా శాపగ్రస్త నిషిద్ధ మానవ సంబంధాల వారే కావచ్చు. వీరిలో కొందరు ఆటవిక జాతులుగా వ్యవహారంలోకి వచ్చి ఉండాలి. ఇంత జరిగినా వర్ణ ధర్మాన్ని గొప్ప సంస్కృతిగా పొగడుతూనే ఉన్నారు. (చూ. అనుబంధం-1)

## 10. అంబరీషుడు

అనేక మంది రాజులు దండెత్తి వచ్చినా ఎదుర్కొని నిలిచాడట. వైష్ణవ మత ప్రాబల్యాన్ని చాటాడట. నేలనంతా జయించి అనేక యజ్ఞాలు చేసి బ్రాహ్మణులకు అపారంగా ధన రాసులు ఇచ్చాడు. అన్నదానాలు చేశాడు. ఏది చేసినా హరిపరంగా చేస్తుండేవాడు.

'తిరుగులేని బ్రాహ్మణ శాపాన్ని తిప్పికొట్టగలిగిన హరిభక్తి' ఇతనిది. ఒకప్పుడు ద్వాదశీ వ్రతం చేసి ఉపవాసం ముగించే సమయంలో దుర్వాసుడు ఇతని ఇంటికివచ్చాడు. స్నానం చేసి వస్తానని నదికి వెళ్ళాడు. ఎంతకూరాడు. ద్వాదశి ఘడియలు అయిపోక ముందే పారణ చెయ్యాలి. అంటే, ఏమైనా తిని ఉపవాసం విడిచిపెట్టాలి. లేకపోతే వ్రత ఫలితం ఉండదు. అంచేత పురోహితుల సలహాపై ఈయన నీళ్ళు తాగాడు. దుర్వాసుడు వచ్చి 'నేనురాకుండా నీవు తింటావా' అని కోప్పడి తన జుట్టు నుంచి ఒక జట పీకి రాజు మీదికి ప్రయోగించాడు. అది భయంకరంగా రాజుమీద పడబోయే సమయంలో విష్ణుచక్రం వచ్చి దాన్ని తరిమింది. ఆ తరమటంలో దుర్వాసుణ్ణి కూడా అన్ని లోకాలూ తిప్పుతూ తరిమింది. గత్యంతరం లేక విష్ణువు సలహాపై దుర్వాసుడు అంబరీషుణ్ణే శరణుకోరి ప్రాణాలు రక్షించుకున్నాడు.

బ్రాహ్మణుల గర్వం మితిమీరి పోయిన కాలంలో రూపొందిన కథ ఇది.

## 11. శశిబిందుడు

చంద్రవంశపురాజు. యయాతికి 15 తరాల తర్వాతివాడు. ఇతని నేతృత్వంలో యాదవులు బలవంతులయ్యారు. శశిబిందునికి లక్షమంది భార్యలట. ఒక్కొక్కరికీ వెయ్యేసిమంది పుత్రులు. వారంతా అశ్వమేధాలు చేసి తన ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటూ ఉండగా ఈయన గొప్ప పాలకుడుగా గుర్తింపు పొందాడు. కాశీకి నైరుతి దిశగా రాజ్యాన్ని విస్తరించాడు.

శశిబిందుని కూతురు మాంధాతృని భార్య. ఆ విధంగా ఇక్ష్వాకు రాజులతో బాంధవ్యం బలపడింది.

పర్షియా గ్రీకు గాంధారదేశాలమధ్య వాణిజ్య సంబంధాలు ఈ కాలంలోనే నెలకొన్నాయని అంటారు. సింధు లోయ ప్రాంతాలలోని హరప్పా సంస్కృతి ఇక్ష్వాకు, యాదవ సంస్కృతుల సమ్మేళనమని కొందరి అభిప్రాయం.

### 12. గయుడు

అగ్నిని ఆరాధించి బ్రహ్మచర్యం - వేదవిత్త్వం, శమ దమాదులు వరంగా పొందాడు. 36 యోజనాల విస్తీర్ణం కలిగిన యజ్ఞవేదికపై క్రతువు చేసి దానాలు చేశాడు. బంగారం - అపార ధనరాసులు - అన్నరాసులు దానాలుగా ఇచ్చాడు. ఇతని పేర 'గయ' క్షేత్రం వెలసింది.

### 13. రంతిదేవుడు

సంకృతి కొడుకు - దానశీలి. సత్రయాగం చేశాడు. ఇరవై వేల మంది వంటవారు నిరంతరం వంటలు చేస్తూండగా అన్నదానం సాగేదట. గోవులు తామే కోరి వచ్చి తమను వేల్చవలసిందిగా కోరాయట. వాటి రక్తం ఏరులుగా ప్రవహించి 'చర్మణ్వతి' నది అయింది. నలభై రోజులు ఉపవాసం ఉండి కూడా తనకు దొరికిన దానిని తాను తినకుండా అతిథులకు పంచాడు.

### 14. భరతుడు

కణ్వుని ఆశ్రమంలో సర్వదమనునిగా పెరిగి చక్రవర్తియై కాళింది తీరంలోను గంగా తీరంలోను సరస్వతీ తీరంలోనూ అశ్వమేధ రాజసూయాది క్రతువులు చేసి బ్రాహ్మణులకు బంగారు రథాలు గజాశ్వదానాలు జేశాడు.

### 15. పృథుడు

వేనుని కొడుకు. గోరూపధారిణి అయిన భూమి నుంచి ఓషధులు రత్నాలు పిదికి జనాన్ని పోషించాడు.

వేనుడు యజ్ఞ కర్మలు ధిక్కరించటం వల్ల (క్రతువులు లేక భూమి సంపదలు ఇవ్వటం మానేసి) కరువు వచ్చిందనే మిషతో వేనుని చంపి అతని భుజాలు మధించి పృథువును పుట్టించి, మళ్ళీ వేనుని శరీరం నుంచే ఒక కన్యను పుట్టించి (అర్చి) ఆమెను పృథువుకు భార్యగా చేశారు. యజ్ఞ కర్మలు మళ్ళీ ఆరంభించారు.

భూమి ఆవుగా అయితే మనువును దూడగా చేసి దాని నుంచి ఓషధులు పితికారట.

తల్లి - పాలు పితకటం - మాతృభావనను తలపించే కథలు.

ఆ సందర్భంలో యక్షులు, సిద్ధులు, సాధ్యులు అందరూ తమకు అనువుగా ఉండే వారిని దూడలుగా చేసి వారి వారికి కావలసిన పదార్థాలు పితుకుకున్నారు.

పృథువు బ్రహ్మవర్త దేశంలో సరస్వతీ నదీ తీరంలో 99 యాగాలు చేశాడు. నూరో యాగానికి, యాగాశ్వాన్ని దాచేస్తూఇంద్రుడు ఆటంకాలు కలిగిస్తూ వచ్చాడు. - పృథువు కొడుకు యాగాశ్వాన్ని తీసుకు రావటం - మళ్ళీ ఇంద్రుడు దాన్ని దాచేయటం - ఇలా జరుగుతుండగా పృథువుకు కోపం వచ్చింది. యజ్ఞ దీక్షలో ఉన్నవాడు ఆయుధం పట్ట

కూడదు కాబట్టి ఇంద్రుని ఆవాహనం చేసి వానిని అగ్నికి ఆహుతిగా వేలుద్దామని కొందరు సలహా ఇచ్చారు. అప్పుడు బ్రహ్మ వచ్చి నూటొక్క యజ్ఞాల ఫలం ఇచ్చి ఇంద్రునితో సఖ్యంగా ఉండవలసిందని రాజీ చేశాడు.

పృథువు శౌర్య పరాక్రమాలనూ బ్రాహ్మణభక్తినీ స్వతంత్ర ప్రతిపత్తినీ దేవగణాలకూ ఆర్యావర్త రాజులకూ గల అంతర్గత స్పర్ధలనూ ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.

## 16. పరశురాముడు

జమదగ్ని రేణుకల కొడుకు. పితృవాక్య పరిపాలకుడు. తండ్రి మాట ప్రకారం తల్లిని చంపిన ఘనుడు. (ఆ తర్వాత తండ్రి అనుగ్రహంతో తల్లిని బతికించుకున్నాడు - అది వేరే విషయం). తండ్రిమాట విననివారు శాపగ్రస్తులై కిరాతకులూ చండాలురూ అయిన సంఘటనలు తిరిగి జరగకుండా చూడటం కోసం ఈ పాత్రలో పితృవాక్య పాలన చూప్పించి ఉంటారు. అలాగే క్షత్రియ సంహారం కూడా ఈయన చరిత్రకు ముడిపెట్టారు.

ఈ రెండు సంఘటనలూ భావితరాలకు గుణపాఠంగా ఉద్దేశించినవే.

కార్తవీర్యుడు అనే రాజు కొడుకులు బ్రాహ్మణులకు అవిధేయులై జమదగ్నిని చంపారట. అది చూసి కోపించి పరశురాముడు కార్తవీర్యునీ అతని కొడుకులనూ చంపి ఇంకా శాంతి పొందక ఇర్వై యొక్కసార్లు భూమండలమంతా వెదికి వెదికి క్షత్రియులను చంపాడు. అందరి భూములూ తానే పాలించాడు. బ్రాహ్మణులు చేయదగినవీ, రాజులకు యోగ్యమైనవీ, అయిన యజ్ఞాలు చాలా చేశాడు. ఈ భూమి అంతా కశ్యపునికి దానంగా ఇచ్చేసి క్షత్రియులను చంపిన పాపానికి పరిహారంగా తాను తపస్సుకు వెళ్ళి పోయాడని ఒక కథనం. ఆ విధంగానూ భూమి బ్రాహ్మణులది అయింది.

భూదానం తీసుకున్న కశ్యపుడు పరశురాముణ్ణి అక్కడనుంచి వెళ్ళి పొమ్మన్నాడట. అక్కడే ఉంటే ఇంకా రాజులను చంపుతూ ఉంటాడేమో అనే భయంతో. అప్పుడు సముద్రుడు తాను కొంచెం వెనక్కి జరిగి పరశురామునికి చోటు కల్పించాడు.

సతారా నుండి కన్యాకుమారి వరకు పడమటి కనుమలకూ సముద్రానికీ మధ్యగల భూమి ఇలా ఏర్పడిందట. ఇది సప్తకొంకణం. ఈ కథ భౌగోళిక సంబంధమైన విషయాలకు మూర్తీకరణ కావచ్చు.

పరశురాముడు బ్రాహ్మణ పాలకుడు.

పరశురాముని క్షత్రియ స్వభావాన్ని సమర్థించే కథ ఒకటి ఉంది. ఇది అప్పటి బ్రాహ్మణ క్షత్రియ కులాల వివాహ సంబంధాలనూ తెలుపుతుంది.

మానవునికి వర్ణం పుట్టుకతో వస్తుందని కొందరూ, గుణ కర్మల చేత వస్తుందని కొందరూ అంటున్నారు. స్వభావాలు కూడా వర్ణ సంబంధంగానూ పుట్టుకతోనూ వస్తాయనీ చెప్పారు.

పూర్వ సారస్వతంలోని కథల్లో మంత్రాల వల్ల, యజ్ఞ కర్మల వల్ల, మంత్రపూత పాయసాలు తాగటం వల్లా సంతానం కలుగుతుండేదని వింటుంటాం. అలాంటి సంతానంలో బ్రాహ్మణ క్షత్రియ స్వభావాలు ఒకరి కొకరికి తారుమారైన సందర్భం పరశురాముని కథలో కనిపిస్తుంది.

పరశురాముని, తండ్రి జమదగ్ని. జమదగ్ని తండ్రి ఋచీకుడు. ఋచీకుని తండ్రి ఔర్వుడు.

ఋచీకుడు తపస్సంపన్నుడు. గాధిరాజు కూతురు సత్యవతిని కోరి వివాహం చేసుకున్నాడు. సత్యవతి ఇతని పట్ల చాలా విధేయంగా ఉండేది. అందుకు సంతోషించి ఆమెను వరం కోరుకోమన్నాడు. తనకు ఒక కొడుకూ తన తల్లికి ఒక కొడుకూ కలిగేలాగ అవిడ వరం కోరింది. అనుష్ఠానంలో సత్యవతి మేడి చెట్టునూ ఆమెతల్లి రావి చెట్టునూ కౌగలించుకోవాలని ఆయన చెప్పాడు. సత్యవతి పొరపాటున తాను రావి చెట్టును కౌగలించుకున్నది. ఆ తర్వాత ఋచీకుడు ఆమెకూ ఆమె తల్లికీ విడివిడిగా రెండు రొట్టెలూ మంత్ర జలంతోడి కలశాలూ ఇచ్చాడు. ఒక రొట్టె బ్రహ్మ మంత్రంతో, ఒక రొట్టె రాజ మంత్రంతో వేల్చారట (అంటే కాల్చటం వంటిదే). పొరపాటున సత్యవతికి ఇచ్చిన దాన్ని ఆమె తల్లి తీసుకుంది. ఇలా విపరీతం చేయడం వల్ల సత్యవతికి పుట్టేవాడు బ్రాహ్మణుడైనా క్షత్రియ స్వభావం కలవాడూ ఆమె తల్లికి పుట్టేవాడు బ్రాహ్మణ స్వభావం కలవాడూ అవుతారని ఋచీకుడు చెప్పాడు. ఆ మార్పు తన కొడుకుకు రాకుండా మనుమనికి సంక్రమించేలాగ అనుగ్రహించాలని సత్యవతి భర్తను కోరింది. అందువల్ల జమదగ్నికి రావలసిన క్షత్రియ స్వభావం అతని కొడుకైన పరశురామునికి (సత్యవతి మనుమనికి) వచ్చిందట.

సత్యవతి తల్లికి పుట్టిన వాడు విశ్వామిత్రుడు. క్షత్రియుడైనా బ్రాహ్మణస్వభావం కలిగి ఋషి అయ్యాడు. బ్రాహ్మణులు క్షత్రియ కన్యలను వివాహం చేసుకోవటం ఆ రోజుల్లో చాలా పరిపాటి. రాజ భార్యలకు సంతానం కలిగించిన వారు కూడా చాల వరకు బ్రాహ్మణులే. ఆ విధంగా కలిగిన సంతానానికి ఏ వర్ణపు లక్షణాలు వస్తాయనేది నిర్ధారించటం సాధ్యంకాదు. అందుకే ఏ జాతి దానికది పవిత్రంగా లేదు అంటున్నారు ఇప్పటి మేధావులు.

ఈ పదహారు మంది రాజులూ బ్రాహ్మణ విధేయులుగా బ్రాహ్మణ పోషకులుగా ప్రసిద్ధి కెక్కారు. అంచేతనే కవులు, వందిమాగధులు, వారి కీర్తిని ప్రశంసించి మరిన్ని సుగుణాలు చేర్చి వారిని చరితార్థులను చేశారు.

కాలక్రమంలో బ్రాహ్మణ ప్రశస్తి మరుగున పడుతూ భూదేవతలకూ దేవగణాలకూ

ఆదరణ తగ్గటం, ప్రజలలో హేతువాద భావాలు మొలకెత్తటం, వేదమతాన్ని ప్రశ్నించే వారు ఎక్కువవటం వంటివి చరిత్ర గతిలో చోటు చేసుకున్నాయి. జైనం బౌద్ధం వంటి ధర్మాల పట్ల ప్రజలు మొగ్గు చూపసాగారు. వర్ణధర్మ ప్రాబల్యం శక్తి హీనమవుతున్నదని గమనించిన మేధావులు ప్రత్యామ్నాయాలు వెదికారు.

పాలక పార్టీకి ప్రజలలో ఆకర్షణ తగ్గుతున్నది అనుకొన్నప్పుడల్లా మంత్రి మండలిని పునర్నిర్మిస్తూ కొందరిని తొలగించి కొందరిని చేర్చుకునే ఇప్పటి అధికార రాజకీయ పార్టీల ప్రయత్నాలలాంటివే అప్పుడూ జరిగాయి. షోడశ రాజుల ఆదర్శాల మూస లోంచి మరింత బలంగా కొన్ని పాత్రలకు రూపకల్పన జరిగింది.

దశావతారాలూ, షట్చక్రవర్తులూ అలా రూపుదిద్దుకున్నవారే. పదహారు మంది రాజులలోనూ ఇద్దరిని ఎంచుకుని దశావతారాలలో చోటు ఇచ్చారు. వారు పరశురాముడూ, దశరథ రాముడూ. ఈ ఇద్దరి కంటె సమర్థులూ, ప్రజారంజకులూ రాజనీతి కోవిదులూ ఆ పదహారు మందిలో లేరని కాదు. వాస్తవానికి శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి వంటివారు నిర్దుష్టమైన పాలకులు. బలిచక్రవర్తి పరిపాలనా సరళిని శత్రువులే అనుసరించారని పురాణాలే చెప్తున్నాయి.

అయినా జాతి ద్వేషం కారణంగా వారికి దశావతారాలలో చోటు చిక్కలేదు. రామ నామధేయులు ఇద్దరూ అవతార మూర్తులుగా పదోన్నతి పొందారు. రామనామం అప్పటికే ప్రజలలో ప్రచారమై ఉండటం ఒక కారణం. క్షత్రియులను భయపెట్టటానికి పరశురాముడూ, బ్రాహ్మణ విధేయుడుగా దశరథ రాముడూ పురోహిత వ్యవస్థకు నచ్చటమే అసలు కారణం. ఇద్దరూ పితృవాక్య పాలకులు. మాతృస్వామ్యాన్ని తుడిచిపెట్టి పితృస్వామ్యం బలపడుతున్న దశ అది.

ఎంత గొప్ప వారైనా దానవ, దైత్య వీరులకు అవతారమూర్తులుగా గాని పాలకులుగా గాని గుర్తింపే రాలేదు. వేదధర్మాన్నీ హింసాక్రతువులనూ వారు సమర్థించక పోవటం వల్ల ఇలా జరిగింది. దేవగణాలకు మిత్ర పక్షంగా ఉంటూ పురోహిత వర్గాన్ని మంచి చేసుకున్న రాజులు పురాణాలలో చిరకీర్తి పొందారు.

వేదధర్మాన్ని నిరసించే వారినీ, కర్మకాండనూ యజ్ఞ యాగాది కర్మలనూ నిరసించే వారినీ ఎదుర్కొని, అవసరమనుకుంటే చంపి - బ్రాహ్మణ విధేయులను సింహాసనం ఎక్కించి క్రతు కర్మ కాండ సాగించటం లక్ష్యంగా భారత దేశ చరిత్ర సాగుతూ వచ్చింది. అవతార మూర్తులుగాకొందర్నీ షట్చక్రవర్తులుగా కొందర్నీ ప్రముఖంగా చూపుతూ తమ విధానాలకు అడ్డు లేకుండా చేసుకున్నారు పాలక వర్గాల వారు. అధికారం - అంతస్థుల కోసమే జరిగిన కుట్రలు ఇవి.

# షట్చక్రవర్తులు

షట్చక్రవర్తుల వరుసను 1. హరిశ్చంద్రుడు 2. నలుడు 3. పురుకుత్సుడు 4. పురూరవుడు 5. సగరుడు 6. కార్తవీర్యుడు అని విద్యార్థి కల్పతరువు చెబుతోంది

పురాణాలు చెబుతున్న సృష్టి క్రమం ప్రకారం రాజవంశాలను సమన్వయం చేసి చూస్తే ఈ వరసలో పురూరవుడు మొదట ఉండాలి.

1. పురూరవుడు 2. పురుకుత్సుడు 3. హరిశ్చంద్రుడు 4. సగరుడు 5. నలుడు 6. కార్తవీర్యుడు. ఈ చక్రవర్తులందరూ మనువు సంతతి వారే. వీరి వంశ కర్త సూర్యుడు.

సృష్టిక్రమంలో కొన్ని పురాణాల ప్రకారం విష్ణువు నాభిలోంచి బ్రహ్మ పుట్టారు. బ్రహ్మ సంకల్పం వల్ల మరీచి, ఆతనికి కశ్యపుడూ కలిగారు. కశ్యపునికి భార్య  అదితి వల్ల కలిగిన సంతానంలో సూర్యుడు ఒకడు.

సూర్యునికీ సంజ్ఞకూ పుట్టిన వారిలో మను సావర్ణి ఒకడు. మనువుకూ శ్రద్ధకూ కలిగిన 11 మంది సంతానంలో సుద్యుమ్నుడు మొదటి వాడు. సుద్యుమ్నుని కొడుకు సంతానం పురూరవుడు చంద్రవంశకర్త. (చూ. అనుబంధం 2)

షట్చక్రవర్తులను ఆలంబనగా చేసుకుని దండనీతి గురించీ వర్ణ ధర్మాల గురించీ విస్తృతంగా ప్రచారం చేశారు. వీరిలో ఆరోవాడైన కార్తవీర్యుడు హైహయ వంశపురాజు. అంటే యాదవుడు.

## పురూరవుడు

పురూరవునికి పురూరవసుడు అని కూడా వ్యవహార నామం ఉంది. ఇతడు కృతయుగం చివరలోనో త్రేతాయుగం ఆరంభంలోనో ఉన్నట్లు చెబుతారు. పురూరవుని తల్లి ఇళ, సూర్యవంశీయురాలు. తండ్రి బుధుడు చంద్రునికొడుకు. సూర్యచంద్ర వంశాలుగా పాలకులు వేరుపడుతున్న రోజుల్లోని వ్యవస్థను ఈ కథ ప్రతిబింబిస్తున్నది. పురూరవుడు ప్రతిష్ఠానం రాజధానిగా ఆర్యావర్తాన్ని పాలించారు. పొరుగునే దేవగణాల రాజ్యం ఉండేది. అమరావతి వారి రాజధాని.

మానవుని దైనందిన జీవితంతో ముడిపడి ఉన్నవి  రాత్రి, పగలూ. రాత్రిని చంద్రుడూ పగటిని సూర్యుడూ తేజోవంతం చేస్తున్నారు. అలాంటి వారిని తమ వంశకర్తలుగా చెప్పుకొన వచ్చునన్న భావుకత మానవులలో కలిగిన దశలో ఈ వంశ చరిత్రలు వెలిశాయి.

భారత దేశ చరిత్రలో హిందూ రాజులందరూ సూర్యుణ్ణో చంద్రుడినో తమవంశకర్తగా చెప్పుకోవటం పరిపాటి అయింది. సూర్యవంశం ఒక మెట్టు పైన ఉన్నట్లు భావించేవారు. చాలామంది శూద్రరాజులు చంద్రుడిని ఆశ్రయించారు.

ఊర్వశి పురూరవసుల ప్రసక్తి ఋగ్వేదం పదవ మండలం 95వ సూక్తంలో ఉంది (10-95-18). ఈ విషయాన్ని మత్స్య పురాణంలో విస్తరించారు. భాగవతంలోనూ విష్ణు పురాణంలోనూ మరింత పెంచారు. కథా సరిత్సాగరంలోనూ ఈ కథ ఉంది. కాళిదాస మహాకవి రచించిన విక్రమోర్వశీయ నాటకంలో కథానాయకుడు ఈ పురూరవుడే. అందులో ఇతడు భావుకునిగా ప్రేమమూర్తిగా కనిపిస్తాడు.

వేదాలలో ప్రకృతినీ పంచభూతాలనూ స్తుతించటం కనిపిస్తుంది. అతీతమైన శక్తి తమను నడిపిస్తున్నదన్న భావంతో ప్రకృతి శక్తులను వేడుకోవటం - ఊహలతో కథలు అల్లటం ఋగ్వేద దశలో గమనించవచ్చు. సృష్టిలో మానవ పరిణామ క్రమంలో సమాజాలు ఎన్నో మార్పులు చెందుతుంటాయి. అక్కడ రేఖా మాత్రంగా ఉన్న పురూరవుని గాథ కాళిదాసు నాటికి ఎంత విస్తరించిందో ఎన్ని మార్పులకు లోనయిందో గమనించటం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

ఆస్తి, అధికారం, ప్రేమ, వివాహం, చట్టబద్ధత, వర్ణవ్యవస్థ వంటివన్నీ పురూరవుని కథలో అంతర్లీనంగా ఉన్నాయి.

ఏ వర్ణం ఎవరి కంటె గొప్పది - ఎవరి మాట ఎవరు వినాలి - వంటి విషయాలు ప్రసక్తాను ప్రసక్తంగా అన్నట్టుగా ఈ కథలో చర్చించారు. వాటిని అధికారికంగా ప్రతిష్ఠించటం పురూరవుని పాత్ర ద్వారా జరిగింది. కృతయుగంలో లేని వివక్ష ఇది.

పురూరవుని తలిదండ్రుల వృత్తాంతం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అందులో కుల గురువుల - పురోహితుల పాత్ర చాలా ఉంది. వారికి విశేష మహిమలున్నట్టు సూచించటమూ జరిగింది. అందుకే ఆ కథ అల్లారేమో.

రాజుల జీవితాలలో ప్రతి సంఘటనా పురోహితుల సలహాలపైన ఆధారపడటమూ అదే సామాన్యులకూ ఆదర్శం కావటమూ ఇక్కడే మొదలయింది. రాజులు బ్రాహ్మణ విధేయులైతే రాజ్యం యావత్తూ బ్రాహ్మణ విధేయంగా అవటం సహజం.

## ఇళ - సుద్యుమ్నుడు

సూర్యునికీ సంజ్ఞకూ మనువు, యముడు, యమున మొ॥ వారు సంతానం. వారిలో

మనువు భార్య శ్రద్ధ. ప్రజాపతి అయిన మనువు కొడుకు కోసం యజ్ఞం చేశాడు. వసిష్ఠుడు యజ్ఞం చేయించాడు. కూతురు కావాలని రాజు భార్య కోరుకుంది. వారికి కూతురు పుట్టింది. 'ఇల' ఆమె పేరు.

- కొడుకు కావాలనుకున్నాను కదా ఇలా జరిగిందేమిటి? - అని రాజు వసిష్ఠుని అడిగాడు. 'సంకల్పంలో తేడాల వల్ల అలా జరిగిందన్నా'డు వసిష్ఠుడు. చివరికి వసిష్ఠుడే ఎలాగో హరిని మెప్పించి 'ఇల'ను మగవానిగా చేశాడు. మగ వాడైన 'ఇల' పేరు

'సుద్యుమ్నుడు'. లింగమార్పిడులు అప్పుడే మొదలయ్యాయి. మహర్షులే ఆ చికిత్సలు నిర్వహించారు.

ఒకప్పుడు సుద్యుమ్నుడు పరివారంతో వేటకు వెళ్ళి ఒక వనంలో ప్రవేశించాడు - వారంతా స్త్రీలయ్యారు. ఆ వనంలో ప్రవేశించిన వారు స్త్రీలవుతారని పార్వతి శాపం ఉన్నదట. స్త్రీగా మారిన సుద్యుమ్నుడు రాజ్యానికి తిరిగి రాలేక చాలకాలం అడవుల్లోనే ఉండి పోయాడు. - ఈ మధ్య కాలంలో అతని తండ్రి మనువు హరిని ధ్యానిస్తూ యమునా నదిలో నూరేళ్ళు తపస్సు చేసి ఇక్ష్వాకు, నృగుడు మొ॥ పది మంది పుత్రులను పొందాడు.

ఆ సమయంలోనే చంద్రుని కుమారుడైన బుధుడు స్త్రీగా మారిన సుద్యుమ్నుని (ఇల) చూసి ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి పురూరవుడు కలిగాడు. ఆ విధంగా పురూరవుడు చంద్రవంశకర్త అయ్యాడు.

సుద్యుమ్నుని కులగురువు తన తపో మహిమతో శివుని మెప్పించి సుద్యుమ్నుడు ఒక నెల స్త్రీ గానూ ఒక నెల పురుషుడు గానూ ఉండే వీలు కలిగించాడట.

సుద్యుమ్నుడు ఒక నెల రాజుగా రాజధానిలో ఉంటూ ఒక నెల స్త్రీగా ('ఇల'గా) వనంలో ఉంటూ ఎలాగో కాలం వెళ్ళబుచ్చి కొడుకు పురూరవునికి యుక్త వయస్సురాగానే అతనికి రాజ్యం అప్పగించి తపస్సుకు వెళ్ళి పోయి పరమేశ్వరి అనుగ్రహం పొందాడు.

ఒక వ్యక్తిని స్త్రీగా పురుషునిగా మార్చగల తపోమహిమ బ్రాహ్మణ పురోహితులకు ఉంది అని చెప్పటం ఈ కథలో కనిపిస్తుంది. ఇలాంటి మహిమలు చూపి పురోహితులు రాజులనూ ప్రజలనూ విధేయులుగా చేసుకున్నారు.

'ఇల' యజ్ఞ కుండం లోంచి వచ్చిందని మరో కథ (శివ పురాణం అధ్యాయం 36) ఉంది. మిత్రావరుణుల అంశతో అవతరించి వారి ఆశీస్సుతోనే సుద్యుమ్నుడుగా అయిందట.

ఇల కింపురుష వర్గానికి చెందినదట. ఆమె పాలించిన దేశం ఇలావంతం (నేటి మంగోలియా ప్రాంతం?) అని మత్స్య పురాణంలో (అధ్యాయం. 12) ఉంది.

'ఇళ' అనే పదం ఋగ్వేదంలో (7-44-2) ఉంది. ఈ భావం కవితాత్మకం. 'ఇల' అంటే భూమి అనే అర్థం ఈనాడు ఉంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన హరప్పా నాగరికతకు సంబంధించి సింధులోయ తవ్వ కాలలో బయల్పడిన కుండల పలకలపై గల రాతలలో 'ఇల వర్తతె వరా' అనే రాతలు కన్పించాయంటున్నారు. ఋగ్వేదంలో 'ఇల' అనే పదం ఉన్నది కాబట్టి హరప్పా నాగరికత ఋగ్వేద కాలానికి దగ్గరిదై ఉండాలి.

(ఋగ్వేద నాగరికత క్రీ.పూ. ఏడు వేల నాటిదని అంటున్నారు గాని, అప్పటికి భూ మండలంలో కొన్ని ప్రాంతాలలో హిమయుగం ఉన్నదనే అనుమానం అందువల్ల ఉంది.

హరప్పా నాగరికత క్రీ. పూ. 4,500 కంటె పూర్వపుదని కొందరి అభిప్రాయం.

'ఇల' అనేపదం సరస్వతీ నదిని ఉద్దేశించినదనీ ఇది 'కురుక్షేత్ర'కు సమీపంలో ఉన్నదనీ కొందరంటున్నారు.

అసలు సరస్వతీ నది ఆఫ్ఘనిస్థాన్‌లోని 'హరౌతి' అనీ అక్కడి నుంచి వలసలు వచ్చిన వారు కురుక్షేత్ర దగ్గర ఉన్న ఒక నదికి హరౌతి జ్ఞాపకార్థం ఆ పేరు పెట్టుకున్నారనీ అదే కాలక్రమంలో 'సరస్వతి' అయిందనీ కాలక్రమంలో ఈ నది ఇంకి పోయిందనీ కూడా చెబుతున్నారు.)

పురూరవుడు ప్రజారంజకుడైన రాజు. భార్య కౌసల్య వల్ల ఇతనికి జనమేజయుడనే కొడుకు కలిగాడు.

ఇతని రాజ్య కాలంలో కృతయుగం గడిచి త్రేతాయుగం వచ్చిందట. రాజు మనసుకు వేదాలు కర్మ బోధకాలై మూడు మార్గాలుగా తోచాయట. అగ్ని కూడా మూడు భాగాలుగా అయిందట. అంతవరకూ ఉపాసనకు ఒకటే అగ్ని ఉండేది. ఇతని కాలంలోనే మూడు వర్ణాలూ మూడు అగ్నులూ కర్మకాండ వ్యవహారంలోకి వచ్చి ఉండాలి. అందుకే ఇతడిని షట్చక్రవర్తులలో ఒకడుగా కీర్తిస్తున్నారు.

### ఊర్వశితో ప్రణయం

ఇది ఋగ్వేద గాథల (మంత్రాల) ఆధారంగా అల్లిన కథ కావచ్చు. పురూరవుని రూపు రేఖలూ బల పరాక్రమాలూ విని ఊర్వశి (దేవకాంత) అతనిని వలచివచ్చింది. అతనితో ఉండి పోవటానికి కొన్ని షరతులు పెట్టింది.

1. ఆమెకు రెండు గొర్రె పిల్లలున్నాయి. వాటిని ఎప్పుడూ కాపాడుతూ ఉండాలి.
2. శృంగారంలో తప్ప పురూరవుడు ఆమెకు నగ్నంగా ఎప్పుడూ కనబడకూడదు.
3. ఎంగిలి తినదు; భోజన సమయంలో నెయ్యి ఎక్కువ వేస్తూ ఉండాలి.

ఇవన్నీ అప్పటి సామాజిక స్వరూపాన్ని తెలిపే అంశాలు. దేవలోకం అని చెప్పబడే ప్రాంతం గొర్రెలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం కావచ్చు. మధ్య ఆసియా నుంచి ఇండియాకు కొన్ని తెగలు వలస వచ్చినట్టు చెబుతారు. ఊర్వశి ఆ గణాలకు చెందిన స్త్రీ కావచ్చు. వారు నెయ్యి ఎక్కువగా వాడతారేమో. గొర్రెల పెంపకం ఆ గణాల వృత్తి కావచ్చు. గొర్రెపిల్లల ప్రసక్తి మత పరంగా బైబిలు కథలలోనూ ఎక్కువగా కనిపిస్తుంది.

పురూరవుడు అన్నింటికీ అంగీకరించి ఊర్వశి తోడిదే లోకంగా గడుపుతుండగా ఊర్వశిని ఎలాగైనా తిరిగి రప్పించుకోవటానికి అక్కడ ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఇద్దరు గంధర్వులు ఊర్వశి గొర్రె పిల్లల్ని దొంగిలించి తీసుకుపోయారు. గొర్రె పిల్లల

అరుపులు విని పురూరవుడు వంటిమీది బట్టలు సరిగా చూసుకోకుండా వాటి కోసం పరుగెత్తాడు. ఆ సమయంలో మెరుపులు మెరిసి రాజు దిగంబరంగా ఊర్వశి కంట పడటంతో ఊర్వశి రాజును విడిచి వెళ్ళిపోయింది. ఊర్వశి లేని పురూరవుడు పిచ్చివాడి లాగా అయ్యాడు (ఈ ప్రేమ గాథను ఎందరో కవులు గానం చేశారు) ఊర్వశి అతని బాధ చూడలేక పోయింది. అతనికి తనపై విరక్తి కలిగేలా మాట్లాడి అతనిని రాజ్యపాలన వైపు మళ్ళించాలని ప్రయత్నించింది.

(ఊర్వశిని గురించి చెప్పేటప్పుడు స్త్రీల ప్రవర్తనను గురించి నిందా వాక్యాలెన్నో రాశారు.

ఆడదానినీ దొంగనూ నమ్మడం తెలివి తక్కువ తనం అట - శ్రీదేవీ భాగవతం - ప్రథమ స్కంధం)

ఊర్వశితో పురూరవుడు గడిపిన కాలం 61 సంవత్సరాలు. ఊర్వశి రాజును విడిచి వెళ్ళాక ఒక యేడాది పోయాక రమ్మన్నది - అప్పుడు అతనికి కొడుకును అప్పగించింది.

పురూరవుని విరహ బాధ చూసి గంధర్వులు అతనికి ఒక అగ్ని స్థాలిని ఇచ్చారు. (కుంపటి లాంటి వస్తువు?) దానితో యజ్ఞం చేస్తే ఊర్వశి లోకాన్ని చేరుకుంటావని చెప్పారు. రాజు తిరిగి వస్తూ దాన్ని అడవిలో వదిలేశాడు - ఊర్వశి లేనిదే ఇది ఎందుకు? అని అనుకున్నాడు. మళ్ళీ దాని కోసం వెనక్కు వెళ్ళాడు - అది కనబడలేదు - ఆ స్థానంలో శమీగర్భం - అశ్వత్థ వృక్షం ఉన్నాయట - వాటితో అరణి చేసి యజ్ఞాలు చేసి ఊర్వశిని చేరుకున్నాడు.

మానవుని చంచల మనఃస్థితి, స్త్రీ పరమైన చాపల్యం - సౌందర్యాన్వేషణ - యజ్ఞ కర్మల నిర్వహణ వంటివన్నీ ఇందులో ఇమిడ్చారు.

ఇంద్ర సభలో ఊర్వశి నాట్యం - ఊర్వశీ పురూరవుల మోహ చేష్టలు చూసి వారికి వియోగం కలుగుతుందని తుంబురుడు శపించటం - సాధ్యామృత తీర్థంలో స్నానం చేస్తే అన్ని శాపాల నుంచీ విముక్తి కలుగుతుందని చెప్పి శాపాంతం చెప్పటం స్కంద పురాణంలో ఉంది. (స్కాంద మహాపురాణం బ్రహ్మ ఖండంలో సేతు మహాత్మ్యంలో సాధ్యామృత తీర్థ ప్రశంసలో పురూరవ శాప మోక్షణ వర్ణనమనే 28వ అధ్యాయం.) ఇది కర్మకాండ ప్రచారం కోసం చేసిన కథనం.

## విక్రమోర్వశీయం

కాళిదాస మహాకవి రచించిన 'విక్రమోర్వశీయం' నాటకం ప్రపంచ సారస్వతంలోని గొప్ప నాటకాల కోవలో చేరింది. కాళిదాసు తనకాలానికి ప్రచారంలో ఉన్న గాథల నుంచి కొన్ని కొన్ని అంశాలు తీసుకొని కొన్ని కల్పనలతో ఈ నాటకం రాశాడు. ఇది క్రీ.పూ. 1వ శతాబ్దం నాటిది కావచ్చుని కొందరి అభిప్రాయం. ఈ నాటకంలోని సంభాషణల ద్వారా దివ్య, దైత్య,

మానవ, సంబంధాలు తెలుస్తున్నాయి. ఈ నాటకంలో

ఊర్వశిని ఎవరో రాక్షసులు ఎత్తుకు పోవటం - ఆమె చెలికత్తెల కేకలు విని పురూరవుడు వెళ్ళి ఆమెను కాపాడటం - ఊర్వశీ పురూరవుల ప్రేమ - ఊర్వశి లేఖ - పట్టపు రాణి అది గమనించటం - ఊర్వశి విరహం, రాజు సందిగ్ధావస్థ; రాణి 'ప్రియాను ప్రసాదన వ్రతము' చేయటం - ఆ విధంగా రాణి అనుమతి లభించినట్లు కాగా ఊర్వశి రాజుతో కలిసి ఉండటం - శాపవశాత్తూ పూలతీగె అయిపోవటం - రాజు విరహం - చివరకి పుత్రునితో ఊర్వశి రావటం - వంటి ఘట్టాలున్నాయి. రాజువల్ల ఊర్వశికి కలిగిన పుత్రుడు ఆయువు. ప్రియాను ప్రసాదన వ్రతంలో పూజా కార్యక్రమాలు ఇతర వ్రతాలలో లాగానే ఉంటాయి. అదనంగా ఉన్న విశేషం ఏమిటంటే వ్రతం చేసిన స్త్రీ 'ఇది మొదలు ఏ స్త్రీ సమాగమాన్ని నా భర్త కోరుకుంటాడో ఆమెతో నేను ప్రీతితో ఉంటాను' అని ప్రమాణం చేసి అదే మాట భర్తతో చెప్తుంది.

స్త్రీలకు పతివ్రతా నియమాలు ఏర్పరచటం, బహు భార్యాత్వాన్ని అనుమతించటం. పురుషుల స్వైర వృత్తిని సమర్థించటం ఈ వ్రతంలో స్పష్టంగా చూడవచ్చు. ఇలాంటి వ్రతాలను రాజ పురోహితులు రాణుల చేత చేయించి రాజులకు ఇష్టులయ్యారు.

రాబోయే దేవాసుర యుద్ధంలో తనకు తప్పక సహాయం చేయాలనే షరతు మీద ఊర్వశి రాజుతో ఉండి పోవటానికి ఇంద్రుడు అనుమతించటంతో నాటకం ముగుస్తుంది.

'నీ కార్యం ఇంద్రుడు చేస్తాడు - నీవు ఆయన ఇష్టాన్ని ఆచరించాలి..' అని నారదుని చేత చెప్పించారు. దేవాసుర యుద్ధాలలో చాలా సందర్భాలలో మానవజాతి దేవజాతికి సహాయపడుతూ వచ్చింది.

పురూరవుడు ప్రతినెలా అమావాస్యనాడు స్వర్గానికి వెళ్ళి పితృదేవతలకు తర్పణాలు చేసేవాడు.

అమావాస్యనాడు చంద్రరేఖ కొంచెమైనా కనబడితే అది 'సినీవాలి'.

కనబడకపోతే అది 'కుహూ'.

సూర్యుడూ చంద్రుడూ ఆ రాత్రి ఒకే నక్షత్రంలో ఒకటిగా ఏకమండలంలో 'కూ' అని కోయిలపలికినంత సేపు ఉంటారట. ఆ సమయం కోసం వేచి చూసి పురూరవుడు అప్పుడు పితృతర్పణాలు చేసేవాడట. (మత్స్య. అధ్యా. 140).

'సినీవాలి', పదం అధర్వణవేదం (8.46.3)లోనూ 'కుహూ' పదం బ్రాహ్మణాలలోనూ కనిపిస్తుంది. కర్మకాండ ఒక పద్ధతిలో రూపుదిద్దుకొన్న కాలానికి చెందిన పదాలు ఇవి. వీటినీ కర్మకాండ ప్రచారం కోసం పురూరవునికి ఆపాదించినట్టే కనిపిస్తుంది.

పురోహితుల పట్లా బ్రాహ్మణుల పట్లా ఏమాత్రమూ అహంకారం చూపకూడదన్న

విషయమూ ఈ కథలోనే చొప్పించారు. రాజ్యమదం చేత పురూరవుడు విప్రులను అవమానించాడనీ - వారి శాపం వల్ల (ఊర్వశి విరహంతో) పిచ్చివాడయ్యాడనీ ఒక కథనం.

13 ద్వీపాలు తన శౌర్య శక్తి చేత పాలించిన పురూరవుడు మదంతో బ్రాహ్మణులధనం అపహరించాడట.'అది మంచి పనికాదు' అని నచ్చ చెప్పటానికి సనత్కుమారుడూ మరి కొందరు బ్రాహ్మణులూ వెళ్తే వారికి దర్శనమే ఇవ్వలేదట. దానితో వారు శపించారట (భారతం. ఆదిపర్వం.) 'బ్రాహ్మణ శాపం అమోఘం' అనే విషయం చెప్పటానికి ఈ కథ. అప్పటి బ్రాహ్మణులు రాజులకన్న ధనవంతులన్న విషయం ఒప్పుకున్నా రాజు వారి ధనం అపహరించాడనటం నమ్మదగినదిగా లేదు. ఆ అపహరణ రూపం మరో విధంగా ఉంది ఉండాలి. పన్నుల రూపంలోనో - కానుకల రూపంనో. ఇలా ఇవ్వటానికి బ్రాహ్మణులు నిరాకరించి ఉంటారు. రాజభటులు బలవంతాన వసూలు చేశారేమో. అదే అపహరించటంగా ప్రచారమైందేమో. పురూరవుడు ప్రజారంజకుడైనరాజు. 13 ద్వీపాలు తన శౌర్య శక్తితో పాలించి కూడా బ్రాహ్మణులకు విధేయంగా ఉండవలసిన వాడే అయ్యాడు. అతనిపై దొంగతనం నేరమూ మోపారు? ఆ నేరాన్ని విచారించే వారే లేకపోయారు.

బ్రాహ్మణ ప్రశస్తిని చెప్పదలచుకున్నప్పుడు ఇలాంటి కథలు చేర్చటం పరిపాటి.

సంస్కృత భాషలో మహా భారతం గ్రంథస్థం అయిన నాటికంటె తెలుగులో మహాభారతం గ్రంథస్థమైన కాలానికి, బ్రాహ్మణ ప్రశస్తి ఆచార కర్మకాండ మరింత ఎక్కువయ్యాయి. సంస్కృత భారతంలో కంటె తెలుగు భారతంలో వీటి ప్రసక్తి ఎక్కువగా ఉందనటానికి మచ్చుకు ఒకటి రెండు ఉదాహరణలు.

1. పాండురాజు అరణ్యంలో నివాసం ఏర్పరచుకుని ఆ వార్త 'బంధువులకూ పౌర వృద్ధులకూ తెలియజేయాలని కోరాడు.' అని సంస్కృత భారతంలో ఉంది. తెలుగు భారతంలో 'బంధువులకూ వృద్ధ పురోహిత బ్రాహ్మణులకూ తెలపమ'ని కోరినట్లు ఉంది.

2. అరణ్యపర్వంలో, భోజన సమయంలో పాండవులు వివిధ మృగాల మాంసం వండించి ముందుగా బ్రాహ్మణులకు పెట్టి తర్వాత తాము తిన్నారని ఉంది. దానిని నన్నయ అనువదించలేదు. వదిలేశాడు.

3. రాజసూయ యజ్ఞం సందర్భంలో ధర్మరాజు చతుర్వర్ణాల వారినీ పిలువ నంపాడు అని సంస్కృతంలో ఉంది. తెలుగులో ఆ ఆహ్వానం బ్రాహ్మణ క్షత్రియులకు మాత్రమే పరిమితం చేశారు.

4. మూలంలో భీముడు బకాసురవధ ఘట్టంలో బండిలోనే కూచుని అన్నం తిన్నాడు. నన్నయ అతని చేత కాళ్ళు చేతులు కడిగించాడు.

ఇలా బ్రాహ్మణాధిక్యం - కర్మకాండ రోజురోజుకు పెరిగి పోతూ వచ్చాయి.

బ్రాహ్మణ హుంకారంతోనే శత్రువులు (రాక్షసులు) చనిపోయిన వర్ణనలు కూడా భారతంలో ఉన్నాయి. (శాంతి. 1-361)

దైనందిన వ్యవహారాలలోనే కాక రాజ్య నిర్వహణలోనూ పురోహితులు సలహాలు ఇస్తుండే వారు. పురోహితుణ్ణి పెట్టుకుని అన్ని కార్యక్రమాలూ అతని సలహా ప్రకారం చేయటం అనేది అలవాటుగా ఆ తర్వాత తప్పని సరి ధర్మంగా స్థిరపడింది.

వర్ణ ధర్మమూ పురోహిత వ్యవస్థా పరస్పర పోషకంగా ఉంటూ వచ్చాయి.

మహాభారతంలో, 'వాయు దేవుడు పురూరవునకు చెప్పిన రాజధర్మం' ప్రసక్తి ఉంది. వీటికి పురూరవుని కాలంలోనే అంకురార్పణ జరిగి ఉండవచ్చు. ఆ విషయాలనే భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు శాంతిపర్వంలో.

ఐలుడైన (ఇల పుత్రుడు) పురూరవుడు - 'ఈ భూమి ఎవరి ధనం? బ్రాహ్మణులదా? క్షత్రియులదా? అని వాయుదేవుడిని అడిగాడట. ఈ భూమిపై ఆధిపత్యం కోసం బ్రాహ్మణ క్షత్రియ కులాల మధ్య జరుగుతున్న పోరాటాన్ని ఇది సూచిస్తున్నది. వాయు దేవుని సమాధానం ఈ విధంగా ఉంది.

బ్రహ్మదేవుని ముఖం, బాహువులు, తొడలు, పాదాలు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు జన్మ స్థానాలు. ఉత్కృష్టమైన జన్మ కలవాడు కాబట్టి బ్రాహ్మణుడు సర్వ వర్ణాలకు ఈశ్వరుడు. ఈ భూమీ ధనధాన్యాది సమస్త వస్తువులూ తాను అనుభవించటానికీ ఇతరులకు ఇవ్వటానికీ ఇతడే శక్తుడు. భూమిపై దండనీతి ధారణకు క్షత్రియుడిని అతడే (బ్రాహ్మణుడే) నియోగించాడు. అందుచేత నిజ ధర్మం పాటించే వాడూ, విద్వాంసుడూ శాంతుడూ అయిన పురోహితునికి సర్వ సంపదలూ సమర్పించి రాజు అహంకారం లేనివాడై దండనీతితో భూమిని పాలించాలి'.

మనసులో భయం ఉంటే ఎవరైనా గాని ఏ సుఖానుభవమూ పొందలేరు. భయం పోగొట్ట గల సమర్థుడు కాబట్టి రాజు సాటిలేని అధికారం పొందాడు - అని కూడా వాయుదేవుడు చెప్పాడు. (తెలుగు భారతం . శాంతి 2-302, 303)

పురోహితుని మంత్రాలోచన వల్లనే రాజు శుభాలు పొందుతాడట.

"అమర గరుడ గంధర్వ విద్యాధరాది, దివ్యులకు నధ్వరంబుల దృప్తిసేసి పరమ శుభముల బొందు భూవరుడు దాని, కెల్ల మూలంబు దగు పురోహితుని బుద్ధి." (భార. శాంతి. 2-306)

బ్రాహ్మణులూ క్షత్రియులూ కలిసి ఉండవలసిన అవసరాన్ని మహాభారతం చాలా నొక్కి చెప్పింది. ధర్మరాజు సందేహాలు తీర్చే నెపంమీద భీష్ముని నోట బ్రాహ్మణాధిక్యం, పురోహితుని అవసరం వంటివన్నీ చెప్పించారు. ఇవన్నీ భీష్ముడు తనంతతాను చెప్పినట్టుగా

కాకుండా పూర్వం ఎవరో ఎవరికో చెప్పినట్టు ఉండటం విశేషం. ప్రాచీన కాలం నుంచీ అవి వ్యాప్తిలో ఉన్నాయని చెప్పటమే వారు ఆశించిన ప్రయోజనం. అది చాలా గొప్పగా నెరవేరిందనటంలో సందేహం లేదు.

పురూరవుడు నైమిశారణ్యంలో మునులు చేస్తున్న సత్రయాగాన్ని చూడటానికి వెళ్ళాడు. ఆ యజ్ఞ వాటిక అంతా బంగారం మయంగా ఉంది. దానిని దొంగిలించాలనే బుద్ధి రాజుకు కలిగింది. అది తెలిసి మునులు ఇతన్ని వజ్రంతో కొట్టారు. ఆ దెబ్బకు ఈ రాజు ప్రాణాలు వదిలాడని బ్రహ్మాండ పురాణం చెబుతున్నది.

బ్రాహ్మణుల యజ్ఞాలు ఎంత ఆడంబరంగా, ధన వ్యయాలతో ఉండేవో దీనిని బట్టి తెలుసుకోవచ్చు. బ్రాహ్మణుల యజ్ఞాలు కాబట్టి దానాలన్నీ వారిలో వారికే ఇచ్చుకుంటారు. ఈ విధంగా సంపన్నులై వారు రాజులనే కొట్టే స్థితిలో ఉండే వారన్నమాట.

ఊర్వశివల్ల పురూరవునికి 11 మంది కొడుకులు కలిగారు. ఆయువు, శతాయువు, సత్యాయువు, జయుడు, విజయుడు మొ॥ వారు.

పురూరవుని మరణానికి కారకులయిన మునులను చంపటానికి వీరంతా బయలు దేరుతుంటే ఆయువు వారిని మందలించి వారితో పోరాడి వారి ప్రయత్నం మాన్పాడు. ఆయువు పుత్రులు నహుషుడు, వృద్ధశర్మ గయుడు అనేనసుడు క్షత్రవృద్ధుడు, రజ, రంభుడు మొ॥ వారు

కాలక్రమంలో సమాజంలో వచ్చిన మార్పులూ రకరకాల సంఘటనలూ సంవాదాల రూపంలో ఆయా కథల్లో చేరిపోతూ ఉండటం పరిపాటి. పురూరవుడు ప్రఖ్యాతుడైనరాజు కాబట్టి ఆయన చరిత్రకు రకరకాల కథలూ రాజ ధర్మాలూ దండనీతి జోడించి ప్రచారం చేసి సమాజాన్ని కట్టుదిట్టం చేశారు.

## పురుకుత్సుడు

మాంధాత రెండో కొడుకు. మాంధాత ధర్మ పరిరక్షకుడు. వసుహోముడనే వాని దగ్గర దండనీతినీ దండోత్పత్తి క్రమాన్నీ తెలుసుకుని అమలు పరచాడు. పురుకుత్సుడు కూడా తండ్రివలెనే దండనీతిని అమలు చేశాడు.

కశ్యపుని కుమారులు మౌనేయులు (గంధర్వులు?) పాతాళాన్ని పాలించే నాగ రాజులను ఓడించి వారి రాజ్యం చేజిక్కించుకున్నారట. నాగులు విష్ణువుతో చెప్పుకున్నారు. తన అంశతో పుట్టిన పురుకుత్సుడు నాగులకు సహాయ పడతాడని విష్ణువు వారికి అభయం ఇచ్చాడు. నాగుల కోరికపై పురుకుత్సుడు నాగలోకానికి వెళ్ళి గంధర్వ నాయకులను చంపి నాగులకు సహాయ పడ్డాడు. తన నాగలోక సంచారం తలచుకునేవారికి పాముల బాధ లేకుండా వరం పొందాడు. రాజు విష్ణువు అంశతో ఉంటాడనే ప్రతిపాదన.

ఇక్ష్వాకు రాజులు నాగరాజులతో అంటే నాగ గణాలతో సఖ్యంగా ఉండటం - ఉమ్మడిగా శత్రువులను ఎదుర్కోవటం అనే విషయాలు ఇక్కడ గమనించవచ్చు. ఇది దేవ - అసుర సంబంధాలలో లేదా ఆర్య - అనార్య సంబంధాలలో ఒక గొప్పమలుపు.

నాగులు అనార్య గణాలకింద పరిగణించబడేవారు. నాగులు అంటే ఉన్న నానార్థాల వల్ల నాగులు పాములరూపాలలో ఉంటారనే స్ఫురణ ప్రచారంలో ఉంది. అది సంకేత పదంగా గమనిస్తే నాగులు ఒక జాతి అని అర్థం చేసుకోవాలి. ఆంధ్రులలో నాగ, యక్ష జాతుల వారు బౌద్ధాన్ని ఆదరించారట.

పురుకుత్సుని భార్య నర్మద గురించి అనేక కథలున్నాయి.

1. నర్మద నాగుల సోదరి. నాగకుమారులు పురుకుత్సుడు తమకు చేసిన సహాయానికి ప్రతిగా తమ చెల్లెలిని అతనికిచ్చి వివాహం చేశారు. నర్మద పరోక్షంగా నాగజాతి ఔన్నత్యానికి ప్రతీక.

2. నర్మద చంద్రుని పుత్రిక. పురుకుత్సుని ప్రేయసి. నాగులు పురుకుత్సుని సహాయం కోరాలనుకుంటున్నప్పుడు అక్కడికి వెళ్ళి పురుకుత్సుని నాగలోకానికి తీసుకు వెళ్ళింది.

3. నర్మద శివుని కుమారిత. తాండవ నృత్యం చేస్తున్న శివుని స్వేదం నుంచి పుట్టింది. దూకుడు స్వభావం గలది. కరువు కాటకాల సమయంలో భూమి మీదికి వదిలితే దూకుడుగా ప్రవహించేది. శివుడు ఆమెను తన జటాజూటంలో బంధించాడు. మేఖలుడు తన భుజాలు అడ్డుపెట్టి ఆమె ఉరవడి తగ్గించాడు.

4. నర్మద మేఖల కన్య, వింధ్య పర్వతుని మనమరాలు.

5. నర్మద ఎప్పుడూ కన్యే, అజేయురాలు. (నర్మదపై తలపెట్టిన ఏ ఆనకట్టల నిర్మాణమూ పూర్తికాదట).

6. నర్మద పురుకుత్సుని కోడలు. (మత్స్య పురాణం)

7. నర్మద భారత దేశంలోని ఏడు ప్రధాన నదులలో ఒకటి. సూర్యకుండ్ నర్మద జన్మ స్థలం. నర్మద అంటే ఆనందం కలిగించేది అని అర్థం. గంగలో ఒకరోజు, సరస్వతిలో మూడు రోజులు, యమునలో ఏడు రోజులు స్నానం చేస్తే లభించే పుణ్యం నర్మదను ఒకసారి కంటితో చూస్తేనే లభిస్తుందని మత్స్య విష్ణు పురాణాలు చెబుతున్నాయి. మత్స్య పురాణంలో నర్మదా మహాత్మ్యం చాలా విస్తరంగా ఉంది.

నర్మదా తీరం అసురుల ప్రాధాన్యం గల ప్రాంతం. నర్మదా తీరంలో చాలా తీర్థ క్షేత్రాలున్నాయి. 'అమర కంటక' తీర్థం దగ్గర దేవాసుర సంగ్రామం ఒకటి జరిగిందట. బజార్ నదితోనూ సరస్వతి నదితోనూ, తవానది తోనూ భిన్న ప్రదేశాలలో ఈ నర్మదా నది కలుస్తోంది. అవన్నీ అసురుల ప్రాంతాలు.

ఇక్ష్వాకు రాజులు అసుర ప్రాంతాలతో సంబంధం కలిగి ఉండటాన్నీ నాగరాజ్యాలతో సఖ్యంగా ఉండటాన్నీ పురుకుత్సుని కథ సూచిస్తున్నది. జాతులు, తమ వైరాన్ని వదలి సఖ్యతకు ఉత్సాహం చూపటం. చరిత్రలో ముఖ్యమైన దశ. శివ మహా పురాణం (అధ్యా. 37) లో మరిన్ని వివరాలున్నాయి.

పురుకుత్సుడు నాగులకు సహాయ పడ్డాడూ అంటే నాగారాధకులైన శైవుల పట్ల సానుభూతి చూపాడని అనుకోవచ్చు. సాధారణంగా చాలా పురాణాలు. శివుని గురించి ప్రస్తావించినా శివుని పరాక్రమాన్ని చెప్పినా చివరకు విష్ణువుకే ప్రాధాన్యం ఇస్తుంటాయి.

పురుకుత్సుని అనుయాయులు లేదా శివుని వర్గం వారు పురుకుత్సుని ప్రఖ్యాతం చేసి ఉంటారనీ అనంతర కాలపు పురాణకర్తలు ఇతని ప్రాధాన్యం తగ్గించారనీ అనిపిస్తుంది. పురూరవునిలాగా హరిశ్చంద్రునిలాగా ఇతని జీవిత సంఘటనలు ప్రచారం పొందక పోవటానికి కారణం నాగుల ప్రసక్తిని కొందరు పురాణ కర్తలు సహించలేకపోవటమే అని కూడా చెప్పుకోవచ్చు.

నాగులు ఆర్యజాతి ఆధిపత్యాన్ని అంగీకరించలేదు. అందువల్ల ఆర్యులు వీరిని దాస దస్యు దస్యు పదాలతో సంబోధించారని కొందరంటున్నారు. అప్పటికి నాగులు బలంగా ఉండటం వల్లనూ, నాగులతో సఖ్యంగా ఉండటం ఒక చారిత్రక ఘటన కావటం వల్లనూ పురుకుత్సుని షట్చక్రవర్తులలో ఒకనిగా గుర్తించవలసివచ్చిందేమో.

## హరిశ్చంద్రుడు

అయోధ్యనుపాలించిన సూర్యవంశపురాజు. ఇతని చరిత్ర భాగవతంలో, దేవీ భాగవతంలో, మార్కండేయ పురాణంలో, స్కంద పురాణంలో, మహా భారతంలో ప్రసక్తమైంది.

బ్రాహ్మణ విధేయత, వర్ణ ధర్మాలను అమలు జరపటం, ముఖ్యంగా మాల మాదిగ వర్గాలను వారి వారి పరిధుల్లో ఉంచటానికి ప్రయత్నించటం హరిశ్చంద్రుని పాలనలోని ప్రత్యేక లక్షణాలు. వర్ణ ధర్మ రక్షణలో ఆయన కొన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నాడు. ఒక దశలో మాల మాదిగ వర్గాలకు దాసుడుగానూ ఉండవలసి వచ్చింది. వర్ణ వ్యవస్థను సమర్థిస్తూ పురాణాలను తిరగరాసిన కాలంలో హరిశ్చంద్రుని ప్రవర్తనను సమర్థిస్తూ అనేక కల్పనలు ఈయన కథకు జోడించారు.

హరిశ్చంద్రుడు సత్యవ్రతుని కొడుకు. సత్యవ్రతుని భార్య సత్యరథ, కేకయ వంశీయురాలు (శివపురాణం. అధ్యా. 38).

హరిశ్చంద్రుని భార్య చంద్రమతి (కొన్ని చోట్ల ఈమె పేరు శైబ్య).

భాగవతం ప్రకారం పురుకుత్సునికి హరిశ్చంద్రుడు ఏడో తరం వాడు. హరిశ్చంద్రుని

తండ్రి సత్యవ్రతుడు (త్రిశంకుడు) - గురుశాపం వల్ల చండాలుడయ్యాడనీ కౌశికుని ఆశ్రయించి స్వర్గానికి వెళ్ళాడనీ భాగవతం చెబుతోంది.

హరిశ్చంద్రుడు సంతానం లేక విచారిస్తూ ఉంటే నారదుడు వచ్చి వరుణ వ్రతం చేయవలసిందిగా సలహా ఇచ్చాడు. పుట్టిన కొడుకును యాగ పశువుగా చేసి యాగం చేస్తానని మొక్కుకుని హరిశ్చంద్రుడు వ్రతం చేశాడు. పెద్ద కొడుకును యాగ పశువుగా బలి ఇస్తే బోలెడంత మంది కొడుకులు కలుగుతారనే నమ్మకం ఇతర మతాలలోనూ ఉంది. పురాణాలలోనూ ఇంకా ఇలాంటి సంఘటనలున్నాయి.

యాగఫలితంగా హరిశ్చంద్రునికి రోహితుడనే కొడుకుకలిగాడు.

వెంటనే వరుణుడు వచ్చి యాగం గురించి అడిగాడు. పురుడు వెళ్ళాక చేస్తానన్నాడు హరిశ్చంద్రుడు. ఆ తర్వాత పళ్ళు రావాలనీ, బడిపళ్ళు రావాలనీ, యుద్ధవిద్యలు నేర్చుకోవాలనీ ఇలా రకరకాల సాకులు చెబుతూ వాయిదాలు వేశాడు. తండ్రి సంకల్పం తెలిసి రోహితుడు అడవులకు పారిపోవటం - హరిశ్చంద్రుడు రోగం బారిన పడటం జరిగాయి. ఐదేళ్ళకు అజీగర్తుడనే వాని మధ్యమ పుత్రుడైన శునశ్శేపుని యాగపశువుగా చేసి పురుష యజ్ఞం చేయబోయాడు. అదో కథ. మొత్తానికి ఏదో ఒకలాగ వరుణుడిని తృప్తి పరచాడు. యాగం పేరుతో దక్షిణలు లభించి దేవగణాలు సంతోషించాయి.

"భూలోకంలో ఆడితప్పని రాజు ఎవరైనా ఉన్నారా?" అని ఇంద్ర సభలో ప్రశ్నవస్తే వసిష్ఠుడు హరిశ్చంద్రుని పేరు చెప్పాడు. విశ్వామిత్రుడు అది ఒప్పుకోలేదు. వారిద్దరూ పందెం వేసుకున్నారు. విశ్వామిత్రుడు ఎన్నో మాయలు చేసి హరిశ్చంద్రుని కష్టాలపాలు చేశాడు. ఆ క్రమంలో హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి యాగ దక్షిణగా వాగ్దానం చేసిన సొమ్ము ఇవ్వలేకపోవటం - రాజ్యం కోల్పోయి భార్యా పుత్రులతో (చంద్రమతి, రోహితుడు) అయోధ్య వదిలివెళ్ళవలసి రావటం - భార్యా పుత్రులను అమ్ముకోవటం - చివరకు తనను తాను అమ్ముకొని విశ్వామిత్రుని బాకీ చెల్లించటం - కాటి కాపరిగా ఒక మాలవానికి దాసుడుగా కాలం గడపటం, కొడుకు శవాన్ని తీసుకొని చంద్రమతి స్మశానానికి వస్తే కాటి సుంకం కోసం పట్టుపట్టటం - చేయని నేరానికి చంద్రమతి శిక్షకు గురైనప్పుడు తానే ఆమెకు మరణ శిక్ష అమలు జరప వలసి రావటం - అయినా విశ్వామిత్రుని ప్రలోభానికి లొంగక పోవటం వంటి ఘట్టాలు ఉత్కంఠ భరితంగా కలకాలం ప్రజలలో నిలిచి ఉండేలాగ రాశారు.

ఇంతకూ విశ్వామిత్రుని ఆ ప్రలోభం ఏమిటంటే విశ్వామిత్రుని పెంపుడు కూతుళ్ళయిన మాలమాదిగ కన్యలను వివాహం చేసుకోటం. తన కూతుళ్ళను వివాహం చేసుకోవలసిందిగా విశ్వామిత్రుడు ఎప్పుడో హరిశ్చంద్రుని అడిగాడు. హరిశ్చంద్రుడు ఒప్పుకోలేదు. ఇప్పుడైనా

తన కూతుళ్ళను వివాహం చేసుకుంటే బాకీ మాఫీ చేస్తానని విశ్వామిత్రుడు ఎన్నో సార్లు హరిశ్చంద్రునికి చెప్పాడు.

'కుల సంకరం కూడని పని - అని రాజు అందుకు అంగీకరించలేదు.

'పాలవంటికులం మాలగా చేసుకోలేను' అని హరిశ్చంద్రుడు ఖండితంగా చెప్పాడు. వర్ణ సంకరాన్ని అరికట్టవలసిన తాను ఆ పని చేయలేనన్నాడు. దానికంటె భార్యా పుత్రులను దాసులుగా అమ్ముకోవటానికీ వారి చేత దాస్యం చేయించటానికీ, తాను కూడా దాస్యం చేయటానికీ సిద్ధపడ్డాడు.

అంటరానితనం ప్రచారం చెయ్యటమూ దానిని తప్పనిసరిగా పాటించాలని ప్రబోధించటమూ హరిశ్చంద్రుని కథ లక్ష్యాలు. హరిశ్చంద్ర చక్రవర్తి కథ ద్వారా ఆదర్శంగా తీసుకోవలసిన అంశాలు అయితే అవే. ఆ సంగతి వాచ్యంగా చెప్పకుండా దానికి రంగు పూశారు.

సత్యవ్రతం అనేది ఆ రంగు. ఆడిన మాట చెల్లించటం కోసం హరిశ్చంద్ర మహారాజు ఎన్నో కష్టాలు పడ్డాడనీ చివరికి మాలమాదిగవానికి అమ్ముడు పోయాడనీ కాటి కాపరిగా ఉన్నాడనీ ఎంతో దుఃఖంతో చెప్తుంటారు. మాలమాదిగలు సమాజంలో అతిహీన స్థితికి చెందిన వారన్న విషయమూ కాటి కాపరి వృత్తి అతి హీనమైన వృత్తి అనే విషయమూ చెప్పకనే చెబుతూ వారిని కించ పరుస్తుంటారు.

కథ చివరలో హరిశ్చంద్రునికి దేవగణాలు ప్రసన్నులై ఆయన కష్టాలు తీర్చటంతో కథ సుఖాంతమవుతుంది, హరిశ్చంద్రునికి స్వర్గలోకమూ ప్రాప్తించింది. ఆయన కొలువు చేసిన వారంతా దేవగణాల లోని వారే అని తెలిపి చండాలుని సేవించిన దుఃఖం పోగొట్టడం కూడా కథలో చూడవచ్చు. చండాలసేవ నిజంగా అంత దుఃఖకరం అన్నమాట.

యాగదక్షిణ పేరుతో, హరిశ్చంద్రుని ధనమంతా కొల్లగొట్టి, కులహీనుణ్ణి కొలిచేలాగ చేసినందుకు వసిష్ఠునికి కౌశికుని మీద కోపం వచ్చిందట. 'గద్ద'గా అవుతావని ఆయన కౌశికుని (విశ్వామిత్రుణ్ణి) శపించాడు. కొంగగా అవుతావని కౌశికుడు వసిష్ఠుని శపించాడు. ఆ ఇద్దరూ పక్షుల రూపాలలో కొట్లాడుకుంటూ ఉంటే బ్రహ్మ వారిని ఆపాడట.

హరిశ్చంద్రుడు తన కుమారునికి బదులుగా మరొకరి కొడుకును పశువుగా చేసి యాగం చెయ్యబోవటం దేవీభాగవతంలోని కథలో కనిపిస్తుంది. ఒక వస్తువుకు బదులు మరో వస్తువును ఇవ్వటం అనే ఆర్థిక సూత్రం ఇందులో గమనించవచ్చు. పూజా కార్యక్రమాలలో ముఖ్యంగా వినాయక చవితి పూజ సందర్భాలలో పుష్కలంగా దొరికిన ఒక ఆకునే రకరకాల ఆకుల పేర్లతో వినాయకునికి సమర్పిస్తూండటం - తులసి రెమ్మ నీళ్ళలో ముంచి ప్రోక్షిస్తూ, ఒకే రకం పువ్వులను వేరే వేరే పూల రకాల పేర్లతో సమర్పించటం వంటి మినహాయింపులు ఈ సంప్రదాయాల ఫలితాలే.

షట్చక్రవర్తులలో హరిశ్చంద్రుడు మూడో వాడైనా జాబితాలో ఇతని పేరే ముందుగా చెబుతారు. దండనీతిని పటిష్ఠంగా అమలు జరపటం, మునులకు ఇచ్చిన మాట నెరవేర్చే బాధ్యత ప్రదర్శించటం, వర్ణ సంకరం జరగకుండా చూడటం, వర్ణ ధర్మాన్ని పవిత్రంగా పాటించటం, మాలమాదిగలను దూరం పెట్టడం అందుకు కారణాలు.

మాలమాదిగలను అంటరాని కులాలుగా చూడటం వంటి నియమాలను స్వయంగా ఆచరించినందుకే ఈయన మరింత ఆదర్శ మూర్తి అయ్యాడు.

(వివరంగా హరిశ్చంద్రుని కథ కోసం హైదరాబాదు బుక్ ట్రస్టు వారి, 'పురాణాలు - కులవ్యవస్థ - సత్యహరిశ్చంద్రుడు' అనే పుస్తకం చూడవచ్చు).

'వర్ణసంకరం తప్పు' అనే వర్గం ఒకటి ఆది నుంచీ సమాజంలో ఉంటూనే వచ్చింది. అలాంటి సంబంధాలతో కూడిన కథలు పురాణాలలో కనిపించటానికి ఆ వర్గం ప్రబలంగా ఉన్న దేశ కాల పరిస్థితులు కారణం కావచ్చు. అలాగే వర్గ వర్ణ తారతమ్యాన్ని గురించి 'కులతత్వం కూడదు' అనే వర్గం కూడా అప్పుడు ఉంది. అందుకే వారు హరిశ్చంద్రుని ప్రవర్తనకు పరిహారంగా అతని చేత కాటికాపరితనం, చండాలసేవ చేయించారు. ఇవన్నీ ఆయా కాలాలలో ఆ పాత్రకు చేరిన మార్పులూ చేర్పులూ కావచ్చు. మళ్ళీ మొదటి వర్గం వారు వచ్చి హరిశ్చంద్రుడు సేవించిన చండాలుడు నిజంగా చండాలుడు కాదు యమధర్మరాజు ఆ రూపంలో వచ్చాడని కథ మార్చేశారేమో. వందల సంవత్సరాలు గడిచి పోయిన దశలో ఏయే కథల్లో ఏయే మార్పులు జరిగాయో అనూహ్యం.

వాస్తవానికి ఎప్పుడూ సత్యమే పలుకుతూ 'సత్యవ్రతుడు'గా పేరు పొందిన వాడు పురాణ కథలలో ఒకడున్నాడు. అతడు దేవదత్తుడనే బ్రాహ్మణుని కుమారుడు. గోబిలుని శాపంవల్ల తెలివి తేటలు లేని వాడయ్యాడు. తల్లీ దండ్రీ కూడా ఇతన్ని వదిలేశారు. ఒకప్పుడు ఇతడు తపస్సు చేసుకుంటూ ఉండగా బోయవాడు తరుముతూ ఉన్న పంది ఒకటి అటునుంచి పరుగెత్తుకుంటూ పోయింది. ఆ సమయంలో వాగ్బీజం ధ్వని వంటి ధ్వని ఇతనికి వినిపించింది. బోయవాడు వచ్చి, పంది ఏమైందని అడిగాడు. పందిని చూసింది కన్ను. ఆ కన్ను మాట్లాడలేదు. మాట్లాడేది నోరు. ఆ నోరు చూడలేదు. ఏం చెయ్యాలి. చెపితే పంది ప్రాణం తీసినట్టవుతుంది. చెప్పకపోతే అసత్యదోషం. అందుకని ఇతడు ఆ పంది వచ్చినప్పుడు కలిగిన ధ్వని (వాగ్బీజ ధ్వని) చేశాడట. ఆ వాగ్బీజ ధ్వనికి విద్యా దేవత సరస్వతి మెచ్చి వచ్చి అతనికి కవిత్వమూ, విద్యా రెండూ ఇచ్చింది (దేవీ భాగవతం).

హరిశ్చంద్రుని తండ్రి కుల గురువైన వసిష్ఠునికి అయిష్టుడై మూడు సందర్భాలలో అతనికి కోపం తెప్పించి 'త్రిశంకువు' అయ్యాడు.

పురోహితుల పట్ల పూర్తి విధేయత లేనందువల్ల చాలా కష్టాలు పడ్డాడు. శాపంచేత చండాలుడూ అయ్యాడు. అందుకే హరిశ్చంద్రునికి మాలమాదిగ సంపర్కం అంటే రోత.

పురోహిత వ్యవస్థ ఎంత బలమైనదో - దాన్ని ఎదిరిస్తే ఎన్ని కష్టాలు పడాలో సత్యవ్రతుని కథ ద్వారానూ అతని కొడుకైన హరిశ్చంద్రుని కథ ద్వారానూ సమాజానికి చూపించి సమాజాన్ని శాసించారు బ్రాహ్మణ క్షత్రియ వర్గాలవారు.

బ్రాహ్మణ ధర్మ శాస్త్ర కర్తలు ఏర్పరచిన వర్ణ ధర్మం పూర్తిగా పాటించాలన్నందుకే హరిశ్చంద్రుని ఆదర్శ చక్రవర్తిగా ప్రచారం చేశారు.

**సగరుడు**

అయోధ్యను పాలించిన రాజు. హరిశ్చంద్రునికి ఎనిమిదోతరం వాడు. బాహుకుని కొడుకు. బాహుకుని కీ హైహయ వంశపురాజులకూ వైరం ఉండేది. హైహయులు రాక్షస గణాలతో మిత్ర కూటమిలో ఉండే వారు. ఇక్ష్వాకు రాజులు దేవ గణాలతో మిత్ర కూటమిలో ఉండే వారు. సగరుడు పుట్టక ముందే హైహయులు అతని తండ్రిని రాజ్యం నుంచి వెళ్ళగొట్టారు. బాహుకుడు భార్యలతో అరణ్యంలో ఉంటూ అక్కడే చనిపోయాడు. అప్పటికి సగరుని తల్లి గర్భవతి. ఆమె సహగమనం చేయబోతే ఔర్వుడు (చ్యవనుడు) అన్న ముని ఆమెను వారించాడు. సవతులు ఆమెకు విషం (గరళం) పెట్టారు.

గర్భంలోని కుమారుడు దానిని సహించి (స+గరము) గరళ సహితుడై పుట్టాడట. అంచేత అతనిని 'సగరుడు' అని పిలిచారట.

సగరుడు హైహయుల గురించి తెలుసుకుని వారిని ఓడించి తండ్రి రాజ్యం తిరిగి సంపాదించుకున్నాడు. అశ్వమేధ యాగాలు చేస్తూ యాగాశ్వాన్ని బంధించిన రాజులను చంపుతూ వచ్చాడు.

హైహయులను చంపినప్పుడు వారి మిత్ర గణాలైన శకుల తలలు సగభాగం గొరిగించి పంపేవాడట.

యవన కాంభోజుల తలలు పూర్తిగా గొరిగించాడు.

పారదులకు పహ్లవులకు తలలు గొరిగించి మీసాలు ఉంచాడు. వారికి వేదాధ్యయనంలోనూ యజ్ఞానుష్ఠానంలోనూ అధికారం (Share) లేకుండా చేశాడు. (శివపురాణం 38 అధ్యా.)

సగరునికి ఇద్దరు భార్యలు. విదర్భరాజు కూతురు కేశిని. (వైదర్భి) పెద్ద భార్య. అరిష్టనేమి కూతురు సుమతి రెండో భార్య. ఈమెనే బ్రహ్మ వైవర్త పురాణం శైబ్యగా పేర్కొన్నది. వీరిపేర్లు ఒక్కో పురాణంలో ఒక్కో విధంగా ఉన్నాయి.

సగరునికి ప్రభ, భానుమతి అని ఇద్దరు భార్యలు. ప్రభకు 60 వేల మందీ, భానుమతికి అసమంజుడు అనేవాడూ కలిగారని మత్స్యపురాణం (12 అధ్యాయం - 43) చెబుతున్నది. భగీరథుని వరకూ ఉన్న వంశక్రమంలో పేర్లు కూడా అన్ని పురాణాలలోనూ ఒకే లాగ లేవు.

సగరునికి చాలకాలం సంతానం కలగకపోతే ఔర్వుని సలహా మీద భార్యలతో కైలాసానికి వెళ్ళి తపస్సు చేశాడట. ఈశ్వరుడు వైదర్భికి అరవై వేల మంది కొడుకులూ శైబ్యకు ఒక కొడుకూ కలుగుతారని వరమిచ్చాడు. ఇద్దరికీ చెరొక కుమారుడూ పుట్టారు. వైదర్భికి పుట్టిన పిండాన్ని అరవై వేల ముక్కలు చేస్తే అందులోంచి అరవై వేల మంది కొడుకులు ప్రాణం పోసుకున్నారు. వీరంతా సగర పుత్రులు. ఒక పిండాన్ని అరవై వేల ముక్కలు చేసే కార్యక్రమం శివుడు నిర్వహించాడని ఒక పురాణంలోనూ ఔర్వుడు నిర్వహించాడని మరో పురాణంలోనూ చెప్పారు.

సగరునికి ఒక కూతురు కూడా ఉందని బ్రహ్మ వైవర్త పురాణం చెబుతోంది. కాని పుత్రుడే వంశ వర్ధనుడు అనే నమ్మకం వల్ల ఆమె గురించి ఎక్కువ వివరాలు ఇవ్వలేదు.

సగరుడు రాజ్య విస్తరణకు యజ్ఞాలు చేసినా భవ బంధాల గురించీ మోక్ష మార్గం గురించీ కాలపాశాలు తెంచుకోవటం గురించీ కూడా ఆలోచించినట్లు (భారతం. శాంతి పర్వం 5-459, 460) తెలుస్తోంది. ఈ విషయాల గురించి అరిష్టనేమి అనే మునితో చర్చించేవాడట.

శైబ్య పుత్రుడైన అసమంజుడు అల్లరిగా ఉంటే అతనిని సగరుడు రాజ్యం నుంచి వెళ్ళగొట్టాడు. పిల్లలను నదిలో ముంచటం, తర్వాత నాలుగైదురోజులకు వారిని ప్రాణాలతోనే బయటకు తీయటం వంటి పనులు చేస్తుండేవాడట.

ఆ తర్వాత సగరుడు మళ్ళీ అశ్వమేధం చేశాడు. గుర్రం వెంట అరవై వేల మంది కొడుకులూ వెళ్ళారు. సముద్ర తీరంలో తిరుగుతూ గుర్రం మాయమైంది. దానిని వెదకలేక కొడుకులు తిరిగివస్తే సగరుడు వారిపై కేకలు వేశాడు. గుర్రంతో పాటే నగరానికి రావాలన్నాడు. వాళ్ళు గుర్రం కోసం సముద్రాన్ని తవ్వుతూ పోయారు. అలా తవ్వగా తవ్వగా రసాతలంలో కపిలుని ఆశ్రమంలో గుర్రం కనిపించింది. వీళ్ళంతా ఆయనను అనుమానించి ఆయన చేత శాపం పొంది బూడిద అయ్యారు. గుర్రాన్ని అసలు దొంగిలించిన వాడు ఇంద్రుడు. అతడే దాన్ని కపిలుని ఆశ్రమంలో కట్టేసి వీరిని నాశనం చేశాడు.

కొడుకులు బూడిద అయిన వార్త విని సగరుడు పుత్ర శోకంతో మూర్ఛపోయాడు - అలాగే మరణించాడు అని ఒక పురాణమూ, అంశుమంతుడు కపిలుని బతిమాలి గుర్రాన్ని తెచ్చాడనీ యాగం పూర్తి అయ్యాకనే సగరుడు మరణించాడని మరో పురాణమూ చెబుతున్నాయి. సగరపుత్రులు తవ్వారు కాబట్టి సముద్రానికి సగరుడు తండ్రి అయ్యాడట. (శివ పురాణం. అధ్యా. 38)

సగరుడు వంద అశ్వమేధాలు పూర్తి చేశాక విష్ణువు అతనికి మేధాశక్తి, కీర్తి, ధనం, వంశాభివృద్ధి, సముద్రుడు కొడుకు అవటం అనే అయిదు వరాలిచ్చాడట.

సగరపుత్రుల బూడిద మీదుగా గంగ ప్రవహిస్తేనే వారికి పుణ్యలోకాలు కలుగుతాయని చెప్పారు. గంగను తీసుకురావటానికి సగరుని కొడుకు పంచజనుడు (అసమంజసుడు) లక్ష సంవత్సరాలూ, అతని తర్వాత అతని కొడుకు అంశుమంతుడు లక్ష సంవత్సరాలూ, ఆ తర్వాత అతని కొడుకు దిలీపుడు లక్ష సంవత్సరాలూ తపస్సుతో జీవితాలు చాలించగా దిలీపుని కొడుకు భగీరథుడు లక్ష సంవత్సరాలు తపస్సు చేసి శ్రీకృష్ణుని ప్రసన్నం చేసుకొన్నాడనీ అతని ఆదేశంపై గంగ భూలోకానికి వచ్చిందనీ బ్రహ్మ వైవర్త పురాణంలోని గంగోపాఖ్యానం ప్రకృతి ఖండం 10,11,12 అధ్యాయాలలో ఉంది.

భగీరథుడు ఈశ్వరుని ప్రార్థించి గంగను భూలోకానికి తెచ్చాడని బ్రహ్మాండ పురాణం చెబుతోంది.

బ్రాహ్మణులకు కోపం కలిగించకూడదు. వారికోపానికి ఆహుతి అయిన వారికి ముక్తి ఉండదు. పైగా ఎన్నో కష్టాలు పడవలసి వస్తుంది. పరలోక సుఖాలు లేక లక్షల సంవత్సరాలు బూడిద కుప్పలుగా పడి ఉండాల్సివస్తుంది. వారికి శాపవిమోచనం కలగాలంటే కొన్ని తరాల వరకూ వారి వారసులు భగీరథ ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది అని చెప్పటం ఈ కథ లక్ష్యం.

శివుడు, కృష్ణుడు దైవాలుగా అవతరించి పురాణాల ద్వారా ప్రజలలో చోటు చేసుకుంటున్న రోజులలోనిది బ్రహ్మ వైవర్త పురాణం. ఇందులో కృష్ణుడు, రాధ, ప్రకృతి దేవతలు, విష్ణు రూపాలు, శక్తి రూపాలు, గోలోకం వంటి వాని వివరాలున్నాయి.

యుద్ధాలలో ద్విజేతర శత్రు రాజుల పట్ల సగరుడు చూపిన ప్రవర్తనా వ్యవహారాల వల్ల ద్విజ ద్విజేతర కులాల వైరుధ్యాలు తెలుస్తున్నాయి.

**నలుడు**

'భర్త జూదగాడైనా, తనను అడవిలో ఒంటరిగా వదిలేసి పోయినా భార్య భరించాలి. భర్తను అనురాగంతో సేవించాలి.' అనేది ఈ కథలోని నీతి. ఎక్కువగా స్త్రీ ధర్మాలను నిర్దేశించే ఇతి వృత్తంతో ఉంది.

నిషధరాజైన వీరసేనుని కొడుకు నలుడు. ఇతని భార్య దమయంతి విదర్భరాజైన భీముని కూతురు. (దమనుడు అనే ముని వరం వల్ల భీమునికి దమయంతి అనే కూతురూ దమదాంత, దమనులనే కొడుకులూ కలిగారట)

నిషధ రాజ్యం అలకనంద నదీ తీరాన అలకానగరం రాజధానిగా ఉన్న ప్రాంతం.

విదర్భ రాజధాని కుండిన నగరం. విదర్భ రాజ్యం ఒకప్పుడు కుంతలరాజ్యానికి ఉత్తరంగా నర్మదాతీరం నుంచి కృష్ణాతీరం వరకు విశాలంగా పరుచుకొని ఉండేది. మధ్యగా ప్రవహిస్తున్న వరదానది ఆ రాజ్యాన్ని రెండుగా విడదీస్తోంది. ఉత్తర భాగానికి అమరావతి,

దక్షిణ భాగానికి ప్రతిష్ఠానమూ రాజధానులు. అమరావతి దేవగణాల కేంద్రం కాగా ప్రతిష్ఠానం సూర్య వంశరాజుల రాజధాని అయింది.

నలుడు పురుషులలో శ్రేష్ఠుడు. దమయంతి నారీ రత్నం. జనుల మాటల వల్ల ఒకరి సద్గుణాలు మరొకరికి తెలిసి ఇరువురిలోనూ ఒండొరులపై ఆసక్తి కలిగింది. దానికి తోడుగా ఒక రాజహంస వారిరువురికీ రాయబారం నడిపి వారి ప్రేమను మరింత అతిశయింప జేసింది. భీముడు తన కూతురుకు స్వయంవరం ప్రకటించి నిఖిల ధరావలయంలోని రాజన్యులను రప్పించాడు. పర్వతుడు, నారదుడు అనే పురాణ మునులు లోకాలన్నీ తిరుగుతూ ఇంద్రలోకానికి వెళ్ళారు. యుద్ధాలలో మరణించిన రాజులు స్వర్గానికి రావటం పరిపాటి. అయితే చాలాకాలంగా ఎవరూ రావటం లేదేమిటి అని ఇంద్రుడు అడిగాడు - భూలోక సుందరి దమయంతి నర సిద్ధ సాధ్య విద్యాధర సురకన్యల కంటె అందమైనది. ఆమె స్వయం వరం త్వరలో జరగబోతోంది. అక్కడికి వెళ్ళే వేడుకలో రాజులు తమలో తాము కలహించుకోవటం మానేసి ఉన్నారని మునులు చెప్పారు.

ఇంద్రుడూ దిక్పాలకులూ తమ తమ విమానాలెక్కి భూలోకానికి వచ్చారు. దమయంతి స్వయం వరానికి వెళ్తున్న నలుని దగ్గరకు వెళ్ళి తమకు దూతగా ఒక పని చేసి పెట్టాలని అడిగారు. నలుడు ఒప్పుకున్నాడు.

'మా సంగతి దమయంతికి చెప్పి ఆమె మాలో ఒకరిని వరించేలాగ చెయ్యి' అన్నారు వారు.

'నేనూ అదే కోరికతో వెళ్తున్నానని తెలిసి నాకీ కార్యం అప్పగించటం న్యాయమేనా' అన్నాడు నలుడు.

'చేస్తానని ఒప్పుకున్న తర్వాత చేయకుండా ఉంటావా? నిత్య సత్య నిరతుడవని తెలిసి నిన్ను అడిగాము' - అన్నారు వారు. 'అంతఃపురంలోకి ఎలా వెళ్ళాలన్న శంక వద్దు. నిన్నెవరూ అడ్డగించరు' - అన్నాడు ఇంద్రుడు. నలుడు తాను ఇచ్చిన మాటకు కట్టుబడి దూత కార్యానికి పూనుకున్నాడు.

అంతఃపురంలోకి వెళ్ళి దమయంతిని చూసి తాను వచ్చిన పని చెప్పాడు - నిన్నే కోరి ఉన్నాను. నీవు కాదంటే ఆత్మ హత్య చేసుకుంటాను - అన్నది దమయంతి.

దేవతలకు అప్రియం చేసిన మనుషులు అధోగతి పాలవుతారు. వారి కోరిక నెరవేర్చు అన్నాడు నలుడు. ఇంద్రాదులు స్వయంవరానికి వస్తే వారి సమక్షంలోనే నిన్ను వరిస్తాను - అన్నది దమయంతి. దేవతలు నలుగురూ నలుని రూపంలోనే (స్వయం వరంలో) కనిపించారు. అందులో నలుని గుర్తించలేక దమయంతి ఆ దేవతలనే ప్రార్థించింది. వారు కరుణించి తమ నిజ రూపాలు ధరించారు.

ఆ విధంగా ఆమె స్వయం వరంలో ఇంద్రాదులను మెప్పించి నలుణ్ణి వివాహం చేసుకున్నది. నలుడికి దేవతలు వరాలిచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా దమయంతీ స్వయం వరానికి బయలుదేరి వస్తున్న కలి ఎదురయ్యాడు. దమయంతి నలుని వరించిందని విని నలునిపై కోపం పెంచుకొన్నాడు. నల దమయంతులకు ఎడబాటు కల్పిస్తానని శపథం చేశాడు.

నలుడు అశ్వమేధాది క్రతువులూ, జపహోమ దానాది పుణ్య కర్మలూ చాలా చేస్తుంటాడు కాబట్టి ఈతనిని కలి ఆవహించలేక పోయాడు. నలదమయంతులకు ఒక కూతురూ ఒక కొడుకూ కలిగారు. చాలా కాలానికి నలుడు అశుచిగా ఉన్న ఒక సందర్భం చూసుకుని కలి అతన్ని ఆవహించాడు. కలి ప్రభావ ఫలితంగా 'పుష్కరుడు' అనే దాయాదితో జూదమాడి నలుడు రాజ్యం ఓడిపోయాడు. (ఆ జూదం అనేక మాసాలు సాగిందట.) రాజ్యంపోయి వారు అడవుల పాలయ్యారు.

దమయంతి తన పిల్లల్ని పుట్టింటికి పంపించి భర్తతో అరణ్యాలకు (కట్టుబట్టలతో) బయలు దేరింది. వారు నగరం బయట మూడు రోజులున్నా ఎవరూ వారిని పలకరించనే లేదట. ఆకలితో బాధ పడుతూ పక్షులనైనా పట్టుకుందామని నలుడు పక్కనే ఉన్న పక్షులపైకి తన ఒంటిమీది బట్ట విసిరాడు. అవి ఆ బట్టతో సహా ఎగిరిపోయాయి.గత్యంతరం లేక దమయంతి ఒంటిమీది బట్టనే ఒక వైపు నుంచి అతడూ కట్టుకున్నాడు.

చాలా బాధలు పడినాక నలుడు దమయంతిని పుట్టినింటికి వెళ్ళి ఉండమని చెప్పాడు. తనతో భర్తను కూడా రమ్మన్నది ఆమె. అన్నీ పోగొట్టుకున్న ఈ స్థితిలో తాను ఆమెతో రాలేనన్నాడు నలుడు. ఆ సందర్భంలో భార్య ధర్మాల గురించీ భార్య ప్రాశస్త్యం గురించీ దమయంతి చేత చెప్పించారు.

- భార్యతో కూడి ఉన్న వానికి కష్టాలు ఎన్ని కలిగినా తెలియవు. అలసి ఉన్నప్పుడూ ఆకలి దప్పులలోనూ భార్య భర్తకు ఆసరాగా ఉండి దుఃఖాలు పోగొడుతుంది. (భార. అరణ్య. 2-73,74) కనుక దమయంతి భర్తను విడిచి వెళ్ళనన్నది. తనతో భార్య కూడా కష్టపడుతుండటం చూడలేక పోయాడు నలుడు. ఒక రోజు దమయంతి నిద్ర పోతుండగా కట్టు వస్త్రాన్ని చింపుకొని ఆమెను వదిలి వెళ్ళిపోయాడు. ఆమె పుట్టినింటికి వెడుతుందని ఆయన భావించాడు. విదర్భకు వెళ్ళే దారి గుర్తులు ఆ పక్కనే నేల మీద వేశాడు.

దమయంతి పుట్టినింటికి వెళ్లటం భావ్యం కాదనుకున్నది. ఒంటరిగా అడవిలో నలుణ్ణి వెదకుతూ తిరుగాడింది. ఆమెను ఒక కొండ చిలువ మింగబోవటం - ఆమె ఆక్రందన విని ఒక ఎరుకు (కిరాతుడు) వచ్చి దానిని చంపి ఆమెను కాపాడటం - అనంతరం అతడు

ఆమెను కామించటం - దమయంతి కోపంతో చూడగానే అతడు చనిపోవటం - ఇవన్నీ శోకరసభరితమైన ఘట్టాలు . ఈ అంశాలలోనే పతివ్రతా ధర్మాలు నింపారు.

- నేను పతివ్రత నైతే ఈ దురాత్ముడు ఇప్పుడే మరణిస్తాడు - అని దమయంతి శాపం ఇవ్వగానే ఆ కిరాతుడు మరణించాడు (భారతం. అరణ్య. 2-91).

నలున్ని వెదకుతున్న దమయంతికి ఒక ముని వాటిక కనిపించింది. నలుని జాడ చెప్పవలసిందిగా ఆమె అందులోని మునులను కోరింది. నలుడు కొన్ని రోజుల్లో కనబడక పోతే తాను శరీరం వదిలేస్తానన్నది. ఈ కష్టాలన్నీ తీరిపోతాయి ఓపిక పట్టాలని ధైర్యం చెప్పి వారు ఆశ్రమంతో సహా అదృశ్యమయ్యారు. (పతివ్రతలకు ధైర్యం చెప్పటానికే ఆ మునులు వచ్చినట్లు సూచన)

చేది పతియైన సుబాహుని నగరానికి వెళ్తున్న ఒక వర్తకుల గుంపుతో కలసి దమయంతి ప్రయాణమైంది. మార్గ మధ్యంలో అడవి ఏనుగులు వారిని చెల్లా చెదరు చేశాయి. చావగా మిగిలిన వారితో కలిసి ఆమె సుబాహుని నగరం చేరుకుంది. పొద్దుటే రాజవీధిలో వెళ్తున్న దమయంతిని రాజమాత చూసింది. దాసీ చేత పిలిపించుకున్నది. సైరంధ్రిగా దమయంతికి ఆశ్రయం ఇచ్చింది.

నలుడు అరణ్యంలో తిరుగుతూ దావాగ్నిలో చిక్కుకున్న కర్కోటకుడనే నాగకుమారుని రక్షించాడు. ఆ నాగకుమారుడు కర్మవశాన ఒక ఋషిని దూషించి ఆ శాపం వల్ల కదలలేని వాడయ్యాడట. (మునులు, తమపట్ల విధేయంగా ఉండనివారిని చాలా ఇబ్బందులు పెట్టేవారు).

నలునికి ఉపకారం జరిగే విధంగా కర్కోటకుడు నలుణ్ణి కరిచాడు. ఆ విషం వల్ల నలుడు వికృత రూపుడయ్యాడు. ఆ విషం శరీరంలో ఉన్నంత కాలం నలునికి విష, ఉరగ, రాక్షస, పిశాచ శత్రుజనాల వల్ల భయం ఉండదని చెప్పాడు కర్కోటకుడు.

తిరిగి పూర్వవైభవం చేకూరుతుందనీ నిజ రూపం కావాలనుకొన్నప్పుడు తనను స్మరిస్తే ఒక వస్త్రం వస్తుందనీ దానిని ధరిస్తే నిజరూపం వస్తుందనీ చెప్పి ఋతుపర్ణుడనే రాజు దగ్గరికి వెళ్ళి అతనిని కొలుస్తూ ఉండవలసిందనీ, ఋతు పర్ణునికి అశ్వహృదయ విద్య నేర్పి అతని నుంచి అక్ష హృదయ విద్య నేర్చుకోవలసిందనీ సలహా ఇచ్చాడు.

నలుడు 'బాహుకుడు' అనే పేరుతో ఋతుపర్ణుని కొలువులో వంటలవాడుగా, అశ్వాధ్యక్షుడుగా కుదురుకొన్నాడు. అతడు (దమయంతిని తలచుకొని) విరహ వేదన పడుతుంటే అతనికి సహాయులుగా ఉన్న జీవలుడు, వార్ష్ణేయుడు నవ్వుకునే వారు.

ఋతుపర్ణుడు ఇక్ష్వాకు వంశంలోని రాజు. భగీరథునికి ఐదు తరాల తర్వాతివాడు. ఆ వంశంలో ఋతుపర్ణునికి, సర్వకామ్యుడు - అతనికి సుదాసు (భార్య మదయంతి) - వారికి

పది తరాలకు శ్రీరాముడు కలిగారని మత్స్య పురాణం చెబుతోంది.

నలదమయంతులు అరణ్యాల పాలయిన సంగతి తెలిసి వారిని వెదకటానికి దమయంతి తండ్రి బ్రాహ్మణులను అన్ని దిక్కులకూ పంపాడు. నలదయంతుల జాడ తెలిపిన వారికి వేయి గద్యాణాలు (నాణేలు), వారిని తీసుకుని వచ్చిన వారికి వెయ్యి ఆవులూ, అగ్రహారాలూ ఇస్తానన్నాడు.

రాజులు సాధారణంగా ఇలాంటి పనులకు చారులను పంపుతారు. కాని ఇక్కడ విద్వాంసులైన బ్రాహ్మణులనే పంపటం జరిగింది.

సుదేవుడనే బ్రాహ్మణుడు చేది దేశంలో సుబాహుని అంతఃపురంలో దమయంతిని చూసి ఆమె కనుబొమల మధ్య ఉన్న సూక్ష్మ లక్షణాన్ని పరిశీలించి ఆమె దమయంతి అని నిర్ధారించుకున్నాడు. ఆవిడ పతిని ఎడబాసి కళా విహీనంగా ఉన్నా పతివ్రతా గుణం చేత లక్షణంగా ఉన్నదట. (అరణ్య. 2-141) స్త్రీలకు పతిభక్తియే పరమ భూషణము, ఇతర భూషణాలు (నగలు) ఎన్నైనా దీని సాటి రావు (అరణ్య. 2-142) అంటూ పతివ్రతా ధర్మాలు ఇక్కడ చాలా చెప్పారు.

దమయంతి సుదేవుని వెంట తండ్రి నగరానికి చేరుకున్నది. నలుణ్ణి వెదకటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. పిల్లనిచ్చిన తండ్రికి కష్టాలు ఆ కాలం నుంచీ ఉన్నాయి.

నలుణ్ని వెదకటానికి బ్రాహ్మణులకు దమయంతి స్వయంగా ఎన్నో ఉపాయాలు చెప్పుండేది. - నిత్యసత్యుడవైన నీవు భార్యను వంచించి ఆమె బట్ట సగం కట్టుకొని అడవిలో విడిచి రావటం న్యాయమా, ఆ సాధ్వికి నీవు ప్రసన్నుడవు కావాలి. భర్త భార్యను భరించాలి అనే ధర్మం నీ పట్ల మిథ్య అయింది - అనే అర్థం వచ్చే పలుకులు సభలలో పలుకుతూ, దానికి ఎవరు స్పందిస్తే వారిని నలునిగా అనుమానించవచ్చునని చెప్పింది.

ఋతుపర్ణుని నగరంలో బాహుకుడు ఆ మాటలకు స్పందించి ఈ సమాధానం చెప్పాడు.

"పురుషునిలో దోషాలు ఎన్ని ఉన్నా భార్య భరిస్తూ ఉండాలి.

అలాంటి భార్యకు కోరిన కోరికలు తీరతాయి. మరో జన్మలో కూడా ధర్మాసక్తి కలిగి ఉంటుంది (భార. అరణ్య. 2-159)" అన్నాడు.

ఈ సమాచారం తెలుసుకున్న దమయంతి అతనిని నలునిగా సందేహించింది. అతనిని గుర్తించేందుకు మరో ఏర్పాటు చేసింది. అదే స్వయంవర ప్రకటన.

దమయంతికి రేపే స్వయంవరం అని ఋతుపర్ణునికి ఆ ముందు రోజు సమాచారం అందేలాగ చేసి అతి తక్కువ కాలంలో అతడు నగరానికి రావలసి వచ్చే విధంగా చేశారు.

బాహుకుని అశ్వ (హృదయ) విద్యా కౌశలం గురించి తెలిసిన ఋతు పర్ణుడు అతన్ని సారథిగా పెట్టుకుని దమయంతి స్వయంవరానికి బయలు దేరాడు.

మార్గ మధ్యంలో నలుడు ఋతుపర్ణుని నుంచి అక్ష హృదయ మనే విద్యను నేర్చుకుని తనకు తెలిసిన అశ్వ విద్యను అతనికి నేర్పాడు.

నలుని రథ ఘోషను దమయంతి గుర్తించింది. కేశిని అనే పరిచారిక నలుని కుమారునీ కుమార్తెనూ బాహుకుని దగ్గరకు తీసుకువెళ్ళి అతనితో మాట్లాడి, అతనిని గమనించి అతడు నలుడే అని నిర్ధారించుకున్నది. దమయంతి తండ్రి అనుమతితో బాహుకుని పిలిపించుకుని నలుని నిర్దయనుగురించి ప్రస్తావించింది.

"నిర్జనారణ్యంలో అలసి నిద్రిస్తున్న దానిని, అబలను, అతిసాధ్విని, అనువ్రతను, అగ్నిసాక్షిగా వివాహమైన భార్యను ఇలా నిర్దయగా వదిలి వెళ్ళిన వారు మరెవరూ లేరు. దేవతలను కాదని తనను వరించిన నన్ను, పుత్రవతిని నలుడు ఎలా వదిలివెళ్ళాడో" అని దమయంతి అన్నది.

"అనురక్తుడనూ అనువ్రతుడనూ అయిన నన్ను తలంచకుండా రెండోసారి స్వయం వరానికి సిద్ధపడటం కులస్త్రీ ధర్మం కాదు" అన్నాడు నలుడు.

'ఇదంతా నిన్ను వెదికేందుకే చేశామ'ని దమయంతి వివరించి చెప్పింది.

"నేను నిన్నుతప్ప అన్యులను తలచనే లేను. నీపాదాల మీద ఒట్టు, నేను అన్యభావం కలదాన్నయితే నన్ను సూర్యచంద్రులూ - అగ్నీ - దేవతలూ ఈ క్షణమే చంపుతారు" అని ప్రతిజ్ఞ చేసింది. (అరణ్య. 2-214)

ఆకాశం నుండి వాయుదేవుడు కూడా దమయంతి పాతివ్రత్యం గురించి సాక్ష్యం చెప్పాడు.

"రాజా! పవిత్రురాలైన దమయంతి గురించి నీవు ఇలా అనటం తగదు. ఈమె పతివ్రత. సూర్యచంద్రులూ నేనూ ఈమె శీలవిధిని మూడు సంవత్సరాల నుంచి చూస్తున్నాం. ఈమె నీపై అనురక్త. ఈమెను గ్రహించు" అన్నాడు.

దేవతలు పూలవర్షం కురిపించారు - మంగళ వాద్యాలు వినిపించాయి. అందరికీ ఆశ్చర్యం కలిగేటట్టు వాయుదేవుడు దమయంతి పతివ్రతాగుణాలనూ భర్తపై అకృత్రిమ అనురాగాన్నీ చెప్పగానే నలుడు ఆనందించి కర్కోటకుని తలచుకున్నాడు. అతడు పంపిన బట్ట ధరించి నిజరూపం పొందాడు. ఇంతతో కథ ముగియలేదు.

విదర్భలో ఒక నెల ఉన్న తర్వాత, దమయంతిని విదర్భలోనే ఉంచి ఒక రథమూ 16 ఏనుగులూ 50 గుర్రాలూ 600 కాల్బలమూ తోడు తీసుకుని నలుడు నిషధ పురానికి వెళ్ళాడు. పుష్కరుణ్ణి జూదానికి పిలిచాడు.

"నేను దమయంతిని రోయిగా (పందెం) పెడతాను. నీవు రాజ్యం రోయిగా పెట్టు.



సుందరయ్య గ్రంథాలయ భవన
A.C. No. 81080

జూదం ఆడదాం. కాదంటావా, నాతో యుద్ధం చెయ్యి. నీవూ నేనూ రథాలెక్కి పోరాడదాం. రాజ్యం వీర భోజ్యం' అన్నాడు. (అరణ్య. 2-221, 222)

పుష్కరుడు అంతకు ముందు జూదంలో గెలిచిన వాడు కాబట్టి యుద్ధం కంటె జూదమే మేలు అని భావించి జూదానికే సిద్ధ పడ్డాడు. ఈ సారి జూదంలో పుష్కరుడు గెలిచి దమయంతిని కూడా దక్కించుకోవచ్చుననుకున్నాడు. కాని ఓడిపోయాడు. నలుడు సమస్త రాజ్యమూ పొందాడు. దమయంతి కూడా అతన్ని చేరుకున్నది.

మహాభారతం కథలో జూదంలో ఓడిపోయిన ధర్మరాజును ఓదారుస్తూ 'బృహదశ్వుడు' చెప్పిన కథ ఇది. ఆ తర్వాత బృహదశ్వుడు ధర్మరాజుకు 'అక్షహృదయం' విద్య ఉపదేశించాడు.

నలదమయంతుల కథ చాలా ప్రసిద్ధి పొందిన కథ. వారి పూర్వ జన్మలను వివరించే కథలు కూడా కొన్ని పురాణాలలో చేరాయి.

శివపురాణం ప్రకారం నలదమయంతులు పూర్వజన్మలో కిరాత దంపతులు. వారికి దూతగా ఉండిన హంస ఆ జన్మలో ఒక యతి. శతరుద్ర సంహితలో యతినాధ హంసావతార వర్ణన మనే 28వ అధ్యాయంలో ఈ కథ ఉంది. పాతివ్రత్యాన్ని ప్రచారం చేసే లక్ష్యంతో స్త్రీలను తమ అదుపాజ్ఞలలో ఉంచుకోవటానికి పురుషాధిక్యతను నిలుపుకోవటానికీ ఈ కథలు ఉద్దేశించారు. వినే వారికీ చూసే వారికీ మనసులు ద్రవించేటట్టుగా ఇలాంటి కథలు రసరంజకంగా అల్లటం మన పురాణకర్తలకే సాధ్యం.

నలుని పరంగా చూస్తే ఈ కథ మానవ సహజమైన బలహీనతలను అధిగమించవచ్చుననే తెలివినీ, ధైర్యాన్నీ ఇస్తోంది. దమయంతి పరంగా బోలెడంత పరాధీనతనూ బానిసత్వాన్నీ పంచుతోంది.

స్త్రీలు పాతివ్రత్య ధర్మాన్ని నిలుపుకుంటే సత్సంతానానికి జన్మ నివ్వ గలుగుతారనీ స్త్రీల పాతివ్రత్యం మీదనే సంఘంలోని శాంతి భద్రతలు ఆధారపడి ఉన్నాయనీ భావి సమాజం క్రమ పద్ధతిలో ఉంటుందనీ ప్రచారం ఇప్పటికీ జరుగుతోంది. పూర్వమూ ఇలాగే నమ్మించి స్త్రీలను అందుకు అనుగుణంగా కండిషన్ చేశారు. ఈ క్రమంలో స్త్రీలకు విధి నిషేధాలు అమలులోనికి వచ్చాయి. అయితే పురాణాలు పరిశీలించి చూస్తే పురుషుల పరంగా కట్టుబాట్లు లేకపోవటమూ స్త్రీ పురుష సంబంధాలు కూడా అంత జటిలంగా లేకపోవటమూ గమనించవచ్చు. భిన్నకులాల వారూ జాతుల వారూ వివాహ, వివాహేతర సంబంధాలు ఏర్పరచుకుని సంతానం పొందిన దాఖలాలున్నాయి.

ధర్మ శాస్త్రాలు అలాంటి వాటిని అష్ట విధ వివాహాలలో చేర్చుకొని అంగీకార ముద్ర వేశాయి. ఆ అనుభవాలవల్లనే వివాహ నియమాలను ముందు ముందు ఒక క్రమ పద్ధతిలో

ఉంచటానికి ఈ విధంగా ప్రయత్నించారు. కుల వధువులుగా రాబోయే స్త్రీలు ఉత్తమ గుణాలతో పెరిగేటట్లు సమాజపరంగా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

కులస్త్రీలు చెడిపోవటం - వర్ణ సంకరం ఏర్పడటం - సంఘం శాంతి విహీనం అవటం అనే ఉత్పాతాలు భూతద్దంలో చూపించి స్త్రీలకు మాత్రమే కట్టుబాట్లు అమలు పరచి వారిని అణచి వేసి అజ్ఞానంలో ఉంచే ఏర్పాట్లు ఇవి.

కాలక్రమంలో ఈ కథలలో పతివ్రతా నియమాలు మరింత విస్తరంగా ఎప్పటికప్పుడు చేరుస్తూ వచ్చారు. షట్చక్రవర్తుల భార్యలలో చంద్రమతినీ దమయంతినీ స్త్రీలకు ఆదర్శ పాత్రలుగా రూపొందించారు, ప్రచారమూ చేశారు.

## కార్తవీర్యార్జునుడు

హైహయ వంశపురాజు. యదువు కొడుకైన సహస్రజిత్తు వంశంలోని కృతవీర్యుని కొడుకు. అసలు పేరు అర్జునుడు. భారత అర్జునుని నుంచి వేరుపరచి గుర్తించటానికి వీలుగా ఇతనిని కార్తవీర్య అర్జునుడని పేర్కొంటారు.

జమదగ్ని హోమధేనువు కారణంగా చెలరేగిన వివాదం జాతుల యుద్ధానికి దారితీయటం ఇక్కడ ప్రధానాంశం. ఇది బ్రాహ్మణుల ప్రాముఖ్యాన్ని తెలిపే ఇతివృత్తంతో ఉంది.

నర్మదాతీరంలోని మహిష్మతీపురం కార్తవీర్యుని రాజధాని. ఇది వింధ్య, ఋక్ష పర్వతాల నడుమగా జబల్‌పూరుకు దిగువగా ఉండేది. ఇతని పురోహితుడు గర్గుడు. బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల మధ్య ఉన్న వైషమ్యాలు, పోరాటాలు ఇతని గురించిన గాథలలో తెలుస్తున్నాయి. కథాకాలం త్రేతా ద్వాపర యుగాల సంధికాలం. (భారతం. ఆది. 1-78). హైహయులకు యవన, పారద, కాంభోజ పాహ్లవ, బాహుకులనే అయిదు రాక్షస గణాలు మిత్రులట.

కార్తవీర్యుడు ఉత్తమ గుణాలు కలిగిన రాజు. ఈయన మొదట తనకు రాజ్యం వద్దన్నాడట. రాజ్య పరిపాలనలో ఎన్నో పాపాలు చేయవలసి వస్తుందనీ అందుకు గాను నరకానికి పోవలసి వస్తుందనీ వెనకాడాడు - తపస్సు చేసి యోగినై, భూమిని పాలించే సామర్థ్యం గల ఏకైక చక్రవర్తినై భూమి మీద ఏకైక అస్త్ర ధారినై, ఐశ్వర్య వంతుడనై, ఉంటే అప్పుడు భవిష్యత్తులో పాపాలు చేయకుండా ఉంటాను - అని ఆలోచించాడు. అలాగయితే అందుకోసం దత్తాత్రేయుని సేవించవలసిందని గర్గుడు సలహా ఇచ్చాడు.

ఆ విధంగా కార్తవీర్యుడు దత్తాత్రేయుని కొలుస్తూ పదివేల సంవత్సరాలు తపస్సు చేసి ఎన్నో కఠిన పరీక్షలు ఎదుర్కొని ఆయన అనుగ్రహం పొందాడు. ఆయన పొందిన వరాలు 1. ఉత్తమమైన బుద్ధి 2. ప్రజా పాలనలో అధర్మం కలగకుండా ఉండటం 3. పరానుస్మరణ

జ్ఞానం 4. యుద్ధంలో ఎదురు లేక పోవటం 5. వెయ్యి చేతులు, 6. లఘుతాగుణం (కావాలనుకున్నప్పుడు తేలిక అయ్యేగుణం) 7. పర్వతాలపై నేలపై ఆకాశంలో జలంలో ఎక్కడైనా సరే అంటకుండా ప్రయాణించే గుణం. 8. తన కంటె అధికుని వల్లనే మరణం. 9. ధర్మ మార్గంలో మార్గ నిర్దేశకులు లభించటం. 10. పూజ్యులైన అతిథులు తన కోసం వస్తూండటం 11. సంపద అక్షయంగా ఉండటం. 12. తన రాజ్యంలో తనను తలచుకొనే వారి ధనం పోకుండా ఉండటం. 13. దత్తాత్రేయుని పట్ల అచంచలమైన భక్తి. ఇవన్నీ దత్తాత్రేయుడు కార్తవీర్యునికి అనుగ్రహించాడు. అప్పుడు కార్తవీర్యుడు పట్టాభిషేకం చేసుకున్నాడు. ఏడు దీవులు పాలించాడు.

ఇతడు పొందిన వరాలలో చాలా అంశాలు నాథ సంప్రదాయాలు. ఉత్తర భారత దేశంలో ప్రసిద్ధంగా ఉన్న నాథ సంప్రదాయపు గురువు దత్తాత్రేయుడు.

కార్తవీర్యుడు రాజు అయ్యాకతాను తప్ప ఇంకెవరూ ఆయుధం ధరించకూడదన్నాడు. ఏ రోజు కలిగిన సంపదతో ఆ రోజు దత్తాత్రేయ యాగం చేసే వాడు, అని మార్కండేయ పురాణం నుండి తెలుస్తున్నది. వాయు పురాణం ప్రకారం ఇతడు 85,000 సంవత్సరాలు ధర్మంగా పరిపాలనచేశాడు. 10 వేల వరకు క్రతువులు చేశాడు.

*దుర్జయ విక్రమోజ్జ్వలుడు దోషవివర్జిత బుద్ధి కార్తవీ*
*ర్యార్జును డేడుదీవులు నయాన్విత శూరత నేలుచుండు ధ*
*ర్మార్జనలోల బుద్ధియు మహాస్త్ర బలంబు సహస్రబాహుతా*
*స్ఫూర్జనమున్ వెలుంగగ నృపుల్ దన యాజ్ఞ దలన్ వహింపగన్* (భార. శాంతి. 2-74)

నీతి, ధర్మం, శౌర్యం కలబోసిన వీరుడు కార్త వీర్యుడు అని మహాభారతం కీర్తించింది. ఇంతటిరాజూ బ్రాహ్మణులపట్ల అపచారం చేసి కష్టాలు పడ్డాడు.

ఒకసారి అగ్ని తనకు ఆహారం కావాలని కార్తవీర్యుని అడిగాడు. గిరినగర అరణ్యమంతా ఆహారంగా ఇచ్చాడు రాజు. ఆ అరణ్యంలో మైత్రా వరుణుని కొడుకు ఆశ్రమం ఉన్నది. అరణ్యంలో ఉన్న వారి కందరికీ ఖాళీ చేయవలసిందిగా నోటీసు ఇచ్చి ఉండాల్సింది. అలా చేయకుండా అగ్ని మైత్రావరుణుని ఆశ్రమం కూడా దహించివేశాడు. మైత్రా వరుణుడు కోపగించి కార్తవీర్యుని శపించాడు. దహించినది అగ్ని అయినా ఆశ్రమం రక్షించవలసిన బాధ్యత రాజుది కాబట్టి వేటు రాజుపై పడింది.

అగ్ని దేవుడు గిరినగర అరణ్యం దహించి నపుడు మైత్రా వరుణుడు ఆ ఆశ్రమంలో లేడు. ఆయన నీళ్ళలో వ్రతం చేసుకుంటున్నాడు. అది పదివేల సంవత్సరాల వ్రతం. అది ముగించి పైకి వచ్చే సరికి ఆశ్రమం లేదు. అప్పుడు ఆయన రాజును శపించాడు. "పరశురాముడు కార్తవీర్యుని బాహువులు ఖండిస్తాడు" అనేది శాపం. ఆ శాపం సంగతి

తెలిసి కార్తవీర్యుడు జాగ్రత్తగానే ఉన్నాడు. కార్త వీర్యుని కొడుకులు బలగర్వంతో జమదగ్ని కామధేనువును ఎత్తుకు రావటం వల్ల కార్తవీర్యుడు పరశురాముని కోపానికి బలి కావలసి వచ్చింది.

కార్తవీర్యుని బలపరాక్రమాలు విని ఒకప్పుడు రావణుడు అతనిపైకి యుద్ధానికి వచ్చాడట. కార్తవీర్యుడు కనబడకపోతే నర్మదా నది ఒడ్డున కూచుని శివపూజ చేసుకుంటున్నాడు. కార్తవీర్యుడు నర్మదా నదిలో జలక్రీడ లాడుతున్నాడు. అతనిచేతులు జల ప్రవాహాన్ని అడ్డగించటంతో నీరు పైకి ఎగజిమ్మి ఒడ్డున పెట్టుకున్న రావణుని పూజా ద్రవ్యాలు కొట్టుకుపోయాయి. రావణుడు కోపంగా కార్తవీర్యుని మీదికి వెళ్ళాడు. కార్తవీర్యుడు రావణున్ని పట్టుకుని జైలులో పడేశాడు. రావణుని తాత పులస్త్యుడు విషయం తెలుసుకుని వచ్చి అతనిని విడిపించుకు వెళ్ళాడు.

## పవన కార్తవీర్యార్జున సంవాదం

ఏడు దీవులూ పాలించిన సహస్ర బాహార్జునుడు అద్భుత బల పరాక్రమాలతో అలరారుతూ తన వంటి వారెవరూ లేరని ఒకసారి గర్వించిపలికాడట. అతడు అలా అంటూ ఉంటే విని ఒక భూతం ఆకాశాన్నుంచి "అందరికంటె అధికులు ధరామరులు - నీకు ఆ విషయం తెలియక మాట్లాడుతున్నావు' అన్నది - వారు రాజును ఆశ్రయించి జీవిస్తూ ఉంటారు. వారెలా ఎక్కువ? నాకు కోపం వస్తే అన్ని భూతాలనూ చంపుతాను' - అని రాజు కోపంగా అనే సరికి ఆ భూతం భయపడి వెళ్ళిపోయింది. ఇదంతా గమనిస్తున్న వాయు దేవుడు రాజుకు తనను పరిచయం చేసుకొని బ్రాహ్మణుల మహిమ గురించి చెప్పాడు. ఈ ఉదంతం 'పవన కార్తవీర్యార్జున సంవాదం'గా ప్రసిద్ధమైందని భీష్ముడు ధర్మరాజుకు ధర్మాలన్నీ చెప్పే సందర్భంలో చెప్పాడు - (భార. అనుశాసనిక. 5-338-355) వాయువు కార్తవీర్యునికి బ్రాహ్మణుల మహిమల గురించి చాలా కథలు చెప్పాడు.

ఉత్రచథ్యుడు, అగస్త్యుడు, వసిష్ఠుడు, అత్రి, చ్యవనుడు మొ॥ వారి గొప్పతనాలన్నీ చెప్పి 'దత్తాత్రేయునికి భక్తితో శుశ్రూష చేసి గదా నీవు విశిష్ట బల పరాక్రమాలు పొందావు. బ్రాహ్మణుల దయతోటే అందరూ ఈ విధంగా సుఖంగా ఉన్నారు' అని చెప్పి ఒప్పించాడు. 'విప్రకులము దైవ స్వరూపము' అని అప్పుడు వాయువు చేసిన బోధ ప్రజల మనస్సులలోంచి తొలగిపోకుండా ఇప్పటికీ ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి.

ఒకనాడు కార్తవీర్యుని కొడుకులు జమదగ్ని ఆశ్రమానికి వెళ్ళారు. జమదగ్ని మహర్షి రాజ పుత్రులందరికీ తన హోమధేనువు సహాయంతో చక్కని ఆతిథ్యం ఇచ్చాడు.

ఆ ధేనువు మాహాత్మ్యానికి ఆశ్చర్యపడి రాజపుత్రులు ఆ ఆవును దూడతో సహా తమ రాజ్యానికి తెచ్చేసుకున్నారు. ఇది అపహరణ అనే నేరం కిందికే వస్తుంది. ఈ విషయం

కార్తవీర్యునికి తెలీదని కొన్ని చోట్లా, కార్తవీర్యుడే స్వయంగా ఆ ఆవును ఎత్తుకువచ్చాడని కొన్ని చోట్లా (భార. అరణ్య 3-146) రాశారు. ఈ విషయం జమదగ్ని కొడుకైన పరశురామునికి తెలిసి కార్తవీర్యునిపైకి యుద్ధానికి వచ్చి అతని వెయ్యి చేతులూ నరికి చంపాడని కథ.

మునుల పట్ల అపచారం జరిగితే ఇలాంటి శిక్షలు పడతాయి సుమా అని సమాజాన్ని హెచ్చరించటం ఈ కథ లక్ష్యం.

కార్తవీర్యుని మరణానంతరం కార్తవీర్యుని కొడుకులు వెళ్ళి జమదగ్నిని చంపారు. అది తెలిసి పరశురాముడు దేశంలో క్షత్రియులు లేకుండా చేస్తానని ప్రతిజ్ఞ చేసి ఇరవై యొక్క సార్లు వారిని వెదికి వెదికి చంపాడు. వారి రక్తాన్ని అయిదు మడుగులుగా చేసి అందులో పితృ తర్పణాలు చేశాడట. శమంత పంచకం అని వాటికి పేరు. ఆ సమయంలో పరశురాముని నుంచి తప్పించుకున్న క్షత్రియులు చెదురు మదురుగా మిగిలారు. కార్తవీర్యుని కొడుకులలో అయిదుగురు మాత్రం తప్పించుకోగలిగారట. క్రీ.శ. 845-1212 ప్రాంతాలలోని కాలచుర్య రాజులు కార్తవీర్యుని సంతతి వారమని చెప్పుకున్నారట. వీరి రాజధాని త్రిపుర (జబల్‌పూర్‌కు సమీపంలోనిది).

రాజులందర్నీ చంపాక పరశురాముడు అశ్వమేధ యాగం చేశాడు. దక్షిణగా భూమి అంతా కశ్యపునికి దానమిచ్చాడు.

'ఈ భూమి మీద నీకు ఇక అధికారం లేదు. దక్షిణ సముద్రం వైపు ఎటైనా వెళ్ళిపో' అని కశ్యపుడు పరశురాముణ్ణి పంపేశాడు. భూమి మీద క్షత్రియులెవరైనా మిగిలితే వారిని రక్షించటానికే కశ్యపుడు పరశురాముణ్ణి అక్కడి నుంచి పంపేశాడని కొందరి అభిప్రాయం.

దక్షిణం వైపు సముద్రం కొంత తొలగి వెనక్కి వెళ్ళి పరశురామునికి చోటు కల్పించిందట.

పరశురాముడు మహేంద్ర పర్వతం మీద తపస్సుకు వెళ్ళి పోయాడు. (భార. అరణ్య. 3-130-155).

బ్రాహ్మణులకు జరిగిన అపచారానికి బ్రాహ్మణ సమాజం క్షత్రియుల పట్ల పగ తీర్చుకోవటం ఈ కథలో ప్రతీకాత్మకంగా చెప్పారు.

కొంత కాలానికి వైశ్య శూద్ర ప్రముఖులు దర్పంతో అగ్రకులాలను ఎదిరించి బ్రాహ్మణుల ధనధాన్యాలు దొంగిలించడం మొదలు పెట్టారట. అధర్మం ప్రబలి పోయిందట. అప్పుడు ధర్మం నిలబెట్టటం కోసం వర్ణ ధర్మ పరిరక్షణకు క్షత్రియులను నియమించటం జరిగింది. (శాంతి. 2-84-90)

ఉత్తమ క్షత్రియులు దండనీతి ప్రయోగించి ధర్మ రక్షణ చేసి తనను సురక్షితంగా ఉంచాలని భూదేవి కశ్యపుని కోరింది. పరశురాముని చేతిలో చావు తప్పించుకున్న క్షత్రియ

కులాల వారసులను కూడా భూదేవి గుర్తించి చెప్పగా కశ్యపుడు వారిని ధర్మ రక్షణకు గాను నియమించాడు. ఈ విధంగా భూమి అంతా బ్రాహ్మణులదే అనీ క్షత్రియులు దానిని రక్షించే వారనీ సిద్ధాంతీకరించారు.

షట్చక్రవర్తులలో ఒకడైన కార్తవీర్యుని కథ తెలియజేస్తున్న అంశాలు ఇవి.

1. బ్రాహ్మణులకు ఎక్కడా ఏవిధంగానూ అపచారం జరగకూడదు. అపచారం జరిగితే దానికి రాజే బాధ్యుడు. ఫలితం అతను అనుభవించి తీరవలసిందే.
2. భూమి అంతా బ్రాహ్మణులది. రాజు దండనీతితో వర్ణధర్మ పరిరక్షణ చేస్తూ దానిని కాపాడాలి.

✦ ✦ ✦

వైదిక ధర్మం ప్రాతిపదికగా షోడశరాజుల కథలూ షట్చక్రవర్తుల కథలూ ప్రతి పాదించి అమలు జరిపిన వ్యవస్థ క్రమంలో పాలకులు అందరూ...

- దేవబ్రాహ్మణ ప్రీతికై యజ్ఞాలు చేశారు. వారికి యజ్ఞ భాగాలు ఘనంగా ముట్టచెప్పారు.
- అసురులను నిర్మూలించటంలో దేవగణాలకు సహకరించారు.
- బ్రాహ్మణాధిక్యతను అంగీకరించారు.
- భూమి బ్రాహ్మణులది. రాజు దానిని రక్షించే వాడు మాత్రమే - అని అంగీకరించారు.
- వర్ణధర్మం అమలు చేశారు.
- శూద్రులకు విద్య పనికి రాదన్నారు.
- నిమ్న జాతులను దూరంగా ఉంచాలి, వర్ణ సంకరం కూడదు అన్నారు.
- స్త్రీలను కట్టుబాట్లలో ఉంచాలన్నారు.
- భర్త జూదగాడై తనను పందెంలో ఒడ్డినా, అప్పు తీర్చటానికి తాకట్టు పెట్టినా/అమ్మినా/ భార్య భరించాలన్నారు. ఇవన్నీ తరువాతి వారికి ఆదర్శాలుగా చెప్పారు.

సాటి వారిని మానవతాదృక్పథంతో చూడటం అనే ఆలోచనే ఈ వ్యవస్థలో లేదు.

ఇంత అసమానతనూ ఆత్మ న్యూనతనూ హైన్యాన్నీ స్త్రీలూ శూద్రకులాలూ శతాబ్దాలుగా భరిస్తూనే వచ్చారు. వర్ణధర్మాన్ని ఇంత పటిష్ఠంగా చెబుతున్న షోడశరాజుల షట్చక్రవర్తులపేర్లు మనకు పురాణాలలోనేగాని చరిత్రలో కనబడవు. ఈ కథలన్నీ సమాజ నియంత్రణ కోసమే కాబట్టి సాహిత్యంలో బాగా చోటు చేసుకున్నాయి. జానపద వాఙ్మయంలోనూ బాగా ప్రచారమయ్యాయి.

సంప్రదాయం ప్రచారం చేసిన ఈ వర్ణధర్మ వ్యవస్థ చరిత్రకు అందని కాలాల నుంచీ భారత దేశ సమాజంలో నెలకొని ఉండి పోయింది.

సంప్రదాయం పేరిట - సంస్కృతి పేరిట - కర్మ సిద్ధాంతం పేరిట సమాజపు ఈ హింస చెల్లిపోతూ వచ్చింది. ఎప్పటి కప్పుడు నిరసనలు వ్యక్తమౌతూనే వచ్చాయి. పీడిత ప్రజలు ప్రశ్నిస్తూనే వచ్చారు.

వైదికేతర ధర్మాలు కూడా ఈ అసమానతలను సరి చేయాలని ప్రయత్నించాయి. ఆ వర్గాలకు కనీస మానవ హక్కులను లభింప జేయటానికి కృషి చేశాయి. ఇవి ఘర్షణలు మరింత పెంచాయే గాని ఫలితం శూన్యం.

హేతువాద దృష్టితో సాహిత్యాన్నీ చరిత్రనూ గమనించటం మొదలయిన నాటి నుంచీ పురాణాలలోని అభూత కల్పనలూ అసంగతాలూ పరస్పర వైరుధ్యాలూ బయట పడుతూ వచ్చాయి. యోగులూ, చింతనా పరులూ కింది వర్గాలకూ దళితులకూ మానసికంగా ఊరటను ఇవ్వగలిగారే గాని ప్రాపంచిక అవసరాలు తీర్చలేక పోయారు.

పురోహిత వర్గం విధించిన షరతులకు లోబడి సాగిన పాలనలో రాజ్యంలోని ద్విజేతర వర్గాలన్నీ ఎంత దుర్భరమైన స్థితిలో బతికాయో ఊహకు అందదు. అసమానతలతో వివక్షలతో కూడిన ద్విజ సంస్కృతిని పెంచి పోషిస్తూ అదే గొప్ప సంస్కృతిగా ప్రచారం చేశారు. ఈ సంస్కృతి తయారు చేసిన వర్గాలు రెండు: ఒకటి విశ్రాంతిగా గడిపే వర్గం (సోమరులు). రెండు శ్రమపడే వర్గం (శ్రామికులు). స్త్రీలను పురుషాధిక్య సమాజపు దయా దాక్షిణ్యాలపై బతికే స్థాయికి దించివేశారు. వారికి మానవతా విలువలు హక్కులు లేకుండా చేశారు.

తత్వ చింతనకు పేరుపొందిన భారత దేశ ప్రాచీన వైభవం ఈ వర్ణ సమాజపు కుహనా సంస్కృతితో అధోగతి పాలైంది. ఇందుకు కారణాలు ఆలోచించవలసిందే.

నేరమూ ఋజువులూ సంఘటనా స్థలంలోనే లభించే విధంగా ప్రాచీన చరిత్ర నుండీ సారస్వతం నుండీ ఈ వివరాలు రాబట్టాలి. ఇటీవలి కాలం వరకూ.

భారత దేశంలో ఆంగ్లేయుల పాలన ఆరంభం కాకముందు వరకు బ్రాహ్మణ పోషణ చాలా వైభవంగా సాగింది. ఏ మాత్రం చదువూ సంధ్యాలేని వారు కూడా కష్టపడకుండా కులంపేరిట గౌరవంగా, తిండికీ బట్టకూ లోటు లేకుండా గడపగలిగేవారు.

కుటుంబాలతో పాటు రాజ సత్రాలలోనే కాపురం ఉంటూ వచ్చేవారు.

పూనాలో 'దక్షిణ నిధి' గురించి జోతిరావ్ పూలే చరిత్ర తెలిసిన వారికి తెలిసే ఉంటుంది.

శివాజీ మహారాజు పట్టాభిషిక్తుడైనప్పుడు ప్రతి శ్రావణ మాసంలోనూ బ్రాహ్మణులకు దక్షిణలిచ్చే ఏర్పాటు చేశాడు. (బ్రాహ్మణ వర్గం శివాజీ పట్టాభిషేకాన్ని మొదట వ్యతిరేకించి తర్వాత అంగీకరించటానికి కారణం ఇదన్నమాట).

ఈ 'దక్షిణ' ఇవ్వటం ఒక సంప్రదాయంగా స్థిరపడిపోయింది. రెండో బాజీరావు కాలం నాటికి సాలగ్రామాలకు కూడా దక్షిణలిచ్చేవారు. అందువల్ల (నకిలీ) సాల గ్రామాల కోసం బ్రాహ్మణ జనం ఎగబడేవారు. పీష్వా గారి పశువుల కొట్టంలో ఒంటెల లద్దె ఎండబెట్టి సాలగ్రామాల రూపంలో తయారు చేసేవారు. వాటిని బ్రాహ్మణులు పళ్ళెంలో పూజాద్రవ్యాలతో పాటు అమర్చుకుని బాజీరావును దర్శించే వారు. అయన వాటికి నమస్కరించి ఘనంగా దక్షిణ లిచ్చేవాడు. ఒక ఏడాది ఇందుకు 10 కోట్ల రూపాయల వరకూ ఖర్చయిందట. ఈ దక్షిణ కోసం చాలా పెద్ద మొత్తమే కేటాయించేవారు. బ్రిటిష్ పాలనలోనూ ఇది కొనసాగింది. దీనిలోంచే కొంత మొత్తాన్ని హిందూ కళాశాల (పూనే)కు వినియోగించారు. ఈ కళాశాల బ్రాహ్మణ వర్గానికే పరిమితంగా ఉండేది. ఈ దక్షిణ నిధిలోంచి కొంత దేశ భాషా సాహిత్యాల అభివృద్ధికి (మరాఠీ మొ॥ వాటికి) వాడాలని జోతిరావ్ పూలే ఒక ఉద్యమమే నడిపారు (1849 ప్రాంతం).

ఈ 'దక్షిణ' అందుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీరంగం, కుంభకోణం, కాశీ, కానోజ్ మొ॥ ప్రాంతాల నుంచి బ్రాహ్మణులు తరలి వచ్చేవారట.

దక్షిణాన తంజావూరును పాలించిన నాయక రాజుల, మహారాష్ట్ర రాజుల పాలనా కాలం నాటి వాఙ్మయాన్ని పరిశీలిస్తే అప్పటి అన్న సత్రాలలో వేల కొద్దీ బ్రాహ్మణ కుటుంబాలు కాపురాలు ఉంటూ సత్రం భోజనం మఠం నిద్ర తంతుగా ఉండేవని తెలుస్తుంది. వీటి గురించి పురుషోత్తమ దీక్షితుడు అనే కవి 'తంజాపురాన్న దాన మహానాటకము' రాశాడు. ఒక విప్రుడు తెల్లవారి లేచి స్నానం చేయకుండా సిగమాత్రం తడుపుకొని భోజనానికి కూచోవడం - అది గమనించి కూడా వంటవారు, తమ ప్రభువులు బ్రాహ్మణ్య ప్రభువులు కాబట్టి ఎంత మాత్రపు వాడైనా తంజావూరులో ఉపవాసం ఉండరాదని సర్ది చెప్పుకొని అతనికి భోజనం వడ్డించటం వంటి విషయాలు అందులో ఉన్నాయి. భోజనంపెట్టి ఒక రూక దక్షిణగా ఇచ్చేవారట. అక్కడ జరిగే భోగంసానుల నాట్యం చూసి వాళ్ళకి ఈ బ్రాహ్మణులు తమకు రాజుగారిచ్చిన దక్షిణ ధనంలోంచి బహుమతులు ఇవ్వటం వంటి అంశాలు కూడా ఈ యక్షగాన నాటకం నుంచి తెలుస్తున్నాయి.

జనాభాలో అధిక శాతం ద్విజేతరులు కష్టపడి పనిచేసి కూడా కడుపునిండా తిండి లేక దరిద్రం అనుభవిస్తున్న పరిస్థితుల్లో ద్విజ కులాలవారు మిథ్యా గౌరవంతో సంపదలు అనుభవించారు. బ్రిటిష్ వారి పాలనలోనూ ఆ తరవాతా కూడా ఈ వ్యవస్థ ఇలాగే సాగుతున్నది. దీనంతటికీ కారణం వర్ణధర్మ వ్యవస్థ.

మనువు నుంచి వచ్చిన రాజుల చరిత్రలు - వంశ వృక్షాలూ పరిశీలిస్తే చతుర్వర్ణాల పుట్టుకను గురించి పురుష సూక్తమూ వేదాలూ చెబుతున్న విషయాలు పొసగవు. సూర్యచంద్రవంశాల క్రమాన్ని పరిశీలిస్తే రాజుల నుంచే బ్రాహ్మణులు వచ్చినట్టు

తెలుస్తుంది. (చూ. పట్టికలు అనుబంధం) (ఇవి యెనమండ్రం వెంకటరామయ్యగారి పురాణనామచంద్రిక 1879 లోనివి.)

**రాజులనుంచి బ్రాహ్మణులు**

మరీచి వంశంలో ఇక్ష్వాకు నుంచి రాజులు పుట్టారు.

ఇక్ష్వాకు సోదరుడైన నరిష్యంతుని వంశంలో అగ్నివేశుని నుంచి 'అగ్ని వేశ్యాయనము' అనే బ్రాహ్మకులం పెంపొందింది.

ఇక్ష్వాకు మరో సోదరుడు నభగుడు. ఇతని వంశంలోని రథీతరుని నుంచి రథీతర గోత్ర బ్రాహ్మణులు ఏర్పడ్డారు. రథీతరుని భార్య అంగిరసుని వల్ల సంతానం పొందిందనీ వారు అంగిరసులనే బ్రాహ్మణులయ్యారనీ (భాగవతం 9.153) చెబుతోంది.

ఇక్ష్వాకు సోదరులలో నరిష్యంతుడు అనే వాని సంతతివారు కొందరు మహర్షులై బ్రహ్మకులవంశ కర్తలయ్యారు.

ఇలాంటివి ఎన్నో.

పురూరవునికి ఊర్వశి వల్ల కలిగిన కొడుకులలో ఆయువు వంశంలోని యయాతి కొడుకులలో యదువునుంచి యాదవులు, ఇతర పుత్రుల నుంచి వేర్వేరు రాజ్యాధిపతులూ, ఒక కొడుకు సంతానం మ్లేచ్ఛులూ అయ్యారు.

ఆయువు మరో కొడుకు క్షత్ర వృద్ధుని వంశంలోని వారు కొందరు రాజులూ కొందరు మునులూ అయ్యారు.

ఆయువు మరో కొడుకు రంభుని వంశంలోని వారు బ్రాహ్మణులు అయ్యారు.

ఆయువు మిగతా కొడుకుల సంతానం రాజులయ్యారు.

యదువు వంశంలోంచి యదు వృష్ణి భోజ కుకుర అంధక రాజ వంశాలు ఏర్పడ్డాయి. విదర్భరాజవంశమూ ఏర్పడింది.

పూరుని వంశంలో కొన్ని వంశాలు బ్రాహ్మణవంశాలు అయ్యాయి.

ఇలా రాజ వంశాల నుండి బ్రాహ్మణ వంశాలు ఏర్పడ్డాయని పురాణాలు ఒక ప్రక్క చెబుతుండగా బ్రహ్మ ముఖం నుంచి బ్రాహ్మణులు పుట్టారనే వాదం ఎప్పుడు మొదలయిందో?

రాజుల నుండి బ్రాహ్మణ వంశాలతో బాటు రాజవంశాలూ ఏర్పడ్డాయి.

ఇక్ష్వాకుని సోదరుడైన కరూశుని వంశంవారు కారూశులనే క్షత్రియులై ఉత్తరాపథాన్ని పాలించారు. (చూ. అనుబంధం - 3.)

ఇక్ష్వాకుని మరో సోదరుడైన దిష్టుని కొడుకులలో నాభాగుడనే వానికి కర్మ వశం వల్ల వైశ్యత్వం కలిగిందట.

ఇక్ష్వాకు మరో సోదరుడైన పృషధ్రునికి శాపం వల్ల శూద్రత్వం కలిగింది.

'శూద్రులెవరు' అనే విషయంలో డా. అంబేద్కర్ చాలా లోతుగా అధ్యయనం చేశారు. భారతదేశానికి వలసలు వచ్చిన వివిధ జాతుల గురించీ వారు వచ్చిన మార్గాల గురించీ పటాలతో సహా వివరించారు.

పురాణాల ప్రకారం బ్రహ్మ పుత్రులలోనుంచే మానవ అసుర గణాలు వృద్ధి పొందటం కనిపిస్తుంది. మరీచి సంతానంలోని ఇక్ష్వాకు సంతతివారు రామలక్ష్మణులు - వీరు మానవులు. పులస్త్యుని సంతతివారు రావణ కుంభ కర్ణాదులు - వీరు రాక్షసులు.

పురాణ కథల్లో రామలక్ష్మణులు మానవులూ రావణాదులు రాక్షసులూ అయ్యారు. అంగిరసుని కొడుకు బృహస్పతి దేవగణాలకు గురువు. భృగువు సంతానంలోని శుక్రాచార్యులు అసుర గణాల గురువు.

పులహుని కొడుకులు కిన్నర కింపురుషులట.

వీరు వేర్వేరు వర్గాలుగా జనపదాలుగా స్థిరపడ్డారని అనుకోవాలి. ఈ విధంగా పురాణాలలోని విభిన్న కథనాలు చతుర్వర్ణాలు ఏర్పడిన విధానం గురించి భేదిస్తున్నాయి, అంటే అవి వేదాన్ని అంగీకరించటం లేదన్నమాటేనా?

షోడశరాజులు, షట్చక్రవర్తుల గురించి కథలు వేదధర్మాన్ని ప్రచారం చెయ్యటానికి ఉపకరించాయో లేదో గాని వర్ణధర్మాలను ప్రచారం చెయ్యటానికి మాత్రం బాగా ఉపకరించాయి.

ఈ రాజుల పేర్లు చరిత్రలో కనబడకపోయినా ఆ రాజ్యాలు / నగరాలు చరిత్ర పటంలో కనిపిస్తున్నాయి. ఇవి కచ్చితంగా చారిత్రక కథనాలు కాకపోయినా పరంపరాగతమైన గాథలను ఆధారం చేసుకుని విస్తరించినవై ఉండవచ్చు. రామాయణ, మహాభారతాలలో ప్రధానంగా కనిపించే సంఘటనలు కొన్ని మార్పులతో ప్రాచీన జైన బౌద్ధ గ్రంథాలలోనూ కనిపించటం వల్ల వీటి అస్తిత్వాన్ని పూర్తిగా కాదనలేము.

పద్దెనిమిది పురాణాలూ గుప్తుల కాలంలో (క్రీ.శ. మూడవ శతాబ్దం) ఇప్పుడు కనిపిస్తున్న పూర్ణ స్వరూపాన్ని సంతరించుకొన్నాయని చరిత్ర కారుల అభిప్రాయం.

ఈ కథలను పురోహిత వర్గం వారు తమకు అనుకూలంగా మార్చి ప్రచారం చేశారన్నది మాత్రం కాదనలేని సత్యం.

క్రీ.పూ. 5, 6 *శతాబ్దాల ప్రాంతంలో భారత* దేశంలో రెండు రకాల రాజకీయ వ్యవస్థలు ఉండేవట. 1. తెగ ప్రతిపాదికగా గల రాజరికాలు. 2. తెగ ప్రాతిపదికపై ఏర్పడ్డ గణ వ్యవస్థలు. గణ వ్యవస్థలు కనిపిస్తున్న రాజ్యాలు ప్రధాన స్రవంతికి దూరమైన ప్రజలతో కూడి ఉన్నట్లు కనిపిస్తుంది. పతనమైన క్షత్రియులుగా, శాపగ్రస్తులుగా మ్లేచ్ఛులుగా వీరిని వైదిక బ్రాహ్మణ గ్రంథాలు ప్రస్తావించాయి. వీరు వైదిక కర్మకాండను అనుసరించనివారూ. తండ్రుల కోపానికో కుల పురోహితుల కోపానికో గురై రాజ్యార్హత కోల్పోయిన రాజరికాల వారూ ఇతర శాపగ్రస్తులూను. అలాంటి ప్రజలే గణాలుగా కలిసి జీవించినట్టూ ఆరణ్యక జాతులుగా, ఊరి బయటి కులాలుగా ప్రచారంలోకి వచ్చినట్టూ భావించవచ్చు.

వైదిక కర్మకాండకు వీరు బయటి వారుగా ఎందుకున్నారన్న విషయాన్ని డా॥ అంబేద్కర్ చాలా విస్తృతంగా అధ్యయనం చేశారు. తమను తాము గొప్పగా భావించుకునే వర్గాలు తమకోసం ఒక కర్మకాండను - నియమావళినీ ఏర్పరచుకున్నాయి. తమను ఆర్యులుగా చెప్పకున్నాయి. ఇతరులను తక్కువగా చూశాయి. ఆ హైన్యతనూ హెచ్చుతగ్గుల వివక్షనూ భరించలేని కాలంలో కొన్ని వర్గాలు జైన బౌద్ధాల వైపు మొగ్గు చూపాయి. జైన బౌద్ధాల ఉధృతిని తట్టుకునే ప్రయత్నంలో వైదిక మతం తనను తాను సంస్కరించుకున్నది. విభిన్న సంప్రదాయాలను నిషేధాలను ప్రవేశపెట్టింది. ఆ క్రమంలో ఆ ఆర్య సంప్రదాయాల వెంట వెళ్ళని వారూ పాత పద్ధతులే అనుసరిస్తూ ఉండిన వారూ అనార్యులయ్యారు.

అప్పటికీ బలంగా ఉన్న ఆర్యసమాజం తమను వ్యతిరేకించిన వారిని ప్రధాన స్రవంతిలో కలవనీయకుండా

వెలివేసి అంటరాని - చెప్పరాని - వారిగా ముద్ర వేసి గ్రామాలకు దూరంగా పెట్టింది.

వైదిక కర్మకాండను పాటించటంలో ఏమరుపాటు చూపినవారు కూడా దేశ బహిష్కారానికి గురి అవటం చాలా కథల్లో కనిపిస్తుంది. ఇక్ష్వాకు కొడుకులలో ఒకడైన వికుక్షి వృత్తాంతం ఇందుకు ఉదాహరణ.

అష్టకా శ్రాద్ధం కోసం మాంసం తెమ్మని వికుక్షిని పంపారు. వికుక్షి అడవికి వేటకు వెళ్లాడు. చాల సేపటి వరకూ ఏ జంతువూ దొరక లేదు. అతను అలసిపోయాడు. చివరకు ఒక కుందేలు దొరికింది. దాని చంపి ఆకలిగా ఉన్నందున కొంత మాంసం తిని మిగతాది పట్టుకుని ఇంటికి వచ్చాడు. ఎంగిలి పితృకార్యానికి పనికిరాదు. శ్రాద్ధ క్రియలో ఇలా చేసినందుకు తండ్రి కోప్పడి కులగురువు సలహాపై వికుక్షిని రాజ్యం నుండి వెళ్ళగొట్టాడు. (తర్వాత చాలా కాలానికి అతడు రాజయ్యాడనుకోండి. అది వేరే విషయం).

పూలే వంటి సంస్కర్తలు ఎంత కృషి చేసినా డా॥ అంబేద్కర్ వంటి మేధావులు ఎంత పోరాడినా "మానవులంతా ఒకటే. అందరికీ ఒకే ధర్మం ఒకే న్యాయం ఉండాలి" అని ఎన్ని

చట్టాలు చేసినా అవి అగ్ర వర్ణ సమాజం ప్రతిష్ఠించి పెట్టిన సంప్రదాయపు మూలాలను పెకలించలేకపోతున్నాయి.

సంస్కరణలు పైపైన వస్తే చాలదు. మూలాల నుండి రావాలి. సమాజంలో కుల/వర్గ/ లింగ వివక్షను పోషించిన ప్రాచీన సారస్వతంలోనే ఈ మూలాలున్నాయి. వర్ణ వ్యవస్థను పరిరక్షించే నెపంతో చేసిన శంబుక వధలోనూ, పరాయి ఇంట ఉన్నదనే అనుమానంతో సీతను అగ్ని ప్రవేశం చేయించిన రామాయణ కావ్యంలోనూ, (యజ్ఞ) హింసను ప్రశ్నించిందనే నెపంతో చేసిన తాటక సంహారంలోనూ, నీళ్ళు తేవటంలో ఆలస్యం చేసినందుకు అనుమానించి కొడుకు చేత తల్లిని చంపించిన జమదగ్ని కథలోనూ ఎవరూ నేర్పకుండానే స్వయంగా బాణ విద్య నేర్చుకున్నాడన్న అక్కసుతో ఏకలవ్యుని బొటన వేలు బలి తీసుకోవటంలోనూ, వేదాలను దొంగతనంగా విని నేర్చుకున్నాడన్న నెపంతో చేసిన దైత్య వధలోనూ ఈ వ్యవస్థ మూలాలున్నాయి. వీటిని విశ్లేషించుకుని చర్చించుకుని మనను మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది.

పురాణగాధలలో కనిపించే కథా సంఘటనలు హెచ్చుతగ్గుల వ్యవస్థను సుస్థిరం చేసేందుకు ఉద్దేశించినవే.

ప్రపంచ దేశాలన్నీ విద్యా వైజ్ఞానిక రంగాలలో సామాజిక ఐక్యతతో ముందుకు పురోగమిస్తున్న కాలంలో భారత దేశం, సంస్థాగతమైన వర్ణధర్మ సంప్రదాయాలతో స్తంభించి పోయి ఉంది. వ్యక్తి స్వేచ్ఛ, ఆలోచన, అనేవి పెరగకుండా కులాల పరిగణనతో కలతలు పెంచుతూ ఉన్నది. ప్రపంచ మంతా విశ్వాంత రాళాలను చూడడానికి ఉత్సాహపడుతుంటే భారత దేశం తన పౌరులకు త్రిశూలాలూ, 'రామ' నామపు ఇటుకలూ పంచి పెడుతూ వారి బౌద్ధిక పరిధిని పరిమితం చేస్తూ, అంతర్గత సంఘర్షణలకు సిద్ధం చేస్తూ పాత రాతియుగానికి నెడుతూ ఉంది.

సురాసుర యుద్ధాల లాంటివి పునరావృతం కావాలని ఒక వర్గం వారి కోరిక.

ఈ నేపధ్యంలో నిచ్చెనమెట్ల వ్యవస్థ పునరావృతం కాకుండా జాగ్రత్త పడవలసిన అవసరం ఉంది. ఆ బాధ్యత ముఖ్యంగా పీడిత జనాలపైనే ఉంది.

అపర విష్ణువుల చేతిలో హతమారి పోకుండా మెలకువగా ఉండవలసిన అవసరమూ ఉంది.

**అనుబంధం 1:**

## సృష్టి క్రమం - (మత్స్య పురాణం ప్రకారం)

విష్ణువు నాభిలోంచి

|

బ్రహ్మ. బ్రహ్మసంకల్పం వల్ల

|

మరీచి

|

కశ్యపుడు (భార్య అదితి)

|

సూర్యుడు (భార్య సంజ్ఞ)

|

మనువు (భార్య శ్రద్ధ)

|

ఇళ (సుద్యుమ్నుడు) — ఇక్ష్వాకు మొ॥ పది మంది కొడుకులు (సూర్యవంశీయులు)

|

పురూరవుడు (చంద్రవంశకర్త)

**మనువు:**

సూర్యచంద్ర వంశాల కర్తగా పేర్కొనబడే మనువును ఒక గొప్ప జల ప్రళయం తర్వాత తన వంశాన్ని వృద్ధి చేసిన రాజుగా చెప్పుకోవచ్చు. (అనుబంధం). ఇది క్రీ.పూ. 3110 ప్రాంతం అని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ జల ప్రళయాన్ని (పెద్ద వరద) శతపథ బ్రాహ్మణం పేర్కొన్నది. అంతకుపూర్వమే క్రీ.పూ. 3102లో కలియుగం ఆరంభమైందని సంప్రదాయ వాదుల వాదం.

మనువుకు ఇళ అనే కూతురు పుట్టింది. మునులు మహిమవల్ల ఆమెను పురుషునిగా (సుద్యుమ్నుడు) చేశారు. సుద్యుమ్నుడు వేటకు వెళ్లి ఒక వనంలో ప్రవేశించి స్త్రీగా అయ్యాడు. ఆమెను (ఇల) చంద్రుని కొడుకైన బుధుడు ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఇలకూ బుధునికీ పుట్టిన పురూరవుడు. చంద్రుని మనుమడు కావటం వల్ల చంద్రవంశ కర్త అయ్యాడు.

ఈ వంశంలోని వారిలో విశ్వామిత్రుడు (గాధి కొడుకు) తపస్సంపద చేత బ్రహ్మర్షి అయ్యాడు. ఒక సందర్భంలో తన మాట వినని కొడుకులను మ్లేచ్ఛులుగా శపించాడు. (భాగ. 9.421-)

## అనుబంధం 2

పురూరవుడు (ఊర్వశి)

ఆయువు

నహుషుడు

యయాతి

యదువు తుర్వసుడు ద్రుహ్యుడు అనువు పూరుడు

యయాతికి దేవయానివల్ల యదువు, తుర్వసుడు ద్రుహ్యుడు, అనువు అనే పుత్రులూ శర్మిష్ఠ వల్ల పూరుడు అనే పుత్రుడూ కలిగారు. తన ముసలితనాన్ని తీసుకొని వారి యౌవనాన్ని తనకు ఇమ్మని యయాతి అడిగినప్పుడు పుత్రులు అందుకు ఒప్పుకోలేదు. యదువంశం వారు రాజ్యానికి అయోగ్యులుగా తుర్వసు వంశం వారు ధర్మాధర్మ వివేకశూన్యులైన సంకీర్ణ వర్ణ కిరాతులకు రాజులుగా ద్రుహ్యువంశం వారు ఉపప్లవ సంతార్యమైన దేశాలకు రాజులుగా అవుతారనీ, అనువు ముసలితనాన్ని నిందించాడు గనక అతని వంశం వారు ముసలితనం వచ్చేవరకు జీవించకుండా తరుణ వయస్సులోనే మరణిస్తారనీ యయాతి వారిని శపించాడు. (భార. ఆది. 3-195)

యయాతి ముసలితనం తీసుకోవటానికి శర్మిష్ఠ కొడుకు పూరుడు ఒప్పుకున్నాడు. యయాతి పూరునికే రాజ్యం ఇచ్చాడని చెప్పినాగాని ఇతర పుత్రులకు కూడా రాజ్యం పంచాడని భాగవతం చెబుతోంది.

యదువుకు దక్షిణ భాగం, ద్రుహ్యునికి పూర్వభాగం, తుర్వసునికి పశ్చిమ దిక్కున, అనువుకు ఉత్తర దిక్కున గల భూ భాగాలు రక్షించవలసిందిగా ఇచ్చాడట. (తె. భాగ. 9-584). పూరునికి పట్టాభిషేకం చేశాడట. (9-585).

వర్ణాంతర వివాహం కారణంగా దేవయాని కుమారుల సంతానం ఉత్తమక్షత్రియులుగా చలామణీ కాలేదు. యదువు సంతాన యాదవులయ్యారేమో. వారు రాజ్యార్హులు కాలేదు. గనకనే 'యాదవుల్ రాజులే యవనిమీద..' అని కృష్ణుణ్ణి పరిహాసం చేసే సందర్భం వచ్చి ఉండవచ్చు.

ఇక్ష్వాకు రాజులూ పురోహిత వర్గమూ వీరిని కొంత తక్కువ స్థాయిలోనే చూసినట్లు అనిపిస్తుంది. కొంత కాలానికి శశిబిందుని నేతృత్వంలో యాదవులు బలవంతులయ్యారు. వీరే హైహయులుగా వ్యవహారంలోకి వచ్చారు.

శక యవన పహ్లవ కాంభోజ పరదస రాజులు వీరితో సఖ్యంగా ఉండేవారట. కొన్ని తరాల పాటు వీరు ఉద్ధతులైన రాజులుగా చరిత్రలో కనిపిస్తారు.

పరశురాముని కాలం నాటికి వీరు క్షత్రియులుగా వ్యవహారంలో ఉన్నారు. పరశు రాముని చేతిలో మరణించిన రాజులలో వీరూ ఉన్నారు. అప్పటికి వీరి రాజ్యాలు దక్షిణానికి కూడా విస్తరించాయి.

యయాతికి సుమారుగా 60 తరాల తర్వాత హరప్పా, ఆర్య సంస్కృతులు బాగా కలిసిపోయిన కాలంలో పరశురాముడు అగస్త్యుడు దక్షిణాదికి వచ్చారట. విదర్భ రాజు కూతుళ్ళలో లోపాముద్ర అగస్త్యుని భార్య; వైదర్భి ఇక్ష్వాకు రాజైన సగరుని భార్య.

యయాతికి 95 తరాల తర్వాత కురు పాండవ యుద్ధం జరిగింది.

కాలక్రమంలో తుర్వసునివంశం పూరు వంశంలో కలిసి పోయింది. (దత్తత లాంటి వాని వల్ల). ద్రుహ్యుని సంతతివారు గాంధారం మొ॥ ఉత్తర రాజ్యాలు పాలించారట. అనువు వంశంలోని సుతవుడు దైత్యుడైన బలిని దత్తత తీసుకున్నాడట. బలి సంతతి వారు కొందరు క్షత్రియులు, మరికొందరు బ్రాహ్మణులై విప్రసంతతిని వృద్ధి చేశారట. (మత్స్య. అధ్యా. 48). అంగులు, వంగులు, సుహ్మలు, పుండ్రులు, కళింగులు ఇలాంటి వారు. వీరి జనపదాలకూ ఇవే పేర్లు. బలి దైత్యుడయినా మానవ స్త్రీ వల్ల సంతానాన్ని వృద్ధి చేశాడు. బలి ప్రేరణ వల్ల బలి భార్యకు దీర్ఘతముడు అనే మునివల్ల కలిగిన క్షేత్రజులు ఈ కొడుకులు. చాలా వంశాలలో ఒకే తండ్రి కొందరు క్షత్రియులనూ కొందరు బ్రాహ్మణులనూ పుట్టించటం కనిపిస్తుంది.

**అనుబంధం 3**

మనువు పుత్రులలో సుద్యుమ్నుని తర్వాత వారు పదిమంది.

1. ఇక్ష్వాకు 2. నృగుడు 3. శర్యాతి 4. దిష్టుడు 5. ధృష్టుడు 6. కరూశుడు 7. నరిష్యంతుడు. 8. పృషధ్రుడు 9. నభగుడు. 10.కవి.

మనువు తుమ్మితే ఆ ముక్కు రంధ్రాల నుండి ఇక్ష్వాకు వెలువడ్డాడని మరో కథ ఉంది. (తె. భాగ. 9-154). ఇక్ష్వాకు సూర్యవంశ కర్తగా పేరొందాడు. ఇతడు మధ్య దేశాన్ని (హిమాలయం, వింధ్య, వినశనం ప్రయాగ ఈ నాలుగింటినడుమ దేశం) పాలించాడు. ఇక్ష్వాకుకు వంద మంది కొడుకులు. వారిలో వికుక్షి, నిమి, దండకుడు అనే ముగ్గురు ఆర్యావర్తాన్ని పాలించారు. 27 మంది తూర్పు భూమినీ 47 మంది ఉత్తర దక్షిణ ప్రాంతాలనూ కొందరు పడమటి దేశాన్నీ పాలించారు. వికుక్షి కొడుకు కకుత్స్థుడు. వారికి ఆరోతరంవాడు శవస్తుడు, శావస్తి నగర నిర్మాత. వారికి పదోతరం వాడు మాంధాత.

ఆంధ్ర దేశంలో ఏదైనా పాత విషయాలు చెప్పేటప్పుడు ఇక్ష్వాకుల నాటిది అనీ మాంధాత కాలం నాటిదనీ అనటం వాడుకలో ఉంది.

ఇక్ష్వాకుని సోదరులలో మూడోవాడైన శర్యాతి కూతురు సుకన్య చ్యవనుని (ముని) భార్య. శర్యాతికి కొడుకులు ముగ్గురు. వారి వంశంలో రైవతుడు సముద్రంలో కుశస్థలి అనేనగరం నిర్మించాడట. అతనికి 100 మంది కొడుకులు. ఒక కూతురు రేవతి. ఆమె బలరాముని భార్య.

· నాలుగో సోదరుడైన దిష్టుని వంశంలో 12 తరాలకు నాభాగుడనే వానికి కర్మవంశం వల్ల వైశ్యత్వం కలిగింది. అంటే వృత్తి పరంగా వైశ్యుడయ్యాడన్నమాట.

ఆరో సోదరుడు కరూశుని సంతతి కారూశులనే క్షత్రియులు, ఉత్తరాపథాన్ని పాలించారు.

ఏడో సోదరుడైన నరిష్యంతుని సంతతిలో కొందరు మహర్షులై బ్రహ్మకుల వంశకర్తలయ్యారు. పౌరోహిత్యం వృత్తిగా స్వీకరించి ఉండవచ్చు.

ఎనిమిదో వాడైన పృషధ్రుడు గురువైన వసిష్ఠుని ఆజ్ఞ ప్రకారం ఆవులను రక్షిస్తుండేవాడు. ఒకనాటి వర్షపురాత్రి ఆవుల కొట్టంలోకి పెద్దపులి వచ్చి ఒక ఆవును పట్టుకుంది. పృషధ్రుడు చీకట్లో పులి అనుకుని ఆవును చంపాడు. 'నీవు రాజత్వం పోయి శూద్రుడవు అవుతావ'ని వసిష్ఠుడు శపించాడు. అడవులకు వెళ్ళి నియమవంతమైన జీవితం గడుపుతూ తపస్సు చేసుకుంటూ పృషధ్రుడు చివరకు కార్చిచ్చులో పడి ప్రాణాలు వదిలాడట. శాపం వల్ల శూద్రులవటం సారాంశం. పొరపాట్లకు ఇది శిక్ష.

తొమ్మిదోవాడు - హరిభక్తుడు. పదోవాడు కవి; రాజ్యమూ సంపదలూ విడిచి అడవులకు వెళ్లిపోయాడట. మరిన్ని వివరాలు సూర్యచంద్ర వంశ వృక్షాలలో చూడవచ్చు.

**కొన్ని వివరణలు:**

| | |
|---|---|
| అంగదేశం | గంగానదికి కుడి గట్టున తీరంలో ఉండిన రాజ్యం. అంగదేశానికి చంపానగరం రాజధాని. దీనినే అంగపురి అనీ అంటారు. ఇది గంగకు పశ్చిమంగా రాతినేలలలో ఉండేదట. |
| అయోధ్య | పూర్వపు కోసల రాజ్యాలలో సరయూనదీ తీరాన ఉన్న నగరం. సూర్య వంశీయులకు రాజధానిగా ఉండేది. |
| అమరావతి | విదర్భ దేశంలోని ఒక నగరం. పురాణాలు ప్రస్తావించిన ఇంద్రుని రాజధాని ఇదే అయి ఉండాలి. విదర్భ దేశం కుంతల దేశానికి ఉత్తరంగా కృష్ణా నర్మదా నదుల మధ్య ప్రదేశంలో విస్తరించి ఉండేదట. ప్రాచీన బీదరు ప్రాంతం దీనిలో ఉండేదేమో. వైశాల్యం కారణంగా దీనిని మహారాష్ట్రము అని వ్యవహరించే వారు. కుండినపురం (విదర్భ) దీని ప్రాచీన రాజధాని. |

వరదా (వార్ధా) నది విదర్భను రెండు భాగాలుగా విడదీస్తోంది. ఉత్తరభాగానికి అమరావతి దక్షిణ ప్రాంతానికి ప్రతిష్ఠానం రాజధానులు. ప్రతిష్ఠానం సూర్యవంశ రాజుల రాజధాని. వారికీ దేవతల రాజ్యానికీ రాకపోకలుండేవి.

అశ్మకులు — i. అశ్మకదేశపువారు. తిరువాన్కూరుకు ఇది ప్రాచీన నామం. ఆశ్మకుడు అనే రాజు కల్మాష పాదునికొడుకు. ఇతని తల్లి ఇతనిని ప్రసవించలేక అవస్థపడుతూంటే వసిష్ఠుడు రాతితో గర్భాన్ని గీసి (చీరి) శిశువును బయటకు తీశాడట.

ii. అశ్మక (అస్సక), మూలక తెగలు ఇరుగు పొరుగు ఆంధ్ర జనపదాలని బౌద్ధ వాఙ్మయం చెబుతోంది. అశ్మక జనపదానికి పోతన (బోధన్), మూలక జనపదానికి పైఠాన్ (ప్రతిష్ఠానం) రాజధానులట.

ఆర్యావర్తం ఆర్యులు చరించిన భూమి. ఇది 1. సరస్వతీ దృషద్వతీ నదుల నడిమి ప్రదేశం అనీ 2. హిమవంతానికీ, వింధ్యపర్వతానికీ నడుమనూ తూర్పు పశ్చిమ సముద్రాల నడుమనూ ఉండే భూమి అనీ 3. ఆదర్శమనే ప్రదేశానికి తూర్పున కాలకవనానికి పడమట, హిమవంతానికి దక్షిణాన పారియాత్ర పర్వతానికి ఉత్తరాన ఉన్న భూమి అని చెబుతారు. మనుస్మృతి (2-22)లో కొంత వివరణ ఉంది.

ఆర్యులు — వేద సంప్రదాయాన్ని అనుసరించేవారు. 'ఆర్య' పదం జాతి వాచకంగాను గౌరవవాచకంగాను వ్యవహారంలో ఉంది.

జంబూ ద్వీపం — సప్తద్వీపాలలో ఒకటి.

**మధ్యదేశం:** ఉత్తరాన హిమాలయాలు, దక్షిణాన వింధ్య పర్వతాలు, తూర్పున సరస్వతీ నది ప్రవహించి అంతరించిన ప్రాంతం, పడమర ప్రయాగ ఎల్లలుగా ఉన్న దేశం. ఇందులో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు ఎక్కువగా ఉంటారట.

ప్రతిష్ఠానం — సూర్యవంశపురాజైన పురూరవుని రాజధాని. ప్రయాగకు దగ్గరలో గంగకు ఉత్తర తీరంలో ప్రయాగ జిల్లాలో ఉది.

బాహ్లికులు — పంజాబులోని తెగలకు సాధారణ వ్యవహారనామం. సింధునది - దాని ఉపనదుల పరీవాహ ప్రాంతాల్లో (భారత దేశ హద్దుల బయట) ఉండేవారట. ఈ ప్రాంతాలు గుర్రాలకు ప్రసిద్ధి.

| | |
|---|---|
| బ్రహ్మావర్తం | సరస్వతీ దృషద్వతీ నదుల మధ్య ప్రదేశం. ఇది దేవ నిర్మితం అని ప్రచారం జరిగింది. (మనుస్మృతి. 2-17) |
| భరత వర్షం | జంబూ ద్వీపంలో మేరువుకు దక్షిణంగా (పశ్చిమంగా) తొమ్మిదివేల యోజనాలు విస్తరించిన ప్రదేశం. ఇంద్రము, కేసరువు, తామ్రవర్ణము, గభస్తి, నాగద్వీపము సౌమ్యము, గంధర్వము, వారుణము, భారతము అనే భాగాలతో కూడి ఉంది. ఇందులో తూర్పున కిరాతులు, దక్షిణ పశ్చిమాలలోయవనులు ఉత్తరంలో మునులు ఉంటారట. |
| భారతదేశం | భరత వర్షంలోని తొమ్మిది భాగాలలో ఒకటి. హిమవత్పర్వతానికి దక్షిణంగా సముద్రానికి ఉత్తరంగా ఉన్న భూభాగం. |
| మద్రదేశం | ఈజిప్టు ప్రాంతం. రాజధాని శల్యపురం. పురూరవసుని మద్రరాజుగా మత్స్య పురాణం (అధ్యా. 119) అభివర్ణించింది. |
| మేరువు | జంబూ ద్వీపానికి మధ్యలో ఉన్న పర్వతం. ఇది ఇలావృతం మధ్యలో ఉన్నదని కొన్ని చోట్ల ఉంది. మేరు పర్వతానికి దక్షిణదిశగా భారత, కింపురుష, హరివర్షములూ ఉత్తరాన రమ్యక హిరణ్యక కురువర్షములూ, తూర్పున భద్రశ్వవర్షము, పడమటకేతుమాలవర్షము నడుమ సుమేరువుకు చేరువుగా ఇలా వృతము ఉన్నాయట. (మత్స్య పురాణం). వర్షము అంటే స్థానం / రాజ్యం / దేశం / ప్రదేశం అని అనుకోవచ్చు. మేరు పర్వతానికి దక్షిణంలో హిమవాన్, హేమకూటం, నిషధం అనే పర్వతాలున్నాయట.<br>కొందరి ప్రకారం మేరు పర్వతం ఆఫ్రికాలో ప్రస్తుత టాంజానియాలో ఉన్నది. |
| మ్లేచ్ఛదేశం | ఏ దేశంలో చతుర్వర్ణాల వ్యవస్థ ఉండదో అది మ్లేచ్ఛ దేశం.<br>"చాతుర్వర్ణ్య వ్యవస్థానం యస్మిన్ దేశే న విద్యతే<br>తం మ్లేచ్ఛ విషయం ప్రాహు, రార్యావర్త మతః పరమ్"<br>మ్లేచ్ఛదేశం కానిది శిష్ట జనాశ్రయదేశం ఆర్యావర్తం అంటున్నారు. |

| | |
|---|---|
| | మ్లేచ్ఛులూ ఆర్యులూ ఇరుగుపొరుగు జనపదాలవారే అని వరాహపురాణం (అధ్యా. 85. వ. 2) చెబుతోంది. |
| మ్లేచ్ఛులు | దక్షప్రజాపతి మానస పుత్రులు (మత్స్యపురాణం. అ. 4. 53-55) |
| యవనులు | గ్రీసు, టర్కీ దేశాల వారు |
| విదర్భ దేశం | చూ. అమరావతి |
| శకులు | భారతదేశ వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని తెగలు. (సిథియన్లు అనీ ప్రతీతి) |
| సప్తద్వీపాలు | జంబూ, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కర ద్వీపాలు. వీటిలో జంబూ ద్వీపం మధ్యలో ఉన్నదట. |

A C. No. 81080
-500 044.

## ఉపయుక్త గ్రంథాలు


1. ఆంధ్రమహా భారతము. వావిళ్ళ వారి ముద్రణ.
2. పురాణ నామ చంద్రిక. (1879) యెనమండ్రం వెంకటరామయ్య.
3. మనుస్మృతి
4. శ్రీ మత్స్య మహాపురాణం
5. శ్రీ మహా భాగవతం
6. శ్రీ వరహ మహాపురాణం.
7. శ్రీ శివ మహాపురాణం
8. శ్రీ స్కంద పురాణం
9. హిందూ దినపత్రిక (7.7.2002) సుంధాంశు రనడే గారి వ్యాసం.
10. Indian History and Culture (1958) B.S.L Hanumantha Rao, K. Basaveswara Rao



**ఈ సీరిస్‌లో..**

| | | |
|---|---|---|
| పురాణాలు కులవ్యవస్థ - I | - సత్య హరిశ్చంద్రుడు | వెల. 10-00 |
| పురాణాలు కులవ్యవస్థ - II | - దశావతారాలు | వెల. 18-00 |

“భారత దేశం వర్గ సంఘర్షణల నిలయమే కాదు, పోరాటాల భూమి కూడా. అలాంటి వర్గ పోరాటాలలో అత్యంత తీవ్రమైనది బ్రాహ్మణులకు క్షత్రియులకు మధ్య జరిగినటువంటిది. ఈ రెండు వర్ణాల మధ్య జరిగిన వర్గ పోరాటాన్ని ప్రాచీన భారతీయ సారస్వతం చక్కగా చిత్రించింది. మొట్ట మొదట నమోదయిన సంఘర్షణ బ్రాహ్మణులకు క్షత్రియుడైన వేనునికి మధ్య జరిగినటువంటిది... బ్రాహ్మణులకు క్షత్రియరాజు పురూరవునికి మధ్య జరిగిన పోరాటం. రెండవది... బ్రాహ్మణులకు నహుషునితో జరిగిన ఘర్షణ మూడోది... నిమికి బ్రాహ్మణులకు జరిగిన సంఘర్షణ నాల్గవది” అన్నారు డా. అంబేద్కర్ గారు. (డా.బాబాసాహెబ్ రచనలు - ప్రసంగాలు సం.3 పుట. 55)

ఆ స్ఫూర్తితో చేసిన పరిశీలన ఇది. వర్ణధర్మ వ్యవస్థను ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ప్రచారం చేసిన షట్చక్రవర్తుల కథల పరిశీలన ఈ గ్రంథంలో చూడవచ్చు.

డా॥ బి. విజయభారతి తెలుగు అకాడమీ డైరెక్టరుగా పదవీ విరమణ చేశారు. వారు అనేక పుస్తకాలు రచించారు. వాటిలో అంబేద్కర్, పూలేల జీవిత చరిత్రలు ప్రముఖమైనవి. పురాణాలు - కులవ్యవస్థ పైన ఇది మూడవ పుస్తకం. మొదటిది సత్య హరిశ్చంద్రుడు, రెండవది దశావతారాలు.